ప్రజాశక్తి
గురువారం 1 మే, 2025
5
శ్రీకాకుళం



ఘనంగా బసవేశ్వర జయంతి



బసవేశ్వర చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

శ్రీకాకుళం: కుల, వర్ణ, లింగ భేదాలను వ్యతిరేకించిన మహాత్మ బసవేశ్వర బోధనలు దేశవ్యాప్తంగా ప్రభావం చూపాయని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. కలెక్టరేట్‌లో బసవేశ్వర జయంతి వేడుకలను బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యాన బుధవారం నిర్వహించారు. బసవేశ్వర చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఆయన 12వ శతాబ్దపు తత్వవేత్తగా సమానత్వాన్ని బోధించారని తెలిపారు. అనుభవ మంటపాన్ని స్థాపించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో డిఆర్ఒ వెంకటేశ్వరరావు, పర్యాటక శాఖ అధికారి నారాయణరావు, సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు, కలెక్టరేట్‌లోని పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సాగుకు సన్నద్ధత

మరో నెల రోజుల్లో ఖరీఫ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో అటు అధికారులు, ఇటు రైతులు సన్నద్ధమవుతున్నారు. జూన్ ఒకటో తేదీ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. పంటల సాగు, విత్తనాల పంపిణీపై వ్యవసాయశాఖ అధికారులు ఇప్పటికే ఒక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. జిల్లా అవసరాలను గుర్తించి రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువుల అందజేతకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం నుంచి జిల్లాకు సరఫరా అయిన వెంటనే ఈనెల మూడో వారం నుంచి రైతులకు అందించేందుకు అధికారులు సమాయాత్తమవుతు న్నారు. కట్టెజనుము, జీలుగ, పచ్చిరొట్ట విత్తనాలను ఇప్పటికే 50 శాతం సబ్సిడీపై అందిస్తున్నారు. మరోవైపు రైతులు వేసవి దుక్కుల పనుల్లో నిమగ్నమయ్యారు.

- ఖరీఫ్ - 2025
- కార్యాచరణ సిద్ధం
- 4,58,618 ఎకరాల్లో పంటల సాగుకు ప్రణాళికలు
- జిల్లా రైతుల అవసరాలకు 42,120 క్వింటాళ్ల విత్తనాలు
- 69,050 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని ప్రతిపాదనలు


విత్తనాలు జల్లుతున్న రైతు (ఫైల్)

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో 2025 ఖరీఫ్‌లో అన్నిరకాల పంటలు కలిపి 4,58,067 ఎకరాల్లో వేసేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. అందులో 4,21,680 ఎకరాల్లో వరి పంట సాగవుతుందని అంచనా వేశారు. సజ్జలు 250 ఎకరాల్లో సాగు ఉండొచ్చని అధికారులు అంచనాలు రూపొందించారు. మొక్కజొన్న 2,500 ఎకరాలు, రాగులు 375 ఎకరాలు వేయనున్నారు. పప్పుధాన్యాలకు సంబంధించి కంది, పెసర, మినప పంటలను చెరో 250 ఎకరాల్లో రైతులు సాగు చేసే అవకాశముందని అంచనా వేశారు. వేరుశనగ 2,750 ఎకరాలు, నువ్వులు 50 ఎకరాల్లో సాగవుతుందని భావిస్తున్నారు. పత్తి 3,751 ఎకరాల్లో, గోగు పంట 250 ఎకరాల్లో సాగు చేయనున్నారు. చెరుకు 3,750 ఎకరాల మేర సాగయ్యేలా ప్రణాళికలు రూపొందించారు.

41,120 క్వింటాళ్ల విత్తనాలకు ప్రతిపాదనలు

ప్రస్తుత ఖరీఫ్‌కు అన్నిరకాల విత్తనాలు కలిపి 41,120 క్వింటాళ్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపారు. జిల్లాలో ఈ ఏడాది ఎంటియు 1061 రకం సాగు చేసేందుకు రైతులు మక్కువ చూపుతున్నట్లు తెలుస్తోంది. ఈ రకం విత్తనాలను సరఫరా చేసేందుకు వ్యవసాయశాఖ 8,700 క్వింటాళ్లు అవసరమని ప్రతిపాదనలు పంపింది. అదేవిధంగా స్వర్ణ రకం విత్తనాలు 8,320 క్వింటాళ్లు కావాలని ప్రతిపాదనలు పంపారు.

జిల్లా అవసరాలకు 69,050 మెట్రిక్ టన్నుల ఎరువులు

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో అన్నిరకాల ఎరువులు కలిపి మొత్తం 69,050 మెట్రిక్ టన్నులు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపారు. అందులో ప్రధానమైన యూరియా 42,225 మెట్రిక్ టన్నులు కావాలని ప్రభుత్వానికి నివేదించారు. డిఎపి 17,206 మెట్రిక్ టన్నుల అవసరమని ప్రతిపాదించారు. మోనోపాస్ఫేట్ 4,174 మెట్రిక్ టన్నులు, సూపర్‌పాస్ఫేట్ ఎరువులు 296 మెట్రిక్ టన్నులు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అదేవిధంగా కాంప్లెక్స్ ఎరువులు 5,149 మెట్రిక్ టన్నుల మేర ఎరువులు ఈ సీజన్‌లో అవసరమవుతాయని ప్రతిపాదించారు.

50 శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

ఎరువులు, పురుగుమందులు అధికంగా వాడడంతో భూసారం క్రమేణా దెబ్బతింటోంది. భూమిలో సేంద్రీయ పదార్థం దెబ్బతిని నీరు నిల్వ చేసుకునే సామర్థ్యం తగ్గిపోతోంది. దీంతో పచ్చిరొట్ట విత్తనాలు వేసుకునేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఖరీఫ్‌లో వెయ్యి క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులో ఉంచుతున్నారు. ఇందులో కట్టెజనుము 412 క్వింటాళ్లు, జీలుగ 873 క్వింటాళ్లను రైతులకు అందుబాటులో ఉంచుతున్నారు. వీటిని 50 శాతం రాయితీపై అందించనున్నారు.

ఈ నెల మూడో వారంలో విత్తనాలు పంపిణీ

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కార్యచరణ ప్రణాళిక తయారు చేసి ప్రభుత్వానికి పంపాం. జిల్లా అవసరాలకనుగుణంగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుంచి సరఫరా వచ్చిన వెంటనే రైతులకు అందిస్తాం. ఇప్పటికే పచ్చి రొట్ట వితనాల పంపిణీని ప్రారంభించాం. రైతు భరోసా కేంద్రాల నుంచి వచ్చిన ప్రతిపాదనలకనుగుణంగా వరి, ఇతర రకాల విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నాం.విత్తనాల కోసం ఈ నెల 22 తర్వాత రిజిస్ట్రేషన్లు ప్రారంభిస్తాం. ఈ నెల మూడో వారంలో వరి విత్తనాలు పంపిణీ చేస్తాం.

- త్రినాథస్వామి, వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు

అధికారులు పంపిన వరి విత్తన రకాల ప్రతిపాదనలు ఇలా

వరి	విత్తన రకం	ప్రతిపాదనలు (క్వింటాళ్లలో)
ఎంటియు	1061	8,700
ఇంద్ర		
ఎంటియు	1064	3,250
అమర్		
ఎంటియు	1121	8,320
శ్రీధృతి		
ఎంటియు	7029	3,800
స్వర్ణ		
ఎంటియు	1318	2,050
ఆర్‌జిఎల్	2537	2,900
శ్రీకాకుళం సన్నాళ్లు		
బిపిటి	3291	2,000
సోనామసూరి		
బిపిటి	5204	6,600
సాంబమసూరి		
ఎంటియు	1224	3,500
మార్టురు సన్నాలు		



మాట్లాడుతున్న గోవిందరావు

6న కళా జాతర

కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా

ప్రజాశక్తి - పలాస

కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా ఈనెల ఆరో తేదీన నిర్వహిస్తున్న కళా జాతరను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు మద్దిల రామారావు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయ ఆవరణలో కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షులు కొమర వాసు అధ్యక్షతన మేధోమదన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్గో ఎయిర్ పోర్టు కోసం బలవంతపు భూసేకరణ ఆపాలని డిమాండ్ చేశారు. సముద్రతీర ప్రాంతాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టపెట్టొద్దన్నారు. తరతరాలుగా జీవనం సాగిస్తున్న ప్రజల భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడం, జిల్లాకు రక్షణ కవచంగా ఉన్న తీర ప్రాంతంలో లక్షలాది చెట్లు నరికి పర్యావరణానికి ముప్పు తేవడం జిల్లా అభివృద్ధి ఎలా అవుతుందని కేంద్ర పౌర విమానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుని ప్రశ్నించారు. ఇక్కడ ప్రజలు ఎవరూ కార్గో ఎయిర్‌పోర్టును కోరడం లేదని, వంశధార రిజర్వాయర్‌ను పూర్తి చేసి శివారు భూముల వరకు రెండు పంటలకు నీరివ్వాలని కోరుతున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారే అధికారంలో ఉందని, నేరడి బ్యారేజీ కోసం నోటిఫికేషన్ ఎందుకు వేయించడం లేదని కేంద్రమంత్రిని ప్రశ్నించారు. ఎయిర్‌పోర్టు వస్తే ఉద్యోగాలు వస్తాయని అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని, ఇప్పటికే జిల్లాలో నిర్వాసితులైన ప్రజలకి ఎవరికైనా ఒక్క ఉద్యోగమైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసి, ఆరో తేదీన నిర్వహించే కళా జాతరలో ఎక్కువ మంది పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ కార్యదర్శి జోగి అప్పారావు, ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యులు వంకల మాధవ రావు, పి.కుసుమ, సిపిఐ నాయకులు చాపర వేణు, రైతు కూలీ సంఘం నాయకులు కోనేరు రమేష్, సిఐటియు కార్యదర్శి ఎన్.గణపతి, జె.భాగ్యలక్ష్మి, పోరాట కమిటీ నాయకులు ఎల్.రామస్వామి, జి.లోకనాథం, ఎన్.పరశురాం పాల్గొన్నారు.

శ్రామికులే అభివృద్ధిలో భాగస్వాములు

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు



ప్రజాశక్తి - కోటబొమ్మాళి

శ్రామికులే అభివృద్ధిలో అసలైన భాగస్వాములని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా పాలనలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవ స్ఫూర్తి అన్ని రంగాలకు విస్తరిస్తోందని, కార్మికులకు సముచిత గౌరవం లభిస్తోందని తెలిపారు. అలుపెరగకుండా శ్రమిస్తున్న కార్మికులందరికీ 'మే డే' సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే నూతన పారిశ్రామిక విధానం వారి అభ్యున్నతికి తప్పకుండా దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్మికుల శ్రేయస్సు, సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. కార్మికుల శ్రమ వల్లే సమస్త సంపదలు సమకూరుతాయని పేర్కొన్నారు.

పి4 సర్వేతో 75,566 కుటుంబాల గుర్తింపు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పేదరిక నిర్మూలన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి4 (పబ్లిక్-ప్రైవేట్-పీపుల్ పార్ట్‌నర్‌షిప్ ఫర్ పావర్టీ ఎలిమినేషన్) విధానాన్ని జిల్లాలో ప్రభావవంతంగా అమలు చేస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. సమాజంలో ఆర్థికంగా అట్టడుగున ఉన్న 20 శాతం వెనుకబడిన కుటుంబాలను 'బంగారు కుటుంబాలు'గా గుర్తించామని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 75,566 కుటుంబాలు బంగారు కుటుంబాలుగా ఎంపికయ్యాయని తెలిపారు. వీరిని సమాజంలో ఉన్నత స్థితికి తీసుకొచ్చేందుకు పది శాతం మంది 'మార్గదర్శులు'గా ముందుకు వచ్చి, ఒక్కో బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకుని వారికి విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, ఇతర అవసరాల కోసం తోడ్పాటును అందించాలని పిలుపునిచ్చారు. దీని ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్, ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పి4 సర్వేలో గుర్తించిన బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలనుకునే వారు https://zeropovertyp4.ap.gov.in/CreateAccount.html వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో మాత్రమే కాకుండా రాష్ట్రం, దేశం నలుమూలల ఉన్న జిల్లావాసులు ముందుకు రావాలని కోరారు.


ర్యాలీ నిర్వహిస్తున్న విఆర్‌ఎలు

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు
- కలెక్టరేట్ వద్ద విఆర్‌ఎల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

విఆర్‌ఎలకు పనికి తగ్గ వేతనాలు చెల్లించడంతో పాటు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, విఆర్‌ఎల సంఘ జిల్లా గౌరవాధ్యక్షులు అల్లు సత్యనారాయణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.త్రినాథరావు, కె.రమణమూర్తి డిమాండ్ చేశారు. పలు సమస్యల పరిష్కారం కోరుతూ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యాన విఆర్‌ఎలు నగరంలోని ఆర్‌అండ్‌బి అతిథిగృహం రోడ్డు నుంచి కలెక్టరేట్ వరకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విఆర్‌ఎలకు తెలంగాణలో అమలవుతున్న పే స్కేల్ ఆధారంగా రాష్ట్రంలో వేతనాలు చెల్లించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా విధించిన నైట్ డ్యూటీలు, ఇసుక ర్యాంపులు, రైస్ మిల్లుల డ్యూటీలను తక్షణమే రద్దు చేయాలన్నారు. జీతంతో పాటు డిఎను కలపాలని, విఆర్‌ఒ, అటెండర్, రికార్డు అసిస్టెంట్, వాచ్‌మెన్, డ్రైవర్ పోస్టుల్లో అర్హులైన విఆర్‌ఎలకు ఉద్యోగోన్నతి కల్పించి నియామకాలు చేపట్టాలన్నారు. నామినీలను విఆర్‌ఎలుగా గుర్తించి నియామకాలు చేపట్టాలన్నారు. ఎనిమిదేళ్లగా విఆర్‌ఎల జీతాలను ప్రభుత్వం పెంచకపోవడంతో అరకొర జీతాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విఆర్‌ఎలకు జీతాలు పెంచుతామని ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం, ఏడాది పాలన పూర్తవుతున్నా అమల్లోకి రాలేదని విమర్శించారు. గతంలో వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయకుండా పక్కనపెట్టిందని, అదేబాటను కూటమి ప్రభుత్వం అనుసరిస్తోందని విమర్శించారు. నిబంధనలకు విరుద్ధమైన డ్యూటీలు వేస్తూ మరింత ఆర్థిక, పని భారాన్ని పెంచిందన్నారు. తెలంగాణలో అమలు చేస్తున్న నామినీలతో సహా విఆర్‌ఎలు అందరికీ పే స్కేల్ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నామినీలను విఆర్‌ఎలుగా గుర్తించాలన్నారు. ధర్నా అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విఆర్‌ఎల సంఘ నాయకులు ఎన్.సీతప్పడు, బి.అప్పారావు, జి.రామ్మూర్తి, కె.లక్ష్మణ, ఎమ్.రాముడు, బి.రాములమ్మ, రాంబాబు, పద్మ, మీనాక్షి, రాజులమ్మ తదితరులు పాల్గొన్నారు.


జెసికి వినతిపత్రం అందజేస్తున్న యుగంధర్

ఎపిపిఎస్‌సి మెయిన్స్ షెడ్యూల్ మార్చాలి

జెసికి వినతిపత్రం అందజేసిన ఎఐవైఎఫ్ నాయకులు

శ్రీకాకుళం: రాష్ట్రవ్యాప్తంగా ఎపిపిఎస్‌సి మే నెల మొదటి వారంలో నిర్వహిస్తున్న మెయిన్స్ పరీక్షల షెడ్యూల్‌ను మార్చాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.యుగంధర్ కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. జాతీయస్థాయిలో యుపిపిఎస్‌సి పరీక్షల షెడ్యూల్‌ను అనుసరించి మెయిన్స్ ఆగస్టులోను, ప్రిలిమినరీ మే చివరి వారంలో నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఎపిపిఎస్‌సి పరీక్ష రాసేందుకు తగిన సమయం ఉండడం లేదని వివరించారు. వ్యయ, ప్రయాసలతో పాటు కాలాన్ని వృథా చేయాల్సి వస్తోందని అన్నారు. యుపిపిఎస్‌సి పరీక్షల కోసం సాధనలో ఉన్న అభ్యర్థులు ఎపిపిఎస్‌సి నోటిఫికేషన్‌తో భావోద్వేగానికి గురవుతున్నారని వివరించారు. అందువల్ల పరీక్షల తేదీని అభ్యర్థులకు అనువుగా ఉండేలా మార్పు చేయాలని కోరారు. జెసిని కలిసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాస్, వేణు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రక్తదానానికి ఆరోగ్యవంతులైన వారందరూ ముందుకు రావాలని డిసిసిబి సిఇఒ సత్యనారాయణ, రెడ్‌క్రాస్ జిల్లా కార్యదర్శి బి.మల్లేశ్వరరావు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కార్యాలయంలో ఉద్యోగులు బుధవారం రక్తదానం చేశారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడుతూ వేసవిలో రక్త నిల్వలు తక్కువగా ఉంటాయని, ప్రస్తుత అవసరాల రీత్యా ఎక్కువ మంది యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. మహిళా ఉద్యోగులు సైతం స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్య, పిఆర్‌ఒ సత్యనారాయణ, శాశ్వత సభ్యులు బి.చిన్మయరావు, డిసిసిబి అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న డిసిసిబి ఉద్యోగులు

దాహం కేకలపై దద్దరిల్లిన కౌన్సిల్ సమావేశం


అధికారులు, చైర్‌పర్సన్ తీరుపై కౌన్సిలర్ల ధ్వజం


నిలదీస్తున్న కౌన్సిలర్లు
(ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న రాజ్యలక్ష్మి)



ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో నెలకొన్న తీవ్ర తాగునీటి సమస్యపై, ప్రజలు పడుతున్న నీటి కష్టాలు కనిపించవా? అని అధికార యంత్రాంగం, చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మిపై కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశంలో రెండు, మూడు అంశాలు అభివృద్ధి పనులపై కౌన్సిల్ ఆమోద ముద్ర వేసింది. తర్వాత ఒక్కసారిగా అధికార వైసిపి, టిడిపికి చెందిన వార్డు కౌన్సిలర్లు ఎద్దడిపై విరుచుకపడ్డారు. అధికార వైసిపి కౌన్సిలర్ల, వైస్ చైర్‌పర్సన్ భారతీ దివ్య, మధుమూర్తి, ప్రదీప్, సుగ్గు ప్రేమ్‌కుమార్, టిడిపి కౌన్సిలర్లు లీలారాణి, గేదెల శేఖర్ నీటి సరఫరాలో వైఫల్యాలపై మండిపడ్డారు. వైస్ చైర్‌పర్సన్ భారతీ దివ్య మాట్లాడుతూ కార్యాలయం వద్ద సిద్ధంగా ఉంటున్న నీటి ట్యాంకరును కొంతమంది పలుకుబడి ఉపయోగించుకొని వేరే వార్డుకు తరలించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డులో ఒక నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం తాగునీరు సరఫరా కావడం లేదన్నారు. వార్డులో వీధులు ఎక్కువగా ఉన్నా... కేవలం అరకొర ట్యాంకర్లు నీటి సరఫరా చేస్తే ఎలా అని జి.శేఖర్ ప్రశ్నించారు. దీనిపై చైర్‌పర్సన్ సమాధానం ఇస్తూ... గతంలో ఎప్పుడూ లేని నీటి ఎద్దడి ఈసారి వచ్చిందని అన్నారు. బాహుదా నదిలో భూగర్భ జలాలు అడుగంటిపోయని తెలిపారు. ఈ సమస్య అందరితో పాటు తనూ ఎదుర్కొంటున్నానని అన్నారు. ఇటీవల కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ జిల్లాస్థాయి అధికార యంత్రాంగంతో నీటి సమస్యపై సమీక్షించి ఆదేశాలు జారీ చేసినా ప్రయోజనం లేకుండాపోయిందని పేర్కొన్నారు. టిడిపి కౌన్సిలర్ ఆసి లీలారాణి మాట్లాడుతూ సమీక్ష తర్వాత మీరు ఎంతవరకు బాధ్యతగా వ్యవహరించారని చైర్‌పర్సన్‌ను నిలదీశారు. బాహుదా నదిలో పూర్తిగా భూగర్భ జలాలు అడుగంటిపోవడానికి ఇసుక దోపిడే ప్రధాన కారణమని వైస్ చైర్‌పర్సన్ భారతీ దివ్య ఆరోపించారు. బహుదా నదిలో అడ్డు అదుపు లేకుండా ఇసుక తవ్వకాలు చేపట్టడంతో ఇప్పుడు తాగునీటి సమస్య జఠిలమైందన్నారు. కమిషనర్ రమేష్ మాట్లాడుతూ కేంద్రమంత్రి సమీక్ష అనంతరం సర్వే చేపట్టామన్నారు. ఉద్దానం నీటి సరఫరాకు అనుసంధానం చేయడానికి కావాల్సిన పరికరాలు కూడా సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం క్లిష్ట పరిస్థితుల్లో నీటి ట్యాంకర్లు పెంచడానికి అవకాశం లేదని చైర్‌పర్సన్ అన్నారు. ఉన్న ఒకేఒక్క జల వనరు మున్సిపల్ కార్యాలయం వద్ద ఉందని, దీని వల్ల అదనపు ట్యాంకర్లు నీటి సరఫరాకు ఉపయోగించలేక పోతున్నట్లు తెలిపారు. ప్రజలు తాగునీటి అందక కొన్ని కుటుంబాలు పక్క గ్రామాలకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారని సభ్యుడు మధుమూర్తి సభ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం పలు అంశాలు ఆమోదిస్తూ తీర్మానం చేశారు. సాధారణ నిధుల నుంచి ఒక ప్రాంతానికి చెందేవిధంగా సంబరాలు, యజ్ఞాలు కోసం వెచ్చించడం సబబుగా లేదని వైస్ చైర్‌పర్సన్ బెల్లుపడా యజ్ఞం కోసం ఖర్చు పెట్టిన అంశంపై అభిప్రాయం వ్యక్తం చేశారు. గతంలో గ్రామ దేవత ఉత్సవాలు పూర్తిగా ఇచ్ఛాపురం ప్రాంతానికి చెందినది కనుక మున్సిపల్ నిధులు వెచ్చించినా పరవాలేదన్నారు. కానీ, ఒక వార్డుకు పరిమితమైన యజ్ఞాలకు సాధారణ నిధులు కేటాయించిడం సబబుగా లేదని అన్నారు. తాగునీరు సరఫరా కోసం తన సొంత ట్యాంకర్‌ను రెండు, మూడు మాసాలు ఇవ్వడానికి మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు ప్రత్తి విజయా కుమార్ ముందుకు రావడంతో చైర్‌పర్సన్ అభినందించారు. సమావేశంలో మేనేజర్ అప్పలస్వామి, టౌన్ ప్లానింగ్ అధికారి వినయ్‌ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.


పరీక్షా కేంద్రం వద్ద ఉన్న విద్యార్థులు

ప్రశాంతంగా పాలిసెట్

1,156 మంది గైర్హాజరు

ప్రజాశక్తి - శ్రీకాకుళం / టెక్కలి / రూరల్

పాలిటెక్నిక్ డిప్లమో కోర్సుల్లో ప్రవేశాల కోసం బుధవారం నిర్వహించిన పాలిసెట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని 18 కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించారు. పరీక్షకు జిల్లావ్యాప్తంగా 11,373 మంది విద్యార్థులు పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 6,433 మంది పురుషులు కాగా 4,940 మంది బాలికలు ఉన్నారు. శ్రీకాకుళం పట్టణంలో 6973 మందికి గానూ 3,835 మంది పురుషులు, 3,138 బాలికలకు కేటాయించారు. టెక్కలి కేంద్రాల్లో 4,400 మందికి కేటాయించగా, అందులో 2598 మంది బాలురు, 1802 మంది బాలికలు ఉన్నారు. శ్రీకాకుళం కేంద్రాల్లో 790 మంది, టెక్కలి కేంద్రాల్లో 366 మొత్తం 1,156 మంది గైర్హాజరయ్యారు. శ్రీకాకుళంలో 6,183 మంది, టెక్కలిలో 4034 మంది మొత్తంగా 10,217 మంది పరీక్ష రాశారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టారు. ఉదయం 11 గంటలకు పరీక్ష ప్రారంభం కావడానికి గంట ముందే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. సాంకేతిక విద్యాశాఖ ఆదేశాలను అనుసరించి పరీక్ష నిబంధనలను అధికారులు అమలు చేశారు.

వెనుదిరిగిన ఏడుగురు విద్యార్థులు

టెక్కలిలోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలోని పరీక్షా కేంద్రానికి పాలీసెట్ పరీక్ష రాసేందుకు నిర్ణీత సమయం తర్వాత వచ్చిన ఏడుగురు విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించలేదు. ఇచ్ఛాపురం నుంచి వచ్చిన రైలు ఆలస్యం కావడం వల్ల సమయానికి రాలేకపోయామని, పరీక్షకు అనుమతించాలని కోరినా నిబంధనల ప్రకారం అధికారులు వ్యవహరించారు. దీంతో వారు నిరాశతో వెనుదిరిగారు.


ప్రచారం చేస్తున్న కార్మికులు

మేడే కార్మిక వర్గానికి స్ఫూర్తి

ప్రజాశక్తి- పలాస

ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను విజయవంతం చేయాలని సిఐటియు నాయకులు ఎన్.గణపతి పిలుపునిచ్చారు. మేడే విజయవంతంపై మున్సిపల్ కార్మికులతో బుధవారం ప్రచారం నిర్వహించి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మిక హక్కులు సాధించుకున్న దినం మేడే అని అన్నారు. ప్రస్తుతం కార్మికులకు హక్కులే ఉండకూడదని ప్రభుత్వాలు లేబర్ కోడ్‌లు తెచ్చి కార్మికులను కార్పొరేట్లకు తాకట్టుపెట్టాలని చూస్తున్నాయని విమర్శించారు. ఈ మేడే స్ఫూర్తితో ఐక్య పోరాటాలు సాగించి ప్రభుత్వ విధానాలు తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు సి.హెచ్.మురగన్, ఎం.రవి, కె.ఈశ్వరరావు, ప్రకాష్, ముఖి, రాము, వెంకటి పాల్గొన్నారు.


కుమార్ నాయక్‌కు సన్మానిస్తున్న రచయితలు

కుమార్ నాయక్‌కు సత్కారం

ప్రజాశక్తి- పలాస

మండలంలోని మాకనపల్లిలో జానపద కళాకారుడు, ప్రభుత్వ కందుకూరి పురస్కార గ్రహీత డాక్టర్ కుమార్ నాయక్‌కు ఉద్దానం రచయితల సంఘం (ఉరసం) బుధవారం ఘనంగా సత్కరించారు. ఉరసం అధ్యక్షులు కుత్తుం వినోద్ కుమార్ మాట్లాడుతూ గతంలో రెండు నంది అవార్డులు, జానపద విభాగంలో డాక్టరేట్, నాగాలాండ్ గవర్నర్ లా గణేషన్, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా అవార్డులు అందుకున్న ఘనత కుమార్ నాయక్‌కే దక్కిందన్నారు. రచయిత గుమ్మడి సాంబమూర్తి మాట్లాడుతూ పలు సాహిత్య సంస్థలలోనూ, కళా సంస్థల్లోనూ, విశేష సేవలు అందిస్తూ, నటుడిగా, దర్శకులుగా, సందర్భోచిత రచయితగా, సేవలందిస్తున్నందుకు శ్రీశ్రీ జయంతి సందర్భంగా కుమార్ నాయక్‌కు సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. వేదికలో సాహితీవేత్తలు వంకల రాజారావు, కోయిల రామలక్ష్మి, సోరా రామారావు, అంగ ఆనందరావు, సైని మధు, కుత్తుం ప్రసాద్, పోతనపల్లి వెంకటేష్, బత్తిని విజయ్‌కుమార్, తెప్పల రవి, కోయిల కోటేశ్వరరావు, కుత్తుం ముకుందరావు, చిన్నారావు పాల్గొన్నారు.


లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న అధికారులు

లక్ష్మీనారాయణ సేవలు శ్లాఘనీయం

ప్రజాశక్తి- బూర్జ

హౌసింగ్ ఎఇగా కొరికాన లక్ష్మీనారాయణ అందించిన సేవలు శ్లాఘనీయమని ఆమదాలవలస హౌసింగ్ శాఖ డిఇఇ డి.సన్యాసిరావు అన్నారు. బుధవారం స్థానిక హౌసింగ్ శాఖ కార్యాలయంలో ఎఇ లక్ష్మీనారాయణ ఉద్యోగ విరమణ సభలో పాల్గొన్నారు. గృహ నిర్మాణ శాఖ ఎఇగా లక్ష్మీనారాయణ శతశాతం తన విధులను నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ సేవలను కొనియాడారు. అనంతరం లక్ష్మీనారాయణను అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. హౌసింగ్ శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాంప్రసాద్, మదన్ మనోహర్ నాయుడు, పురుషోత్తమరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమదాలవలస ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.నరసింహరావు, నియోజకవర్గ హౌసింగ్ ఎఇలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


సమస్యను వివరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

సయ్యద్‌ఖాన్ చెరువును అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలో బెల్లుపడా కాలనీకి సమీపంలో నిర్లక్ష్యపు నీడలో కొట్టుమిట్టాడుతున్న సయ్యద్ ఖాన్ చెరువు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని తరకేశ్వర ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. దాదాపు తొమ్మిది వేల మంది, ఆరు వార్డుల ప్రజలకు నిత్యం ఉపయోగించుకునే తాగునీటి చెరువు గుర్రపు డెక్కలతో, పిచ్చి మొక్కలతో బయానిక పరిస్థితిలో ఉందన్నారు. ఈ చెరువు ఉపయోగంలో తెస్తే ఎంతో మందికి మేలు చేకూరుతుందన్నారు. దీనిపై విప్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో బి.లక్ష్మణరావు, కోటేశ్వరరావు, రఘునాథం, ఢిల్లీరావు, ఎన్.గోపాల్, శంకర్‌రెడ్డి, పార్వతీశం, సంతోష్ పాల్గొన్నారు.

సర్పంచ్‌కు సత్కారం

ప్రజాశక్తి- గార

గ్రామీణాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనలో శాలిహుండం పంచాయతీను ఆదర్శంగా తీర్చిదిద్దుతున్న సర్పంచ్ కొంక్యాన ఆదినారాయణను పంచాయతీలోని ప్రజా ప్రతినిధులు, ప్రజలు, వివిధశాఖల అధికారులు, సిబ్బంది బుధవారం ఘనంగా సత్కరించారు. జిల్లాస్థాయిలో ఉత్తమ సర్పంచ్‌గా ఎంపికైన ఆదినారాయణ గత రెండు పర్యాయాలుగా పంచాయతీ అభివృద్ధికి విశేషమైన కృషి చేశారని ఎంపిటిసి సభ్యుడు గుండ భాస్కరరావు అన్నారు. గతంలో రెండుసార్లు ఎంపిటిసి సభ్యునిగా మెరుగైన సేవలందించారని ఉపసర్పంచ్ బోర గణపతి పేర్కొన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఉత్తమ సర్పంచ్‌గా ఎన్నికై జెడ్‌పి చైర్పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్యే గొండు శంకర్, జడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా చేతులమీదుగా అవార్డు అందుకున్నట్లు కార్యదర్శి సురేష్ పేర్కొన్నారు. పంచాయతీ పరిధిలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, వార్డు మెంబర్లు సర్పంచ్ ఆదినారాయణ సేవలను కొనియాడారు.


సర్పంచ్‌ను అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు

పాఠశాలల విలీనం... భవనాలు నిరుపయోగం

ప్రజాశక్తి- రణస్థలం

శతశాతం అక్షరాస్యత సాధించడం, కార్పొరేట్ పాఠశాలలకు తీసిపోకుండా ప్రభుత్వ బడులు ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తోంది. భవనాలు నిర్మించి, మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. వైసిపి ప్రభుత్వం నాడు - నేడు పనులు చేపట్టిన తర్వాత కొన్ని పాఠశాలలను విలీనం చేయడంతో పలు భవనాలు వృథాగా ఉన్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పంచాయతీకొక ఆదర్శపాఠశాల పేరుతో విద్యాకమిటీల ఆమోదం మేరకు సమీపంలోని పాఠశాలలను విలీనం చేయడంతో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మారుతున్నాయి.

నియోజకవర్గంలో పరిస్థితి..

మండలంలో గత ప్రభుత్వాల హయాంలో అక్కయ్యపాలెం, బావరాజుపాలెం, చిట్టివలస, పైడిపేట, డి.పాలవలస, గరికిపాలెం, జీరుపేట, కంబాలపేట, కె.ఎస్.పాలెం, ఎన్.డి.కె.పాలెం, వి.ఎన్.పురం తదితర పాఠశాలలను సమీపబడుల్లో గత ప్రభుత్వ హయాంలో విలీనం చేయడంతో మూసి వేశారు. ప్రస్తుతం అక్కడ


వి.ఎన్ పురంలో ఖాళీగా ఉన్న పాఠశాలలో పనులు చేస్తున్న కార్పెంటర్లు

నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మారడంతో పాటు ఆ భవనాలు స్థానికంగా ఉన్నవాళ్లు వాడుకుంటున్నారు. ముఖ్యంగా రైతులు, కార్పెంటర్లు తదితర అవసరాలకు దర్జాగా వాడుకుంటున్నారు. రణస్థలం మండలంలో 11 ఆదర్శ పాఠశాలలను ఏర్పాటు చేసి సమీప పాఠశాలలోని తరగతులను విలీనం చేస్తున్నారు.

లావేరు మండలంలోని వెంకటరావు పేటలో విద్యార్థులు లేక పాఠశాలను మూసివేశారు. ఇక్కడ విద్యార్థులంతా ప్రైవేటు బడుల్లో చేరుతున్నారు. పిబినగర్ కాలనీ, కందిపేట, సహపురం పాఠశాలల్లోని విద్యార్థులను గత ప్రభుత్వ హయాంలో సమీప పాఠశాలల్లో విలీనం చేశారు. ప్రస్తుతం మండలంలో ఎనిమిది ఆదర్శ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నారు.

జి.సిగడాం మండలంలో ఇలాంటి పరిస్థితే ఉంది. జగన్నాధపురం, సంతవురిటి, పున్నాం ప్రాథమిక పాఠశాలలను సమీప పాఠశాలల్లో విలీనం చేశారు. అక్కడి భవనాలు వృథాగా మిగిలాయి.

ఎచ్చెర్ల మండలంలో కేశవరావుపేట, పోలీసుక్వార్టర్స్, అల్లినగరం, ఎస్ఎస్ఆర్ పురం, బుగట్లపాలెం ప్రాథమిక పాఠశాలలను సమీప బడుల్లో విలీనం చేశారు. ప్రస్తుతం మండలంలో 14 ఆదర్శ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నారు.

నిరుపయోగంగా ఉన్న పాఠశాలల విషయంపై రణస్థలం మండల విద్యాశాఖాధికారి ఎ.త్రినాథరావుని వివరణ కోరగా ప్రభుత్వ నిర్ణయాల మేరకే పాఠశాలలు మూతబడిన చోట భవనాలను అంగన్వాడీ, ఇతర ప్రత్యామ్నాయ అవసరాలకు వినియోగిస్తున్నారని, మరి కొన్నింటిని ఇతర ప్రభుత్వ అవసరాలకు వినియోగిస్తున్నారన్నారు. ఎలాంటి అవసరాలు లేని గ్రామాల్లో నిరుయోగంగా ఉంటున్నాయని తెలిపారు.

కొత్తూరు తహశీల్దార్‌గా బాలకృష్ణ

కొత్తూరు : కొత్తూరు తహశీల్దార్‌గా కె.బాలకృష్ణ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఈయన హిరమండలం డిటిగా పనిచేస్తూ.. ఉద్యోగోన్నతిపై ఇక్కడకు బదిలీపై వచ్చారు. ప్రస్తుతం పని చేస్తున్న తహశీల్దార్ రవిచంద్ర కలెక్టరేట్‌కు బదిలీపై వెళ్లారు. తహశీల్దార్ బాలకృష్ణ గతంలో డిటిగా ఇక్కడ పనిచేశారు.


బాలకృష్ణ


జగన్‌ను కలిసిన రవికుమార్

జగన్‌ను కలిసిన 'చింతాడ'

ప్రజాశక్తి- ఆమదాలవలస

వైసిపి పార్టీ అధ్యక్షులు, మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిస్థితులు, రాజకీయ పరిణామాలపై రవికుమార్ జగన్‌కు వివరించారు. కూటమి ప్రభుత్వ పాలన అరాచకాలను జగన్ దృష్టికి తీసుకువెళ్లారు. పార్టీ కార్యకర్తలతో నిత్యం మమేకమవుతూ వారికి అండగా ఉంటూ పార్టీని బలోపేతం చేయాలని జగన్ సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సిఎం ధర్మాన కృష్ణదాస్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన పురుషోత్తం

శ్రీకాకుళం రూరల్: మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తన నివాసం వద్ద బుధవారం వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెలు పురుషోత్తం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో నాయకులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఆయనతో వైసిపి జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్ ఉన్నారు.

కంప్యూటర్ విజ్ఞానం అవసరం

లావేరు: ప్రాథమిక స్థాయి నుంచే కంప్యూటర్ కోసం ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని రిసోర్స్ పర్సన్ కొమ్మూరు గోవిందరావు అన్నారు. వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా బుధవారం లావేరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు కంప్యూటర్ ఏ విధంగా పనిచేస్తుంది, అందులో ఉండే పార్టులు, అవి ఎలా పనిచేస్తాయో ఆయన తెలియజేశారు. కంప్యూటర్‌ను వినియోగించుకోవడానికి వివిధ కారణాలు తెలియజేశారు. కంప్యూటర్ ఉపయోగాలు, డేటా, సమాచారం, జ్ఞానం, సామాజిక ప్రభావాలు, పర్యావరణపై తెలియజేశారు. కంప్యూటర్‌లో ఉండే విడివిడి భాగాలను కూడా తెలియజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో క్విజ్ పోటీలు

టెక్కలి : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా టెక్కలి గ్రంథాలయంలో విద్యార్థులకు బుధవారం పుస్తక పఠనం, క్విజ్ పోటీలు నిర్వహించామని గ్రంథాలయ అధికారి బి.రూపావతి తెలిపారు. ఇంగ్లీష్ ఉపాధ్యాయులు రవి కుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కింది పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘ బలోపేతానికి కృషి

పలాస : బ్రాహ్మణ సంఘం బలోపేతానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర ఒడియా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు శివాజీ పాణిగ్రాహి అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పూజారి వీధి రాధకాంత విగ్రహాలను బుధవారం ఊరేగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒడియ బ్రాహ్మణులను సామజికంగా ఉన్నతి చేయడానికి తమ సంఘం నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఒడియ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్ త్యాడీ, సభ్యులు బాబూరావు పండా, నిత్యనంద పండా, సంతోష్‌పండా, రాజేష్ పండా, ప్రదీప్ పాత్రో, పూజారి రవి, సంతోష్ పాల్గొన్నారు.

నేడు న్యాయవిజ్ఞాన సదస్సు

టెక్కలి : టెక్కలి ఆర్‌టిసి డిపోలో కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నామని టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి బి.నిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. కార్మిక దినోత్సవం సందర్భంగా నిర్వహించే ఈ సదస్సుని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

ఎచ్చెర్ల: కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాలలో ఘనంగా రక్త శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల అసోసియేట్ డాక్టర్ కె.మోష ప్రారంభిస్తూ రక్తదానం యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. ఇందులో భాగంగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సిబ్బంది, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కావ్య, సహాయ సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థులు, సిబ్బంది రక్తదానం చేశారు.

అథ్లెటిక్స్ శిక్షణ

బూర్జ: మండలంలోని కె.కె.రాజపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అథ్లెటిక్స్ శిక్షణా తరగతులు నిర్వహించ నున్నట్లు పాఠశాల హెచ్‌ఎం వై.మాలతి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎనిమిదేళ్ల నుంచి పదహారేళ్ల వయసు గల విద్యార్థులు పాల్గొనవచ్చునని తెలిపారు. ఈనెల 1 నుంచి జూన్ 11 వరకు శిక్షణా తరగతులు జరుగుతాయని, శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తామని తెలిపారు.

మాజీ సైనికుల సమస్యలు పరిష్కరిస్తా

మేజర్ జనరల్ అజయ్ మిశ్రా

ప్రజాశక్తి- ఆమదాలవలస

జిల్లాలోని మాజీ సైనికుల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ, ఆంధ్ర సబ్ ఏరియా హెడ్ క్వార్టర్స్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ అజయ్ మిశ్రా అన్నారు. బుధవారం కొత్తరోడ్డు దగ్గర ఉన్న ఆర్మీ క్యాంటీన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఉన్న మాజీ సైనికులు, వీరనారిమణులను కలిసి వారి సమస్యలను ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. మాజీ సైనికులకు వీర నారీమణులకు ఉపయోగపడే విధంగా ఒక ఈ రిక్షా అందించనున్నట్లు ప్రకటించారు. పలువురు మాజీ సైనికుల సమస్యలను తెలుసుకొని వాటిని త్వరలోనే పరిష్కరిస్తానని వారికి సభాముఖంగా తెలిపారు. అనంతరం తెలంగాణ, ఆంధ్ర సబ్ ఏరియా ఆర్మీ వైవ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్యామాంజలి మిశ్రా చేతులమీదుగా ఏడుగురు వార్ విడోస్ మహిళలను సత్కరించారు. సింహద్వారం దగ్గర ఉన్న ఎక్స్ సర్వీస్ మెన్ కంట్రిబ్యూటరీ హెల్త్ స్కీమ్ పోలిక్లినిక్‌ను సందర్శించి వైద్య పరంగా ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని


సమావేశంలో మాట్లాడుతున్న మేజర్ జనరల్ అజయ్ మిశ్రా

తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్నల్ విక్రాంత్ పాండే, కల్నల్ ఆర్.ఎన్.ముతల్లిక్, డిస్ట్రిక్ట్ ఎక్స్ సర్వీస్‌మెన్ ఫెడరేషన్ శ్రీకాకుళం చైర్మన్ విశ్రాంత గ్రూప్ కెప్టెన్ పి.ఈశ్వరరావు, జిల్లా సైనిక వెల్ఫేర్ ఆఫీసర్ ఎ.శైలజ, ఇ.సి. ఎచ్.ఎస్. శ్రీకాకుళం అధికారి విశ్రాంత లెఫ్టినెంట్ కల్నల్ బి.చంద్రశేఖర్, శ్రీకాకుళం క్యాంటీన్ మేనేజర్ విశ్రాంత సుబేదార్ మేజర్ పి.గోవిందరావు, విజయనగరం జిల్లా సైనిక సంక్షేమ అధికారి మజ్జి కృష్ణారావు, డిస్ట్రిక్ట్ ఎక్స్‌సర్వీసు మెన్ ఫెడరేషన్ శ్రీకాకుళం ప్రెసిడెంట్ పూర్ణ చంద్రరావు కటకం, వైస్ ప్రెసిడెంట్ వి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు

కౌన్సిల్ సమావేశం వాయిదా

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశం అరగంట కాలం మాత్రమే నిర్వహించి అర్ధాంతంగా వాయిదా వేశారు. ఇందుకు కారణం అందరికి చెప్పాల్సిన మున్సిపల్ కమిషనర్ ప్రొటోకాల్ ఉల్లంఘించి తనను అవమానించారని చైర్మన్‌కు కోపం రావడంతో సమావేశాన్ని అర్ధాంతంగా వాయిదా వేసి వెళ్లిపోయారు. సమావేశం ప్రారంభంలో చైర్మన్ తాగునీటి సమస్యపై ప్రారంభ ఉపన్యాసం చేశారు. అనంతరం బోర్లు, పవర్ బోర్లు ఏర్పాట్లు అంశంపై చర్చించారు. ఈ నేపథ్యంలో చైర్మన్ గిరిబాబు ఒక్కసారిగా కమిషనర్ రామారావు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయం పక్కనే ఉన్న 26వ వార్డులో ఇటీవల పవర్ బోరును కమిషనర్, కౌన్సిలర్లు శంకుస్థాపన చేసుకున్నారని, కనీసం ఈ విషయంలో తనకు సమాచారం ఇవ్వలేదని అన్నారు. కమిషనరే ప్రొటోకాల్ ఉల్లంఘిస్తే ఇక నేనెందుకని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో వైసిపి, టిడిపి కౌన్సిలర్లు కూడా ఒకసారి వాయిదా పడిన తరువాత సమావేశం నిర్వహించే అవకాశాలు లేవని బావించి వెళ్లిపోయారు.

చైర్మన్‌కు తెలయకుండా పనులు, బిల్లులా?

ప్రొటోకాల్ ఉల్లంఘన వివాదం అనంతరం చైర్మన్ బల్ల గిరిబాబు మాట్లాడుతూ ప్రస్తుతం మున్సిపాలిటీలో చైర్మన్‌కు తెలియకుండా కమిషనర్ అంతా ఏకచత్రాధిపతిగా పనులు, వాటి బిల్లులు విడుదల చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అండ ఉందని కమిషనర్ తనకు అవమానపరిచే విధంగా చర్యలు చేపట్టడంతో సమావేశాన్ని బాయ్‌కట్ చేశానని అన్నారు.

పని ప్రదేశాల్లో పందిళ్ల ఏర్పాటు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

పొందూరు: మండలంలోని పలు గ్రామాల్లో చేపడుతున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి సంబంధించి వేతనదారులకు ఎండ నుంచి ఉపశమనం కలిగేలా బుధవారం పని ప్రదేశాల్లో పందిరిలను ఏర్పాటు చేశారు. మండలంలో చేపడుతున్న ఉపాధి పనులకు సంబంధించి వేతనదారులు మండుటెండల్లో పనులు చేపట్టడంపై ప్రజాశక్తిలో 'ఉపాధి' కార్మికుల ఉక్కిరిబిక్కిరి' అంటూ ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో కూలీలు వేడికి తాళలేక వడదెబ్బతో మృతి చెందిన సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. పనిచేసే సమయంలో వేతనదారులు కాస్త సేదతీరేందుకు వీలుగా గతంలో ప్రభుత్వాలు పరదాలతో నీడను ఏర్పాటు చేయడం జరిగింది. కొంతకాలంగా కూలీలకు కనీస మౌలిక సదుపాయాలు


కొంచాడలో పనిప్రదేశంలో కూలీలు ఏర్పాటు చేసుకున్న పందిరి

కల్పించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామంటూ వేతనదారులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పన లేకపోవడంపై ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామాల్లో పని ప్రదేశాల్లో వేతనదారులు సేద తీరేందుకు వీలుగా తప్పనిసరిగా పందిరిలు ఏర్పాటు చేయాలని సంబందిత సిబ్బందికి ఆదేశించినట్లు ఎపిఒ పి.శ్రీనివాసరావు తెలిపారు.

కుట్టుమిషన్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

లావేరు: బిసి కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న కుట్టుమిషన్ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని బిసి కార్పొరేషన్ ఇడి గడ్డమ్మ అన్నారు. బుధవారం లావేరు వెలుగు కార్యాలయ సమావేశ మందిరంలో కుట్టుమిషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళలతో మాట్లాడారు. తప్పనిసరిగా 75 శాతం హాజరు ఉండాలని, ప్రతిరోజు వచ్చేటప్పుడు, వెళ్ళేటప్పుడు యాప్‌లో హాజరు నమోదు చేయడం జరుగుతుందన్నారు. 75 శాతం హాజరు ఉన్నవారికి ఉచితంగా ప్రభుత్వం కుట్టుమిషన్లు అందజేయడం జరుగుతుందని చెప్పారు. రోజుకు రెండు బ్యాచ్‌లు చొప్పున శిక్షణ ఉంటుందని, ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అమెతో పాటు ఎంపిడిఒ కార్యాలయ సూపరెంటిండెంట్ సునీత, ఎపిఎం సుబ్బయ్యనాయుడు, సిఒ యినపకుర్తి కీర్తన మహిళలు ఉన్నారు.


మహిళలతో మాట్లాడుతున్న ఇడి గడ్డమ్మ

గణపతి మాస్టారుకు అవార్డు

పోలాకి: మండలంలో ప్రగతి హైస్కూల్ డైరెక్టర్ ఇలపండ గణపతిరావు మాస్టర్‌కు అప్సా జోనల్ ఉత్తమ రావడం ఆనందంగా ఉందని ప్రయివేట్ స్కూల్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు జనార్ధనరావు అన్నారు. పోలాకి కేంద్రంలో గణపతి మాస్టర్ బుధవారం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల విజయవాడలో నిర్వహించే ఆంధ్రప్రదేశ్ ప్రయివేట్ స్కూల్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన సమావేశంలో బహుమతిని ప్రదానం చేశారని తెలిపారు. కార్యక్రమంలో వి.యుగంధర్, సుబ్రహ్మణ్యం రాజు, తమ్మినేని సింహాచలం, ముద్దాడ రామ్మోహన్ పాల్గొన్నారు.


అవార్డు అందుకుంటున్న గణపతిరావు

పెద్దల మార్గదర్శనం తప్పనిసరి

ప్రజాశక్తి- కవిటి

ఉద్యోగికి పదవీ విరమణ అనేది జీవన గమనంలో ఓ ప్రక్రియ మాత్రమేనని, కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో అపారమైన అనుభవం ఉన్న విశ్రాంత ఉద్యోగులు తమ తమ శాఖల సిబ్బందికి మార్గదర్శనం చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోళ్ల రాజేష్ అన్నారు. కవిటి మండలంలో పంచాయతీరాజ్ వ్యవస్థలో విశేష సేవలు అందించి మండల విస్తరణ అధికారిగా బుధవారం ఉద్యోగ విరమణ చేసిన శివాజీ పాణిగ్రాహిని తోటి ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఎంపిపి కడియాల పద్మ ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ శివాజీ పాణిగ్రాహి తన 38 ఏళ్ల ఉద్యోగ జీవితంలో అలసట ఎరుగని బాటసారిలా, విసుగు చెందని యాత్రికునిలా విధులు నిర్వర్తించారని కొనియాడారు.


శివాజీ పాణిగ్రాహి దంపతులను సన్మానిస్తున్న ఉద్యోగులు

ముఖ్యంగా తన తోటి ఉద్యోగులకు సలహాలు ఇస్తూ, కింది ఉద్యోగులకు మార్గదర్శనం చేస్తూ మన్ననలు పొందారని కితాబిచ్చారు. ఆయన విరామ జీవితం ప్రశాంతంగా సాగాలని ఆకాంక్షించారు. అనంతరం శివాజీ పాణిగ్రాహి దంపతులను ప్రజా ప్రతినిధులు, కార్యదర్శులు, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. డిఎల్‌పిఒ గోపీబాల, తహశీల్దార్ మురళీమోహన్, ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

కోటబొమ్మాళి : మండలంలోని చీపుర్లపాడు పంచాయతీ ఊడికలపాడుకు చెందిన పినిమింటి లక్ష్మి (37) చీమలమందు తాగి బుధవారం శ్రీకాకుళం రిమ్స్‌లో మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే... మృతురాలు లక్ష్మి భర్త పినిమింటి రామారావు రోజు మద్యం సేవించి భార్య, పిల్లలతో గొడవలు పడేవాడు. మృతురాలు లక్ష్మి ఇంట్లో దాచిపెట్టిన డబ్బులను ఈ నెల 27వ తీసుకుపోయి ఫుల్‌గా రోజంతా తాగి సాయంత్రం ఇంటికి వచ్చి గొడవకు దిగాడు. దీంతో మనస్తాపానికి గురైన లక్ష్మి ఇంట్లో ఉన్న చీమల మందును నీటిలో కలుపుకొని తాగింది. ఈ విషయం తెలుసుకున్న చుట్టుపక్క వారు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం పరిస్థితి విషయమించి మృతి చెందింది. మృతురాలికి కుమార్తె జగదీశ్వరి, కుమారుడు శ్యామ్‌లు ఉన్నారు.

'ఉపాధి' కూలీలకు గాయాలు

పలాస : మండలంలోని చిన్ననీలావతికి చెందిన సొర్ర గణపతి, సొర్ర కంబయ్యలు బుధ వారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. క్షతగాత్రులు చిన్ననీలావతి, కొబ్బరి చెట్లూరు రైల్వేగేట్ మధ్యలో ఉపాధి పనులు చేస్తున్నారు. అల్పాహారం కోసం జాతీయ రహదారిపైకి వచ్చారు. తిరిగి పనులకు వెళ్తుండగా... పలాస నుంచి ఇచ్ఛాపురం వైపు వెళ్తున్న లారీ వెనుక భాగం నుంచి బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో గణపతి, కంబయ్యలు గాయపడ్డారు. వెంటనే 108లో పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. కాశీబుగ్గ సిఐ సూర్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


గాయపడిన ఉపాధి కూలీలు

ఒకరికి...

నందిగాం : మండలంలోని సుభద్రాపురం వద్ద జాతీయ రహదారిపై బుధవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడ్డాడు. సుభద్రపురానికి చెందిన దక్క కృష్ణారావు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వైపు నుంచి జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనదారుడు బలంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కృష్ణారావు ఎడమ కాలు విరిగి, కుడి కాలుకు తీవ్ర గాయమైంది. వెంటనే స్థానికులు 108లో టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సీసాలు పట్టివేత

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని ముద్దాడపేట గ్రామానికి చెందిన కంచరావు నీలంనాయుడును మద్యం సీసాలతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. బుధవారం ముద్దాడపేటలో ఆయన స్వగృహంలో 55 క్వార్టర్ మద్యం సీసాలతో జిల్లాకు చెందిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై ఎస్ఐ ఎస్.బాలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తీగలపై పడిన రేకును తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

నిలిచిన విద్యుత్

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా ఉన్న శ్రీరామ కన్వెన్షన్ ఎదురుగా ఉన్న విద్యుత్ వైర్లపై మంగళవారం అర్ధరాత్రి వీచిన ఈదురు గాలులు, కురిసిన భారీ వర్షానికి ఇనుప రేకు పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. మంగళవారం రాత్రి 12 గంటల నుంచి బుధవారం ఉదయం 7 గంటల వరకు విద్యుత్ అంతరాయం వలన సమీప ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బుధవారం ఉదయం విద్యుత్ సిబ్బంది అక్కడకు చేరుకొని విద్యుత్ తీగలపై పడిన రేకును తొలగించి విద్యుత్ పునరుద్ధరణ చేయడంతో చుట్టుపక్కల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ఎంఇఒ సందర్శన

టెక్కలి : ప్రజా చైతన్య కళా సమితి టెక్కలిశాఖ ఆధ్వర్యాన స్థానిక మండప కాలనీలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఎంఇఒ దాసుపురం చిన్నారావు బుధవారం సందర్శించారు. శిబిరం నిర్వహణపై సంతృప్తిని వ్యక్తం చేశారు. తెలుగు, గణితం, యోగా వంటి అంశాలపై విద్యార్థుల్లో చిన్నతనం నుంచే అవగాహన కల్పించి వారికి తెలియజేయడంపై సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల్లో పోటీతత్వాన్ని నెలకొనే విధంగా శిబిరాన్ని నిర్వహిస్తున్న కళాసమితి నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు దూసి ఆంధ్రాస్టాలిన్, అధ్యక్షులు ఉత్తరకవాటం గణపతిరావు, ప్రధాన, కార్యదర్శులు చిలుకు కృష్ణారావు, నిర్వాహకులు అనిశెట్టి చిట్టన్న, మూల తాతయ్య, బోడ్డ అయ్యబాబు, కుప్పిలి కామేశ్వరరావు, జి.మోహనరావు, తమ్మినేని వైకుంఠరావు, మార్పు నారాయణమూర్తి, డొంకాన పాపారావు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని తోటాడ, దూసి, అక్కివరం, వంజంగి గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. చెట్ల కొమ్మలు తొలగించట, విద్యుత్ లైన్ల నిర్వహణ కొరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సబ్సిడీపై పశువుల దాణా

బూర్జ: సబ్సిడీపై పాడి రైతులకు పశువులు దాణా అందజేస్తున్నట్లు పశువైద్యాధికారి వెంకటరావు తెలిపారు. రైతులకు 50 శాతం సబ్సిడీతో కేవలం రూ.555కే 50 కేజీల పశువుల దానా బస్తాను విక్రయించను న్నామని తెలిపారు. మండలానికి జనరల్ కేటగిరిపై 120 బ్యాగులు, ఎస్‌సి కేటగిరిపై 33 బ్యాగులు కేటాయించడం జరిగిందన్నారు. ఆసక్తిగల రైతులు సమీపంలో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో సహాయకుల ద్వారా పేర్ల నమోదు చేసుకోవాలని తెలిపారు.


ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులను సత్కరిస్తున్న ఎస్‌పి

ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలి ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఉద్యోగ విరమణ పొందిన అనంతరం సంతోషంగా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని జిల్లా ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు సూచించారు. బుధవారం ఉద్యోగ విరమణ పొందిన ట్రాఫిక్ ఎస్‌ఐ వి.దేవదానం, ఆఫీస్ సూపరింటెండెంట్ పి.కోటేశ్వరరావు, వజ్రపుకొత్తూరు ఎఎస్‌ఐ ఎన్.అప్పల నాయుడు, ఆర్మ్డ్ రిజర్వ్ హెచ్‌సి ఎన్.చిన్నబాబులను జిల్లా పోలీసు కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఎస్‌పి వారిని సత్కరించారు.

ఘనంగా శ్రీశ్రీ జయంతి

పలాస : కాశీబుగ్గ జన జాగృతి కార్యాలయంలో శ్రీరంగం శ్రీనివాసరావు 115వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. జన జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు, డాక్టర్ లయన్ తెప్పల కృష్ణమూర్తి మాట్లాడుతూ సాహిత్యం సజీవంగా ఉంచడం, భావితరాలకు అందించడం మన ఆవశ్యకతన్నారు. జనజాగృతి అధ్యక్షులు లయన్ డాక్టర్ కుమార్ నాయక్ మాట్లాడుతూ వర్ధమాన రచయితలకు ప్రాచీన సాహిత్యాన్ని అందించి జనజాగృతి ప్రోత్సహిస్తుందన్నారు. సంస్థ ప్రధాన కార్యదర్శి బండారి కాళిదాసు మాట్లాడుతూ ఉత్తమ గ్రంథాలను జాగృతి భద్రపరుస్తుందని అన్నారు. కార్యక్రమంలో చెల్లూరి కైలాస్, బి.మాధురి పాల్గొన్నారు.

నేడు 'షైనింగ్ స్టార్' వార్షికోత్సవం


సంతోష్

వజ్రపుకొత్తూరు : మేడే సందర్భంగా ఈ నెల 1న గరుడభద్ర షైనింగ్ స్టార్ యువజన సంఘం 25వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని ఆ సంఘ అధ్యక్షుడు ఎలుకల సంతోష్ కుమార్ ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఖగపతి ఆధ్వర్యాన రాష్ట్రస్థాయి గ్రాండ్ డిఎస్‌సి మోడల్ టెస్టు నిర్వహిస్తున్నామని తెలిపారు. డిఎస్‌సి నమూనా పరీక్షలు ప్రతిభ కనబరిచిన విజేతలకు నగదు బహుమతులు సర్పంచ్ గూడ గిరిజ ఈశ్వర్ బహుమతులు అందజేస్తామని అన్నారు.

స్వాతి పరామర్శ

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

గార మండలం అంపోలు పంచాయతీ కోలపేటలో వంజల కొండమ్మ అనారోగ్య కారణంగా మరణించిన విషయం తెలుసుకొని వారి కుటుంబాన్ని తెలుగు మహిళా అధ్యక్షులు జి.స్వాతి బుధవారం పరామర్శించారు. అనంతరం వంజల మల్లేష్ అనారోగ్య కారణంగా మరణించడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఆమెతో పాటు టిడిపి నాయకులు ఉన్నారు.

బీచ్ ఫెస్టివల్‌కు ఉత్సాహంగా ఏర్పాట్లు


పరిశీలిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి - సోంపేట

జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన బారువా బీచ్‌లో మే 3, 4 తేదీల్లో నిర్వహించనున్న బీచ్ ఫెస్టివల్ కోసం ఏర్పాట్లు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ బీచ్ ప్రాంతాన్ని సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా జెసి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యుద్దీపాల అలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడల నిర్వహణ, పిల్లల ఆటల కోసం క్యామెల్, హార్స్ రైడింగ్, నది బోటింగ్, శాశ్వత హట్ల ఏర్పాటు తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో పలాస ఆర్‌డిఒ వెంకటేష్, జిల్లా పర్యాటక శాఖ అధికారి నారాయణరావు, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శ్రీధర్, పలాస డిఎస్‌పి, సిఐ, ఎస్‌ఐలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


కిట్లు అందిస్తున్న దాసరి రాజు


సభ్యత్వ కార్డులను అందజేస్తున్న మురళీమోహన్

సభ్యత్వ నమోదుతో కార్యకర్తలకు భరోసా

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

జనసేన సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా లభిస్తుందని జనసేన మండల అధ్యక్షుడు పైడి మురళీమోహన్ అన్నారు. బుధవారం మండలంలోని పెద్దపాలెం, గోనెపాడు, పురుషోత్తపురం, చిగురువలస, బుడ్డివలసలో జనసేన నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి కార్యకర్తలకు సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎన్నాడూ చూడని విధంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కార్యకర్తల కుటుంబాలకు భరోసా కల్పించే విధంగా సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. గతంలో ప్రమాదవశాత్తు మరణించిన కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని చెక్కుల రూపంలో అందించారని అన్నారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు క్షేత్రస్థాయిలో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని కపాసుకుద్దిలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు పలువురికి జనసేన కిట్లను బుధవారం పంపిణీ చేశారు. స్థానిక జనసేన నాయకుడు బడే దేవరాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జనసేన సభ్యత్వం తీసుకున్న వారికి ఈ కిట్లు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి అధినాయకుడు ఎంత తపన పడతారో అదే స్థాయిలో జన సైనికుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తారని తెలిపారు. వారి భద్రతను దృష్టిలో ఉంచుకుని వారికి ఇన్స్యూరెన్స్ సదుపాయం కల్పించడమే కాకుండా వెంటవెంటనే బీమా అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, జన సైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.


గొడుగులను అందజేస్తున్న ఆద్యశ్రీ

యాచకులకు గొడుగుల పంపిణీ

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ రామాలయం ఆవరణలోని యాచికులకు బుధవారం అక్షయ తృతీయ సందర్భంగా పలాసకు చెందిన కొంచాడ ఆదిత్య శ్రీవల్లి కుమార్తె ఆద్యశ్రీ గొడుగులు పంపిణీ చేశారు. అధిక ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉండడంతో యాచకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పరిశీలించి వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగించేందుకు గొడుగులు పంపిణీ చేశామని ఆద్యశ్రీ తల్లిదండ్రులు ఆదిత్యశ్రీవల్లి తెలిపారు. తమ వంతుగా చిన్నపాటి సహాయం చేశామన్నారు. కార్యక్రమంలో సత్యసాయి విద్యావిహార్ ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


పొందూరు : మాస్టార్ దంపతులను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

చేసిన సేవలే గుర్తింపునిస్తాయి

ప్రజాశక్తి- రణస్థలం

చేసిన సేవలే ఉద్యోగికి గుర్తింపునిస్తాయని ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్ అన్నారు. మండల పరిషత్ పరిపాలన అధికారిగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన వాండ్రంగి ధనుంజయరావు సన్మానసభను బుధవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 35 ఏళ్ల విధినిర్వహణలో అంకితభావంతో పనిచేసి రణస్థలం మండల పరిషత్‌లో ఉద్యోగ విరమణ చేయడం గొప్ప విషయమన్నారు.

కార్యక్రమంలో జెడ్‌పిటిసి టొంపల సీతారాముడు, ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు, తహశీల్దార్ ప్రసాదరావు, ఎంఇఒ ఎ.త్రినాథరావు, ఎపిఒ శ్రీనివాసనాయుడు, ధనుంజయరావు భార్య భారతి, ఆయన కుటుంబ సభ్యులు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని తాడివలస జిల్లాపరిషత్ పాఠశాలలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఆంగ్ల ఉపాధ్యాయుడు మెట్ట అనంతభట్లుకు బుధవారం హెచ్‌ఎం బల్ల కంటయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అనంతభట్లు మాస్టారు వృత్తి కోసం నిబద్ధత, నిజాయితీగా పనిచేశారని, పాఠశాలకు ఆయన అందించిన సేవలను కొనియాడారు. అనంతరం అనంతభట్లు దంపతులకు దుశ్శాలువ, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ తమ్మినైన మణెమ్మ, మాజీ ఎంపిపి కూన ప్రమీల, ఆమదాలవలస మున్సిపల్ కమీషనర్ పూజారి బాలాజీప్రసాద్, ఎంఇఒ జి.శ్రీరాములు, స్థానిక నాయకులు, గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.


బోరును ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీరామ్ ప్రసాద్

తాగునీటి బోరు ప్రారంభం

కవిటి: వేసవి తీవ్రత దృష్ట్యా పంచాయతీలోని ప్రతి గ్రామంలో తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్టు బొరివంక సర్పంచ్ బెందాళం శ్రీరామ్ ప్రసాద్ తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.2 లక్షలతో గ్రామంలోని బల్లెడ వీధిలో వేసిన తాగునీటి బోరు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి దుద్ది సతీష్, ఎంపిటిసి మాజీ సభ్యులు బెందాళం విజయ కృష్ణ, విద్యా కమిటీ చైర్మన్ బల్లెడ శ్రీపతి, రైతు సంఘం ప్రతినిధి బల్లెడ జయప్రకాష్, బల్లెడ సీతారాం, లోల్ల కింగ్ పాల్గొన్నారు.


సమీక్షిస్తున్న ఎపిఎం ప్రసాదరావు

మహిళా సంఘాలతో సమీక్ష

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రతి గ్రామ మహిళా సంఘాల్లోని మహిళలతో రైతు ఉత్పత్తిదారులు సంఘలు ఏర్పాటు చేయాలని ఎపిఎం ప్రసాదరావు సూచించారు. మండల మహిళా సమాఖ్య వెలుగు కార్యాలయం ఇచ్ఛాపురం గ్రామ సంఘ సహాయకులు, సిసిలు, రైతు ఉత్పత్తిదారుల సమైక్య సిబ్బందితో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామ సంఘంలోనూ మహిళలతో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేయాలన్నారు. కనీసం 300 సంఘాలు చేయాలన్నారు. గ్రామ సంఘాల అప్పులు, స్త్రీనిధి గ్రామ సంఘం సామాజిక పెట్టుబడి నిధి, నెలవారి డిమాండ్ కలెక్షన్, బ్యాలెన్స్ రిపోర్టులను పరిశీలించారు.


ఆర్థికసాయం అందజేస్తున్న టిడిపి నాయకులు

పలువురు ఆర్థికసాయం

పాతపట్నం : పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని పిల్లివీధికి చెందిన అరసవెల్లి భద్రం, శాంతామణి దంపతుల కుమార్తె వెన్నెల ఇటీవల గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నాడు. ప్రస్తుతం హైదరాబాద్ కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గానికి చెందిన పలువురు టిడిపి నాయకులు మానవతా దృక్పథంతో వెన్నెల తల్లిదండ్రులకు రూ.25 వేలు బుధవారం అందజేశారు. టిడిపి నాయకులు బమ్మిడి రాజు, శ్రీరామ్, రమణారావు, పడ్డ లోకేశ్వరరావు, రెంటికోట మాధవరావు, గుంపు భాస్కరరావు పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని మలకాం గ్రామానికి చెందిన అర్చకుడు విభూది నీలకంఠం కుటుంబానికి బుధవారం పొందూరుకు చెందిన కంచి కామాక్షి విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం అండగా నిలిచి ఆర్థికసాయాన్ని అందజేశారు. రహదారి ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో కదలలేని స్థితిలో మంచంపై ఉండడంతో కుటుంబపోషణ భారంగా మారింది. దీనిపై స్పందించిన విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం రూ.7,100, 50 కేజీల బియ్యాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు అరసవిల్లి వెంకటరావు, సింహాద్రి చంటి, కాకినాడ శ్రీను, గిడిజాల రమేష్ తదిరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి

మేడే ప్రత్యేక అనుబంధం

16 పేజీలు | శ్రీకాకుళం జిల్లా | గురువారం 1-5-2025



శ్రమజీవుల ఆశాజ్యోతి మేడే

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మానవ జాతి చరిత్రలో 18వ శతాబ్దం అంతకు పూర్వం కంటే అత్యంత అభివృద్ధి చెందిన శతాబ్దంగా వినుతికెక్కింది. ఆ శతాబ్దంలోనే ఇంగ్లండ్ మరికొన్ని యూరోపియన్ దేశాల్లో ఉత్పత్తి రంగంలో ఆవిరి యంత్రాలను ప్రవేశపెట్టడం ద్వారా పారిశ్రామికీకరణ ప్రారంభమైంది. 1776 మార్చిలో వాట్ సన్ ఆవిరి యంత్రాన్ని కనిపెట్టాడు. దాన్ని ఇంగ్లండ్‌లోని ఓ బొగ్గు గనిలో మొదటిసారిగా ఉపయోగించారు. ఈ క్రమం అమెరికాకు కూడా పాకింది. బ్రిటన్‌లో పారిశ్రామిక విప్లవం వల్ల 1820 సంవత్సరంలో ఉన్న చేనేత కార్మికుల సంఖ్య 2,40,000 నుంచి 1844 సంవత్సరానికి 60 వేలకు తగ్గింది (1860 నాటికి ఇది 8 వేలకు తగ్గిపోయింది). అదేకాలంలో మరమగ్గాల ఆపరేటర్లు 10 వేల నుంచి లక్షన్నరకు పెరిగారు. యూరప్ ఖండంలోనూ, అమెరికాలోనూ 19వ శతాబ్దంలో సైన్సు, టెక్నాలజీ బాగా అభివృద్ధి అయ్యాయి. దానితో భారీ పరిశ్రమలు ఏర్పడ్డాయి. వేల సంఖ్యలో కార్మికులు తలెత్తారు.

రైల్వేలు, మోటారు కార్లు, టెలిఫోన్, టెలిగ్రాఫ్, విద్యుచ్ఛక్తి కూడా వాడుకలోకి వచ్చాయి. ఆ శతాబ్దంలో జర్మనీ, ఫ్రాన్స్ దేశాల్లో పారిశ్రామికరంగ అభివృద్ధి విశేషంగా జరిగింది. యూరప్ ఖండంలోనూ, అమెరికాలోనూ పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల సంఖ్య ఒక కోటికి పెరిగింది. దానితో ఉత్పత్తి రంగంలో



పెట్టుబడిదారీవర్గం, కార్మికవర్గం అనే రెండు ప్రత్యర్థి వర్గాలు తలెత్తాయి. పెట్టుబడిదారులు శ్రామిక ప్రజల శ్రమశక్తిని క్రూరంగా దోచుకుంటున్నారు. దీంతో పెట్టుబడిదారీ, కార్మికవర్గాల మధ్య సంఘర్షణ అనివార్యమైంది.

పారిశ్రామిక విప్లవం ప్రారంభ దినాల్లో శ్రామికులు బానిసల మాదిరిగా శ్రమిస్తుండేవారు. పారిశ్రామివేత్తలు అధిక లాభాలను పిండుకోవడానికి ఆరేడేళ్ల పిల్లలతోనూ, మహిళలతో కూడా ఫ్యాక్టరీల్లో, గనుల్లో పని చేయించారు. బాల కార్మికులు గనుల్లోని చీకటి సొరంగాల్లో.. బొగ్గు బళ్లను మోచేతులపైన, మోకాళ్లపైన పాకుతూ లాగేవారు. ఆఖరికి పొగగొట్టాల పైకెక్కి వాటిని శుభ్రపర్చేవారు. ఇంగ్లండ్‌లోని అనాథ శరణాలయాల్లో పిల్లలను (మిగతా...2లో)

పారిశ్రామికరంగం నిరాశాజనకం

- పరిశ్రమల దుస్థితికి అద్దంపడుతున్న ఎంఎస్ఎంఇ సర్వే
- జిల్లాలో మొత్తం 27,718 పరిశ్రమల సందర్శన
- అందులో 12,508 మూత
- జిల్లాకు గతేడాది కాలంలో ఒక్క పరిశ్రమ రాని వైనం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో 2024లో పారిశ్రామికంగా పెద్దగా పురోగతి కనిపించలేదు. అడదడపా పరిశ్రమలు నెలకొల్పేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చినా పట్టాలెక్కలేదు. ముడిసరుకులు, విద్యుత్ నిర్వహణ భారంతో ఒక్కొక్కటిగా పరిశ్రమలు మూతపడ్డాయి. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గతేడాది డిసెంబర్‌లో సూక్ష్మ, మధ్య, చిన్నతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఇ)పై ప్రభుత్వం సర్వే నిర్వహించింది. సర్వేలో జిల్లాలో పరిశ్రమల స్థితిగతులపై అనేక విషయాలు వెలుగు చూశాయి. జిల్లాలో అన్నిరకాల పరిశ్రమలు కలిపి మొత్తం 27,718 పరిశ్రమలను సర్వే బృందాలు సందర్శించాయి. వాటిలో 12,508 మూతపడినట్లు గుర్తించాయి.



జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం ఇథనాల్, పేపర్, ఫార్మాస్యూటికల్స్ పవర్ జనరేషన్, గ్రానైట్ వంటి భారీ, మెగా పరిశ్రమలు 40 వరకు ఉన్నాయి. వీటి ద్వారా 63,070 మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు ప్రభుత్వం లెక్కలు చెప్తోంది. వీటితో పాటు రైస్ మిల్లులు, జీడిపప్పు పరిశ్రమలు, పేపర్ ప్లేట్ ఉత్పత్తులు, పాలిథిన్ క్యారీ బ్యాగులు, ఇత్తడి వంటి సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు 4,083 ఉన్నాయి. జిల్లాలో గతేడాది కాలంలో కొత్తగా ఒక్క పరిశ్రమ ఏర్పాటు కాలేదు. రణస్థలం మండలం సంచాంలో ఏడాదికి తొమ్మిది వేల మెట్రిక్ టన్నుల మందుల ఉత్పత్తితో రూ.350 కోట్లతో బల్క్ డ్రగ్ ఉత్పత్తులను ప్రారంభించేందుకు హైయాసింథాస్ ఫార్మా ప్రయివేట్ లిమిటెడ్ ముందుకొచ్చింది. పరిశ్రమలో ప్రత్యక్షంగా 500 మందికి, పరోక్షంగా వెయ్యి మందికి ఉపాధి కల్పిస్తామని అంగీకరించింది. పరిశ్రమకు కావాల్సిన 11.41 ఎకరాల భూమిని ప్రభుత్వం అప్పగించాల్సి ఉంది. పరిశ్రమ ఏర్పాటు చేయనున్న ప్రాంతం అనువైనదేనని అధికారులు తనిఖీ చేసి నిర్ధారించారు. ఇప్పటికీ భూమి అప్పగింతలో ఆలస్యం జరుగుతోంది.

అనుమతుల జాప్యంతో పట్టాలెక్కని పరిశ్రమలు

రణస్థలం మండలం చిట్టివలసలో రూ.720 కోట్లతో ఏడాదికి 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ఔషధాలు ఉత్పత్తి చేసేందుకు సంబంధిత యాజమాన్యం ముందుకొచ్చింది. పరిశ్రమలో ప్రత్యక్షంగా 500 మందికి, పరోక్షంగా వెయ్యి మందికి ఉపాధి కల్పించేందుకు అంగీకరించింది. పరిశ్రమకు 13.91 ఎకరాల భూమి కావాల్సి ఉంది. ప్రస్తుతం భూ పరిపాలన ముఖ్య కమిషనర్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉంది. పరిశ్రమ ఏర్పాటు చేసే ప్రాంతం అనువైనదేనని అధికారులు నిర్ధారించారు. ప్రభుత్వం నుంచి ఇంకా అనుమతులు రాలేదు. ఎచ్చెర్ల మండలం అల్లినగరంలో రూ.65 కోట్లతో రసాయనిక పరిశ్రమ ఏర్పాటుకు ఎన్ఎసిఎల్ ముందుకొచ్చింది.పరిశ్రమలో 200 మందికి ఉపాధి కల్పిస్తామని అంగీకరించింది. కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయి.

అటకెక్కిన జ్యూట్ పరిశ్రమల నివేదిక

జిల్లాలో 12 జ్యూట్ మిల్లులున్నాయి. వాటిలో ప్రస్తుతం ఐదు నడుస్తుండగా ఏడు చోట్ల మూతపడ్డాయి. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో మూతపడ్డ, పలురకాల సమస్యలతో సతమతమవుతున్న జ్యూట్ మిల్లులను ఆదుకునేందుకు 2019లో వైసిపి ప్రభుత్వం జౌళిశాఖ మిల్లులకు ఆర్థికంగా చేయూత అందించేందుకు కల్పించాల్సిన రాయితీలు, ఉపశమన చర్యలు, పరిష్కార మార్గాల అధ్యయనానికి ముగ్గురు సభ్యుల కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వారం రోజుల్లోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనిపై 2019 నవంబర్‌లోనే శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల కలెక్టర్లు నివేదిక అందించారు. చేపల సాగు మాదిరిగా సబ్సిడీపై విద్యుత్‌ను అందించాలి. బెంగాల్, బీహార్, అస్సాంల నుంచి దిగుమతి చేసుకునే ముడిసరకుల రవాణకు సబ్సిడీ అందించాలని సూచించారు. కార్మికుల్లో నైపుణ్యం పెంచేందుకు అవసరమైన శిక్షణలకు నిధులు కేటాయించాలి. జ్యూట్ మిల్లులకు తక్కువ వడ్డీ రేట్లకు పెట్టుబడి, ఇతర రుణ సౌకర్యం కల్పించాలని నివేదించారు. జ్యూట్ పురితాళ్లు, జ్యూట్ దారాలపై జిఎస్‌టి తగ్గించాలంటూ నివేదికలో పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్ మాదిరిగా జ్యూట్ ఉత్పత్తులకు జిఎస్‌టి పన్నును రీయింబర్స్‌మెంట్ చేయాలి. ప్లాస్టిక్ వస్తులను పూర్తిగా నిషేధించాలని సూచించారు. భారత ఆహార సంస్థ, పౌర సరఫరా సంస్థలు బియ్యం బస్తాలను కుట్టేందుకు జ్యూట్ పురితాళ్లు, దారాలు వినియోగించాలంటూ తదితర అంశాలతో ఇచ్చిన నివేదికలను ప్రభుత్వం అటకెక్కించింది.

శ్రమజీవుల ఆశాజ్యోతి మేడే

అక్కడి అధికారులు పారిశ్రామికవేత్తలకు పశువుల మాదిరిగా విక్రయించేవారు. బాల కార్మికులు ఉదయం నుంచీ రాత్రి వరకూ యంత్రాల వద్ద నిలబడి పనిచేసేవారు. క్షణం సేపు కన్ను మూస్తే ఆ చిన్నారుల వీపులు కొరడా దెబ్బలతో చిట్లిపోయేవి. ఇక శ్రమజీవులతో రోజూ 16 గంటలు పనిచేయించేవారు. మరికొందరు పెట్టుబడిదారులు 20 గంటలు కూడా పనిచేయించారు. 1806లో అమెరికాలోని ఫిలడెల్ఫియాలో చెప్పులు కుట్టే కార్మికులు సమ్మె చేసిన సందర్భంగా జరిగిన విచారణలో కార్మికులతో యజమానులు రోజుకు 20 గంటలు పనిచేయించుకుంటున్నట్లు లోకానికి వెల్లడైంది. కార్మికులకు అతి తక్కువ జీతా లిచ్చేవారు. పని భద్రత, సౌకర్యాలుండేవి కావు. ఫ్యాక్టరీల్లో గాలీ వెలుతురు మృగ్యం. యంత్రాల వద్ద రక్షణ లేక కార్మికులు అనేక రకాలుగా ప్రమాదాల బారిన పడి మరణిస్తుండేవారు. కార్మికులు అమానుష శిక్షలకు కూడా గురవుతుండేవారు.

కార్మికులు తాము అనుభవించే పీడనకూ.. దోపిడీకీ కారణం తాము పనిచేసే యంత్రాలేనని భ్రమించారు. తెగించి వాటిని ధ్వంసం చేయడం ప్రారంభించారు. ఈ విధ్వంసకాండ మొదట బ్రిటన్‌లో ప్రారంభమైంది. దీంతో పారిశ్రామికవేత్తలు సాయం కోసం ప్రభుత్వం వద్దకు పరిగెత్తారు. నికృష్టంగా.. దోపిడీకి గురవుతున్న కార్మికుల ప్రాణ రక్షణకు చలించని ప్రభుత్వం.. వెంటనే యజమానులు ఆస్తి రక్షణకు పార్లమెంటును ఉపయోగించింది. యంత్రాలను ధ్వంసం చేసేవారికి మరణశిక్ష విధిస్తూ చట్టం చేసింది. తర్వాత కార్మికులు.. యంత్రాలను ధ్వంసం చేయడంలో అర్థం లేదనీ.. తమ దుస్థితికి కారణం ఫ్యాక్టరీ యజమానులే అని గ్రహించారు. ఆ దుస్థితి నుంచి బయట పడటానికి పోరాటం చేయడమొక్కటే మార్గమని అర్థం చేసుకున్నారు. దానితో పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా శ్రామికవర్గం పోరాటం ప్రారంభించింది.

ట్రేడ్ యూనియన్ల మహత్తర సామాజిక శక్తిని చూసి పాలకులు, పెట్టుబడిదారులు హడలెత్తిపోయారు. ఇంగ్లండ్, ఫ్రాన్స్, జర్మనీ దేశాల్లో కార్మికులు అధిక జీతాలు డిమాండ్ చేయడానికి ట్రేడ్ యూనియన్లు నిర్మించుకోవడం చట్ట విరుద్ధంగా ప్రకటించారు. ఏర్పాటైన ట్రేడ్ యూనియన్లను నిషేధించారు. దోపిడీదారులైన పెట్టుబడిదారులు, వారికి అండదండలిచ్చే పాలకులు అనేక మంది కార్మిక నాయకులనూ, ట్రేడ్ యూనియన్ సభ్యులనూ జైళ్లలో కుక్కారు. హత్యలు చేశారు. వారికున్న కొద్దిపాటి సొత్తును సయితం కాజేశారు. ట్రేడ్ యూనియన్లను నిరంకుశంగా నిషేధించారు. సమ్మె హక్కునూ, పికెటింగ్ హక్కునూ లాగేశారు.

బూర్జువా పాలకులు ట్రేడ్ యూనియన్లను నిషేధించినా, పశుబలంతో కార్మికవర్గ పోరాటాలను రక్తపుటేరుల్లో ముంచినా.. కార్మికవర్గం వెనుకంజవేయలేదు. పనిగంటల తగ్గింపు, న్యాయమైన వేతనాలు, ట్రేడ్ యూనియన్ల గుర్తింపుకోసం ప్రభుత్వం నుంచి హక్కులు సాధించడానికి కార్మికవర్గం వర్గ చైతన్యంతో పోరాటాలను కొనసాగించింది. ఈ పోరాట జ్వాలలు 19వ శతాబ్ద ప్రథమార్థ భాగంలో బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, అమెరికాల్లో దోపిడీ శక్తులను చుట్టుముట్టాయి. ఇంగ్లండ్‌లో 1818లో స్టాక్‌పోర్టు పట్టణంలోని బట్టల ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులు సమ్మె బావుటాను ఎగురవేశారు. ఈ సమ్మె పోరాటం కార్మికవర్గ చరిత్రలో ప్రథమ సమ్మె పోరాటంగా చెప్పబడింది. ఫ్రాన్స్ దేశం లయాన్స్ పట్టణంలోని సిల్కు పరిశ్రమల్లో 1831లోనూ, 1834లోనూ కార్మికులు తిరుగుబాటు జరిపారు.

ప్యారిస్ నగరంలో 1848 జూన్ 23-26 మధ్య సమ్మె పోరాటాలు జరిగాయి. జర్మనీలోని సైలీషియాలో 1844లో నేత పనివారు తిరుగుబాటు చేశారు. ఈ తిరుగుబాటు ద్వారా శ్రామికవర్గ నిర్మాణాత్మక పటిమ, బూర్జువావర్గంతో దానికిగల శత్రుత్వం స్పష్టంగా వెల్లడయింది. నైరుతీ జర్మనీలో 1848లో విప్లవోద్యమం రగుల్కొంది. అదేఏడు ఆస్ట్రియా వియన్నాలో తిరుగుబాటు వచ్చింది. కార్మికులు విజయం సాధించారు. బెర్లిన్‌లో కార్మికులు, సైనికులకూ మధ్య సంఘర్షణలు జరిగాయి. చివరికి శ్రామికులు విజయం సాధించారు. ఈ కాలంలోనే అమెరికాలో పెక్కు నగరాల్లో కార్మికులు తమ హక్కుల సాధన కోసం పోరాటాలు నిర్వహించారు.

యూరప్ ఖండంలోనూ, అమెరికాలోనూ కార్మికవర్గ బలమైన పోరాటాలు జరపడం వల్ల ప్రభుత్వాలు దిగివచ్చి కార్మికవర్గానికి అనుకూలంగా కొన్ని చట్టాలు చేశాయి. వాటిలో ముఖ్యమైనవి పనిగంటలకూ, బాల కార్మికులకూ సంబంధించినవి. బ్రిటన్‌లో 13 సంవత్సరాల లోపు పిల్లలతో రోజుకు 9 గంటలకు మించి పని చేయించరాదనీ 1834లో ఒక ఫ్యాక్టరీ చట్టం చేయబడింది. శ్రామిక ప్రజలు జరిపిన పోరాటాల వల్ల కొన్ని చట్టాలు చేసినా నిరంకుశాధికారులు వాటిని అమలు చేయలేదు. ఏడాదికేదాది ఫ్యాక్టరీల నిర్మాణం పెరిగిపోతోంది. గనులు, రవాణా రంగాల్లో పనిచేసే కార్మికుల సంఖ్య లక్షల్లో పెరిగింది. కార్మికుల్లో వర్గ చైతన్యం వెల్లివిరిసింది. బలమైన ట్రేడ్ యూనియన్ల నిర్మాణం జరిగింది. కార్మికవర్గ పోరాటాలు బూర్జువా వర్గాలను చుట్టుముట్టాయి.

10 గంటల పని దినం నిర్ణయించాలన్న కోరిక మీద 19వ శతాబ్దం ప్రారంభంలో అమెరికాలో ప్రతి పారిశ్రామిక కేంద్రంలోనూ సమ్మెలు జరిగాయి. ఫిలడెల్ఫియాలోని మెకానిక్ యూనియన్ ఈ 10 గంటల పనిదినం సాధించే పోరాటాన్ని 1827లో ప్రారంభించింది. ఈ పోరాటోధృతిని తట్టుకోలేక అమెరికా ప్రభుత్వం 10

మొదటి పేజీ తరువాయి

గంటల పనిదినం నిర్ణయిస్తూ శాసనం చేసింది. తర్వాత ఈ 10 గంటల పనిదినం ఉద్యమం అట్లాంటిక్ మహాసముద్రం దాటి యూరప్ ఖండంలో ప్రవేశించి అక్కడి కార్మికవర్గాన్ని ఉత్తేజపరిచింది. యూరప్ ఖండంలో కార్మికులు జరిపిన పోరాటాల ఫలితంగా అనేక దేశాలు 10 గంటల పని దినం అంగీకరిస్తూ చట్టాలు చేశాయి.

1870 నాటికి పారిశ్రామిక, వాణిజ్య, బ్యాంకింగ్ రంగాల్లో గుత్తాధిపత్యం రూపుదాల్చి బలపడింది. పెట్టుబడిదారీ వర్గం కొన్ని ఒడిదుడుకులకు గురయినప్పటికీ అధికలాభాలు పోగేసుకోవడానికి ఆ వర్గాలకు మంచి అవకాశాలు ఏర్పడ్డాయి. కానీ కార్మికవర్గం జీవితాల్లో అభివృద్ధి మాత్రం మృగ్యం. దానితో కార్మికవర్గం పనిగంటల తగ్గింపుకోసం ఉద్యమించింది. 1881 చికాగో నగరంలో వివిధ కార్మిక సంఘాలు కలిసి ఒక సమాఖ్యను నూతనంగా ఏర్పాటు చేసుకున్నాయి. దానికి 'అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ లేబర్' అని పేరు పెట్టారు. ఈ సమాఖ్య 1884 అక్టోబరు 7న తన 4వ సమావేశంలో 8 గంటల పనిదినం ప్రవేశపెట్టాలని చారిత్రాత్మకమైన తీర్మానం చేసింది. 1886 మే 1న దేశమంతా కార్మికవర్గం 8 గంటల పని హక్కు సాధనకు సమ్మె పోరాటాలను నిర్వహించాలని కూడా నిర్ణయించింది. 8 గంటల పనిదినం ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవలసిన అవసరాన్ని కార్మికవర్గం అత్యంత ముఖ్యమైన డిమాండుగా గుర్తించింది. ట్రేడ్ యూనియన్ల సభ్యత్వం లక్షల్లో పెరిగింది. ఈ విధంగా 8 గంటల పనికోసం అనేకచోట్ల కార్మిక పోరాటాలు ప్రారంభమయ్యాయి.

చికాగో నగరంలోని కార్మికవర్గం అమెరికన్ కార్మికవర్గంలో ఒక భాగమే అయినా అక్కడి కార్మికవర్గానికి ఒక ప్రత్యేకత ఉంది. సమస్యల పరిష్కారానికి వారు పటిష్టమైన విప్లవ దృక్పథం అవలంబించేవారు. ఆ నగరంలోని కార్మిక నాయకులు ఎప్పుడూ కార్మికవర్గాన్ని విప్లవ మార్గాన నడిపిస్తూ ఉండేవారు. సమ్మెకు అనేక రోజులకు పూర్వమే "8 గంటల పని దినం సంఘం" ఒకటి అనేక రాజకీయ దృక్పథాలు గలవారితో ఏర్పడి పనిచేస్తోంది. ఆ సంఘం నాయకత్వంలో ఏప్రిల్ 30న (మేడేకి ఒకరోజు ముందు) 25 వేల మంది కార్మికులతో బ్రహ్మాండమైన ప్రదర్శన జరిగింది. మే 1న చికాగో నగరంలో కార్మికవర్గం చైతన్యం వెల్లివిరిసింది. నగరవీధులన్నీ ఉత్సాహవంతులైన కార్మికులతో నిండిపోయాయి. నగరంలో బ్రహ్మాండమైన సార్వత్రిక సమ్మె జరిగింది. కార్మాగారాలన్నీ మూతపడ్డాయి. అదివరకెన్నడూ కనీవినీ ఎరుగనంతటి ఐకమత్యంతో మూడున్నర లక్షల మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. నగర వీధులన్నీ కార్మిక సందోహంతో నిండిపోయాయి. 8గంటల పనిదినాన్ని సాధించి తీర్తామనే దృఢ విశ్వాసం వారందరిలోనూ కనిపించింది. సమ్మెను విజయవంతం చేయడానికి వారు సర్వ శక్తులనూ ఒడ్డటానికి సిద్ధమయ్యారు. కార్మికవర్గ శత్రువులు కూడా విజృంభిస్తున్న ఈ కార్మికవర్గ ఉద్యమాన్ని ఏ విధంగానైనా నాశనం చేయాలని నిర్ణయించుకున్నారు. పెట్టుబడిదారీ వర్గానికి అండగా ప్రభుత్వం కూడా రంగ ప్రవేశం చేసింది.

మే 3న శాంతియుతంగా సమ్మె చేస్తున్న కార్మిక జనసమూహంపై అమెరికన్ పోలీసులు కాల్పులు జరిపారు. ఆరుగురు కార్మికులను బలి తీసుకున్నారు. ఈ దారుణ హత్యాకాండ పట్ల అసమ్మతి తెలిపేందుకు మే 4న నగరం మధ్యలో ఉన్న హే మార్కెట్‌లో కార్మికులు పెద్ద ఎత్తున నిరసన సభ జరిపారు. ప్రశాంతంగా సాగుతున్న ఆ సభ మీద పోలీసులు విరుచుకుపడ్డారు. మధ్యలో బాంబు ప్రయోగం జరిగింది. ఒక పోలీసు సార్జెంట్ చనిపోయాడు. అది సాకుగా తీసుకొని పోలీసులు నిరాయుధులైన ప్రజలపై తుపాకులతో.. సన్నీలతో స్వైరవిహారం చేశారు. అయినప్పటికీ నిరాయుధులైన కార్మికులు సంఘటితంగా చైతన్యదీప్తితో పోలీసులతో బాహాబాహిగా తలపడ్డారు. ఈ సంఘర్షణలో ఏడుగురు పోలీసులు చనిపోగా.. నలుగురు కార్మికులు నేలకొరిగారు. పాలకులు అదనపు బలగాలను రంగంలోకి దించారు. హే మార్కెట్ ప్రాంతం కార్మికుల రక్తంతో తడిసిపోయింది. అక్కడే ఆవిర్భవించింది ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది శ్రమజీవుల స్వేచ్ఛా సంకేతమైన "అరుణపతాకం".

హే మార్కెట్ ఉదంతాన్ని పురస్కరించుకొని బూర్జువా ప్రభుత్వం కార్మికోద్యమ నాయకులను చుట్టివేసే కార్యక్రమం ప్రారంభించింది. న్యాయస్థానం ముందు విచారణా తతంగం జరిపి సార్సన్, స్పిన్, పిషర్, ఏంగెల్ అనే కార్మిక నాయకులను ఉరి తీయించింది. మరికొందరిని దీర్ఘకారాగార శిక్షలకు గురిచేసింది. తనను ఉరితీసే ముందు స్పిన్ ఇలా అన్నారు. "మమ్మల్ని ఉరితీస్తే మంటలు ఆరిపోతాయను కుంటున్నారా? ఇదిగో అక్కడ, ఇక్కడ, ఆమూలు, ఈమూల, మీ వెనుక, మీ ముందు అన్నిచోట్లా జ్వాలలు చెలరేగుతాయి. అది అంతర్వాహిని. దాన్ని ఆర్పడం మీ తరంకాదు". దేశమంతా ఇతర కేంద్రాల్లో కూడా ఈ దమనకాండ కొనసాగింది. అయినప్పటికీ అమెరికన్ కార్మికుల్లో మాత్రం మే1న విప్లవ చైతన్యం వెల్లివిరిసింది. ప్రతి కార్మికుడూ వర్గ చైతన్యాన్ని ప్రదర్శించడానికి వీధుల్లోకి వచ్చాడు.

ఆ విధంగా 1886 మే 1న ప్రపంచ కార్మిక వర్గ విప్లవ చరిత్రలో రక్తాక్షరాలతో లిఖించదగిన తేదీగా మారిపోయింది. ఆనాటి పోరాటోద్యమానికి చికాగో నగరమే కేంద్రమయినప్పటికీ దేశంలోని అనేక ముఖ్య నగరాలకు ఆ ఉద్యమం వ్యాపించింది. న్యూయార్క్, బాల్టిమోర్, వాషింగ్టన్, పిట్స్‌బర్గ్, డిట్రాయిడ్ మొదలైన పెద్ద నగరాల్లోని శ్రామికులు కూడా మహోత్తేజంగా పోరాటంలోకి దూకారు. ప్రపంచవ్యాప్తంగా శ్రమజీవులను ఉత్తేజపరిచి వారిలో ఆశాజ్యోతిని వెలిగించింది మే దినోత్సవం.

జీడి కార్మికులకు భద్రత కరువు

పలాస మండలంలోని పలాస-కాశీబుగ్గ జంటపట్టణాలు తెల్ల బంగారంగా పేరుగాంచిన జీడిపప్పును ఉత్పత్తి చేయడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. జిల్లాలో సుమారు 350 జీడి పరిశ్రమలుండగా పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లోనే 250కు పైగా పరిశ్రమలున్నాయి. ఈ పరిశ్రమలపై ప్రత్యక్షంగా 7500 మంది, పరోక్షంగా 5 వేల మంది ఉపాధి పొందుతున్నారు. కాగా జీడి పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు ఏళ్ల తరబడి కార్మిక చట్టాలు అమలుకాకపోడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

– ప్రజాశక్తి, పలాస

◆ పరిశ్రమల్లో అమలు కాని కార్మిక చట్టాలు

◆ పట్టించుకోని ప్రభుత్వాలు

ప్రస్తుతం జీడి కార్మికుల బతుకులు దుర్భరంగా ఉన్నాయి. పనిచేసిన చోట కనీస వసతుల్లేవు. మహిళా కార్మికులకు కనీసం మరుగుదొడ్డి సదుపాయం కూడా కల్పించడం లేదు. కార్మిక చట్టాలు అమలుకావడం లేదు. జీడి పరిశ్రమల్లో చెమటోడ్చి పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. కార్మిక శాఖాధికారులు సైతం కార్మిక చట్టాలు అమలులో తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు కేవలం ఎన్నికల సమయంలోనే కార్మికుల సమస్యలను గుర్తుకు తెచ్చుకుని, ఆ తరువాత విస్మరిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అసలు పట్టించుకోవడమే మానేశాయి. మొత్తమ్మీద జీడిపరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారు.

కార్మికులకు అందని కార్మిక చట్టాలు

జీడి పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికునికి సంబంధిత యజమాని రూ.350 వెల్ఫేర్ ఫండ్ చెల్లించాల్సి ఉండగా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. కార్మికుల సౌకర్యార్థం ఇఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటుచేయలేదు. ప్రావిడెంట్ ఫండ్‌ను యాజమాన్యం కార్మికుల నుంచి తీసుకుంటున్నప్పటకీ చెల్లింపులు జరపడం లేదు. కొందరు చెల్లిస్తున్నప్పటికీ రశీదులివ్వని పరిస్థితి నెలకొంది. చేతిగొడుగులు ఇవ్వకపోవడంతో జీడిపిక్కను ఒలిచే సమయంలో వచ్చే యాసిడ్‌తో మహిళల చేతులకు వాపులు, ఇతర చర్మవ్యాధులు వస్తున్నాయి. పర్యావసానం పింఛను పొందుతున్న జీడి కార్మికులు పింఛన్లు అందించే సమయంలో వేలిముద్రలు నమోదుకాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలామంది కార్మికులకు బయోమెట్రిక్ విధానంతో పింఛను అందని పరిస్థితి నెలకొంది. మొత్తమ్మీద జీడి పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు కార్మిక చట్టాలత ోపాటు కనీస సదుపాయాలకు నోచుకోలేకపోతున్నారు.

జీడి పరిశ్రమలు ఏర్పాటిలా...

16వ శతాబ్దంలో తీర ప్రాంతం కోతకు గురికాకుండా ఉండేందుకు పోర్చుగ్రీసు వారు వేసిన జీడి మొక్కలతో ఉత్పత్తి అయిన జీడి గింజలు ఒకానొకదశలో పసుపక్ష్యాదులకు ఆహారంగా ఉండేవి. ఆ తరువాత జీడి గింజలను కాల్చి అందులోని పప్పు రుచి చూసిన ప్రజలు జీడి పంటలపై ఆసక్తి చూపించారు. 50 ఏళ్ల క్రితమే పలాసలో జీడి పరిశ్రమకు అంకురార్పణం జరిగింది. 1945 నుంచి పలాసలోని పలువురు జీడి వ్యాపారులు జీడి పిక్కలను కొనుగోలు చేయడం ప్రారంభించారు. అప్పటివరకు అక్కడి రైతులకు జీడి పిక్కల విలువేంటో తెలియని పరిస్థితి. రాష్ట్రంలో జీడి ఉత్పత్తికి కేంద్రమైన 'మోరి' ప్రాంతం నుంచి పలువురు వ్యాపారులు పలాసకు వచ్చి ఉద్దానం జీడి పిక్కలపై దృష్టిసారించారు. ఆ తరువాత వేటపాలెం ప్రాంతానికి చెందిన రాధాకృష్ణ అనే వ్యాపారి పలాస వచ్చి జీడిపరిశ్రమను ఏర్పాటుచేశారు. అప్పటికే పలాసకు చెందిన మల్లా జనార్ధన అనే వ్యాపారి పెనంపై జీడిగింజలను కాల్చి పప్పును తీసి మార్కెట్‌లో విక్రయించేవారు. ఈ విధంగా ప్రారంభమైన జీడి పరిశ్రమ అంచెలంచెలుగా ఎదిగింది. 1986 నాటికి పలాసలో రోస్టింగ్ విధానంతో 30 జీడిపరిశ్రమలుండగా, నేడు పలాసతోపాటు పరిసర ప్రాంతాల్లో మొత్తం 250 పరిశ్రమలున్నాయి. ఈ పరిశ్రమలు ద్వారా వచ్చిన జీడిపప్పును ప్రస్తుతం దేశంలోని పెద్ద నగరాలైన ముంబై, కోల్‌కతా, చెన్నయ్, ఢిల్లీ, అహ్మదాబాద్ తదితర ప్రాంతాలకు పప్పు ఎగుమతి అవుతుంది. ప్రస్తుతం జీడి పరిశ్రమలకు కావాల్సిన ముడిసరుకు జిల్లా నుంచి అందకపోవడంతో ఇతర దేశాల పిక్కలపై ఆధారపడి నడుస్తున్నాయి. పలాసకు శ్రీకాకుళం జిల్లా నుంచే కాకుండా ప్రపంచంలో భూమధ్యరేఖకు సమీపంలో ఉన్న ఆసియా, ఆఫ్రికా ఖండాల్లోని 35 దేశాల నుంచి జీడిపిక్కలు దిగుమతి అవుతున్నాయి. ముఖ్యంగా నైజీరియా, గనా, ఐవిరికోస్టు, బెనిన్, గెనిబిసావ్, టాంజానియా, ఇండోనేషియా, కెన్యా తదితర దేశాల నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, కేరళలోని కొచ్చిన్, కర్నాటకలోని మంగుళూరు,



పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు

తమిళనాడులోని తూటికోర్న్, పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతా తదితర పోర్టులకు పిక్కలు దిగుమతి అవుతున్నాయి. అక్కడ నుంచి పలాసకు జీడిపిక్కలను తీసుకువచ్చి జీడిపరిశ్రమల్లో ముడిసరుకుగా వినియోగిస్తున్నారు. 80 కిలోలు పిక్కల బస్తా నుంచి 20-22 కిలోలు వరకు జీడిపప్పు దిగుబడి వస్తుంది. పప్పు గ్రేడింగ్ బట్టి పలాసలో 16 రకాలుండగా ఇతర దేశాలకు 32 రకాల జీడిపప్పు ఎగుమతి అవుతున్నాయి. ఈ జీడిపప్పుతో మన దేశానికి విదేశీ కరెన్సీ ద్వారా కోట్లాది రూపాయలు రావడమే కాకుండా లక్షలాది మంది కార్మికులకు జీవనోపాధి లభిస్తోంది. ప్రభుత్వం మాత్రం పరిశ్రమల అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా రాష్ట్రం విడిపోయిన తరువాత పరిశ్రమలు తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడ్డాయి. విజయవాడ దాటి హైదరాబాద్ వెళ్లాలంటే పన్ను పోటు పెరిగింది. పలాస నుంచి తిరుపతి, ఇతర దేవస్థానాలకు జీడిపప్పు కొనుగోలు చేయాలనే డిమాండ్ గత కొన్నేళ్లుగా ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇతర రాష్ట్రాల నుంచి జీడిపప్పును కొనుగోలు చేస్తుంది తప్ప ఇక్కడ ఉత్పత్తి అవుతున్న పప్పును కొనుగోలు చేయడం లేదు. మరోవైపు పరిశ్రమలకు రాయితీలు కల్పించకపోవడం, పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు మెరుగైన సదుపాయాలు కల్పించకపోవడం, కనీస వేతనాలు అమలు చేయకపోవడంతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏడాదికి పరిశ్రమలకు అవసరమైన 10.80 లక్షల టన్నులు ముడసరుకులు మన రాష్ట్రం నుంచి ఉత్పత్తి కావడంలేదని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీడి పంట సాగు విస్తీర్ణాన్ని పెంచడంతోపాటు జీడిపరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం రాయితీలు కల్పించాలని, ఈ ప్రాంతంలోని వేలాది మంది కార్మికుల జీవనోపాధికి ఆటంకాలు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



పలాసలోని జీడి పరిశ్రమ

జీడి పంట సాగు వివరాలు

జిల్లాలో సుమారు లక్ష ఎకరాల్లో జీడిపంట సాగవుతుంది. పలాస నియోజకవర్గంలో 21,300 ఎకరాల్లో, కవిటి, కంచిలి, సోంపేట మండలాల్లో 17 వేల ఎకరాల్లో జీడిపంట సాగవుతుంది. 74 గ్రామాల్లో సాగవుతున్న ఈ పంటతో సుమారు 5 లక్షల క్వింటాళ్ల జీడిపిక్కలు దిగుబడి అవుతుంటాయి. ఏటా ఆశించిన స్థాయిలో జీడిపంట దిగుబడి రాకపోతుండడంతో నైజీరియా, టాంజానియా, మలేషియా, న్యూజిలాండ్ దేశాలతోపాటు మనదేశంలోని కేరళ, తదితర రాష్ట్రాల నుంచి వ్యాపారులు జీడిపిక్కలను దిగుమతి చేసుకుని గోదాములలో నిల్వ చేసుకుంటుంటారు. వీటిని ఏడాది పొడవునా వినియోగిస్తుంటారు. ప్రస్తుతం జీడిపిక్కల బస్తా (80 కిలోలు) రూ.13 వేలు వరకు ధర పలుకుతుంది. ఈ పంటే జీవనాధారంగా వేలాది మంది రైతులు బతుకుతున్నారు. ఉద్దానంలో పండించిన జీడిపిక్కలనే పలాసలోని జీడి పరిశ్రమలకు అందిస్తుంటారు. తిత్లీ తుపాను ప్రభావంతో ఉద్దాన ప్రాంతంలో జీడి పంట పూర్తిగా నాశనం కావడంతో ఈ ఏడాది ఉద్దాన ప్రాంత రైతులు, జీడి కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇతర దేశాల నుంచి జీడిపిక్కలను వ్యాపారులు దిగుమతి చేస్తేనే ఉపాధి లభించే అవకాశం ఉందని, లేకుంటే కుటుంబమంతా పస్తులు ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడతాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సంక్షోభంలో గ్రానైట్ పరిశ్రమ



ప్రజాశక్తి- టెక్కలి రూరల్

పరిశ్రమలు, మరో 40 పాలిసింగ్ యూనిట్లలో సుమారు 4 వేల మందికిపైగా కార్మికులు ఉపాధి పొందేవారు. వ్యవసాయ రంగంతో పాటు ఎక్కువ మంది కార్మికులకు ఉపాధి కలిగించే గ్రానైట్ పరిశ్రమ ప్రస్తుతం సంక్షోభంలోకి నెట్టబడింది. మారుమూల వెనుకబడిన ప్రాంతంగా ఉన్న శ్రీకాకుళం జిల్లాలో నీలి గ్రానైట్ పరిశ్రమ వల్ల అంతర్జాతీయంగా జిల్లాకు పేరు, ప్రఖ్యాతలు లభించాయి. జిల్లాలో గ్రానైట్ నిక్షేపాలు బౌల్డర్, మట్టితో కూడుకున్న ఉండటం వల్ల మిగతా ప్రాంతాల కంటే అత్యంత తక్కువ రికవరీ శాతంగా ఉంది. దేశంలో లభించే అన్ని కలర్ నైట్ కంటే సామాన్యులకు అందుబాటులో తక్కువ ధరకు అమ్ముడుపోతున్న గ్రానైట్. జిల్లా గ్రానైట్, అంతర్జాతీయ మార్కెట్లో గ్రానైట్ ఎగుమతులు తగ్గిపోవడం, సీనరేజీ ఛార్జీలపై మరో 25 శాతం అదనంగా పెంచడం, డీడ్ రెంటు ఒక హెక్టారుకు 44 వేలు నుంచి లక్షకు పెంచడం, మెరిట్ పేరుతో మరో 2 శాతం పెంచడం వల్ల బాగా వచ్చే లాభాలు తగ్గిపోయి, ఖర్చులు పెరిగాయి. ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో సంక్షోభంలోకి వెళ్తూ, పరిశ్రమలు మూతపడుతున్న పరిస్థితి ఏర్పడింది.

కార్మికులకు దక్కని కనీస వేతనం

గ్రానైట్ కంపెనీలు ప్రారంభం నుంచి కార్మికులకు కనీస వేతనం లేవు. పిఎఫ్, ఇఎస్ఐ వంటి చట్టపరమైన సదుపాయాలు లేవు. ఒకప్పుడు ఒక జాక్ హీమరు డ్రిల్లరుపై నలుగురు కార్మికులు పనిచేస్తే, నేడు ఇద్దరితో పని చేయిస్తున్నారు. పనిభారం పెరిగింది. యూనియన్ పోరాటాలతో భోనస్, గ్రాట్యూటీ పొందే కార్మికుల సంఖ్య తగ్గడంతో ఫుల్ అండ్ ఫైనలు కూడా నోచుకోకుండా ఖాళీ చేతులతో ఇంటికి పంపుతున్నారు. ఉద్యోగ భద్రత, పని భద్రత లేదు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే పరిస్థితి లేదు. కార్మిక చట్టాలను అమలు చేయకుండా కేంద్ర



ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్లు అంటూ సెంట్రల్ లేబర్ అధికారులు తనిఖీలు నిలుపుదల చేశారు. జాయింట్ మీటింగ్‌లు కూడా నిలుపుదల చేశారు. పలు కంపెనీల నుంచి అక్రమంగా కార్మికులను తొలగిస్తుంటే విశాఖపట్నం సెంట్రల్ కార్మిక అధికారులు ఫిర్యాదులు చేస్తున్నా స్పందించలేదు. ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అమలుతో పాటు యాజమాన్య నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా పోరాటాలు చేయడమే మన ముందున్న కర్తవ్యం

– ఎన్.షణ్ముఖరావు,
సిఐటియు నాయకులు

మెనూ ఛార్జీలు పెంచాలి

రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం అమలు చేయడం లేదు. ప్రభుత్వాలు మారినా మెనూ ఛార్జీలు పెంచడం లేదు. పెరిగన ధరలకు అనుగణంగా మెనూ చార్జిలు పెంచాలి. మధ్యాహ్న భోజన కార్మికులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారు. వంట ఏజెన్సీలకు పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీల పెంపుదల చేయాలి.

నెలవారీ సక్రమంగా బిల్లులు, గౌరవ వేతనాలు చెల్లింపులో తీవ్రమైన జాప్యం చేయడంతో అప్పుల పాలైపోతున్నారు. రోజుకి ఆరేడు గంటల పనిచేస్తున్న కార్మికులకు గౌరవ వేతనం పేరుతో శ్రమ దోపిడీ చేస్తున్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా పిల్లవాడికి ఒక్కింటికి రూ.20 రీఛార్జ్ పెంచాలి. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని పోరాడుతున్నాం. కార్మికులకు సామాజిక భద్రత పెన్షన్లు, పనిలో అగ్నిప్రమాదాలకు గురయ్యే బాధితులకు బీమా సౌకర్యం ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. 18 ఏళ్ల నుంచి పనిచేస్తున్న వారికి పనిభద్రత లేదు.

- బి.ఉత్తర,
ప్రధాన కార్యదర్శి,
మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం







కార్మిక హక్కులు కాలరాస్తున్న ప్రభుత్వం

బ్రిటీష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి కార్మికుల ప్రాథమిక హక్కులను హరించేందుకు పూనుకున్న కేంద్రంలో బిజెపి, దానికి వత్తాసు పలుకుతున్న ప్రభుత్వం కార్మిక ద్రోహులుగా మిగిలిపోతారు. ఇందిరాగాంధీ బ్యాంకులు జాతీయం చేస్తే... ప్రధాని మోడీ ప్రభుత్వం ప్రయివేటీకరణ చేస్తుంది. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రయివేటీకరణ చేసి చేసి రిజర్వేషన్లు అమలు కాకుండా కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుంది. అదాని, అంబానీలకు దేశ సంపదను కారు చౌకగా అమ్మి కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తున్నారు. పెన్షన్ పొందడం ఉద్యోగి ప్రాథమిక హక్కు అని సుప్రీంకోర్టు 1982లో తీర్పు ఇచ్చింది. సమాన పనికి సమాన వేతనం అందించాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినా పాలకులు స్పందించకపోవడం విడ్డూరంగా ఉంది. కార్మిక హక్కుల పరిరక్షణకు ఐక్య ఉద్యమలే శరణ్యం.

- అనపాన షణ్ముఖరావు,
ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి

పరిష్కారం కాని విఆర్ఎల సమస్యలు



ప్రభుత్వాలు మారినా విఆర్ఎల తలరాతలు మారడం లేదు. అందరి సమస్యలు పరిష్కరిస్తున్నామంటున్న ప్రకటనలు చేస్తున్న కూటమి ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకపోవడంతో మంచి ప్రభుత్వం ఎలా అవుతుందని ప్రశ్నించారు. అధికారంలో రాగానే పరిష్కరిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 10 నెలల కావస్తున్నప్పటికీ ఇచ్చిన హామీలు ఎలాంటి సానుకూలత కనిపించడం లేదు. తరతరాలుగా విఆర్ఎలు వారసత్వపు హక్కుగా పని చేస్తున్నప్పటికీ తమ తలరాతలు మారలేదన్నారు. తెలంగాణలో టైం స్కేల్, కనీస వేతనాలు, నామినీలను విఆర్ఎలుగా గుర్తించగా ఆంధ్రప్రదేశ్‌లో హామీలే తప్ప అమలుకు నోచుకోలేదు. ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వం ఇచ్చిన హామీలైన కనీస వేతనం రూ.26 వేలు, ఖాళీ పోస్టుల్లో అర్హులైన విఆర్ఎల్‌కు 70శాతం కేటాయింపు చేసి భర్తీ చేయాలి.

- కె.రమణమూర్తి,
విఆర్ఎల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి











కనీస వేతనం కోసం పోరాటం



రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం అమలు చేయడం లేదు. మధ్యాహ్న భోజన మెనూ ఛార్జీలు పెంచకపోవడంతో అదనపు భారం పడుతోంది. మధ్యాహ్న భోజన కార్మికులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారు. నెలవారి సక్రంగా బిల్లులు, గౌరవ వేతనాలు చెల్లింపులో తీవ్రమైన జాప్యం చేయడంతో అప్పుల పాలువుతున్నారు. రోజుకి ఆరేడు గంటల పనిచేస్తున్న కార్మికులకు గౌరవ వేతనం పేరుతో శ్రమ దోపిడీ చేస్తున్నారే తప్ప ఆదుకునే ప్రయత్నం చేయడం లేదు. పెరిగిన ధరలకు అనుగుణంగా పిల్లవాడికి ఒక్కింటికీ రూ.20 రీఛార్జ్ పెంచాలి. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని పోరాటాలు చేస్తున్నాం. కార్మికులకు సామాజిక భద్రత పెన్షన్లు, పనిలో అగ్ని ప్రమాదాలకు గురయ్యే బాధితులకు బీమా సౌకర్యం ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. 18 ఏళ్ల నుంచి పనిచేస్తున్న వారికి పనిభద్రత కల్పించాలి.

- అల్లు మహాలక్ష్మి, జిల్లా గౌరవాధ్యక్షులు, మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం

పోరాట శక్తిగా మహిళలు ఎదగాలి



కార్మికులు, అసంఘటిత రంగంలో ఉన్న మహిళలు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఆశ, అంగన్వాడీ కార్యకర్తలు హక్కులను సాధించుకునేందుకు సమిష్టి పోరాటాలకు ముందు నిలవాలి. పనికి తగ్గవేతనాలు సాధించడంతో పాటు మహిళలకు అవసరమైన ప్రసూతి సెలవులు, ఇతర సౌకర్యాలు సాధించుకోవాలి. మహిళలపై పనిచేసే చోట భౌతిక దాడులు, మానసిక ఒత్తిళ్లు, వేధింపులు జరుగుతున్నాయి. రాజకీయ పార్టీల నుంచి ఒత్తిడికి గురై మానసికంగా కుంగిపోతున్నారు. అటువంటి సమయంలోనే మనోధైర్యాన్ని కోల్పోకుండా ఎదురుతిరిగి పోరాడాల్సిన అవసరం ఉంది. తద్వారా మెరుగైన మహిళా సమాజాన్ని నిర్మించు కోగలం. మేడే స్ఫూర్తితో మహిళలు పోరాటాల వైపు అడుగులు వేయాలి.

- కె.నాగమణి, జిల్లా కన్వీనర్, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ

ప్రజలు కేంద్రంగా పారిశ్రామిక వృద్ధి

కార్పొరేట్ల లాభం కోసం కాదు



జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో శ్రీకాకుళం జిల్లా వెనకబడిపోయిందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వాపోయిన విషయం పత్రికల ద్వారా బయటికి వచ్చింది. అక్కడున్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుని ఎందుకు ఇలా జరుగుతుందని ముఖ్యమంత్రి ప్రశ్నించారట!. జిల్లా వెనుకబడిపోయిందన్న విషయం ఇంతవరకు చంద్రబాబు నాయుడుకి తెలియదా?. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే అట్టడుగు స్థానంలో ఉన్న విషయం పదో తరగతి పాస్ అయిన ప్రతి ఒక్కరికీ తెలుసు. అలాంటిది ముఖ్యమంత్రికి తెలియదనుకోవాలా?. పైగా ఏమీ ఎరగనట్టు కలెక్టర్ కాన్ఫరెన్స్‌లో వ్యవహరించడం ఇదంతా నాటకంగా అనిపించట్లేదు. పోనీ ఇప్పటికైనా గుర్తించడం మంచిదే గానీ జిల్లా అభివృద్ధికి అవసరాలు ఏమిటో ప్రాధాన్యతా క్రమంలో గుర్తించి దానికి నిధులు ఇవ్వడం, బడ్జెట్‌లో కేటాయింపులు చేయడం ఇది కదా కావాల్సింది. ఆ పని చేస్తామని చంద్రబాబు చెప్పి ఉంటే జిల్లా ప్రజలంతా సంతోషించేవారు. కానీ జిల్లా మంత్రి మీదకి బాధ్యత నెట్టేయడంలోనే ఈ అంశానికి చంద్రబాబు ఇచ్చిన ప్రాధాన్యత అర్థమవుతుంది. మంత్రి జిల్లాకు వచ్చి ఇక్కడ జిల్లా పరిషత్ సమావేశంలో చంద్రబాబు తనను కడిగి పారేశారని, జిల్లా వెనకబాటుకు ఇక్కడ ఎర్రజెండాలే కారణమని తనవంతు బాధ్యతను దులిపేసుకున్నారు. ఈమధ్య బుడగట్లపాలెం వచ్చిన చంద్రబాబు, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుని ఈ జిల్లా అభివద్ధి కాకపోతే నీ డిగ్రీ పట్టా వెనక్కి తీసుకుంటానని బెదిరించారు. ఇదంతా జిల్లా ప్రజలను గందరగోళ పరచడానికి కాకపోతే గానీ చంద్రబాబు నాయుడుకి బాధ్యత ఏమీ లేదా?. అమరావతి, పోలవరం గురించి అన్ని సమీక్షలు చేస్తారు. వెనుకబడి శ్రీకాకుళం, రాయలసీమ, ప్రకాశం వీటి గురించి ఎందుకు సమీక్ష చేయరు. 1960లో ప్రారంభించిన వంశధార నేటికీ నత్తనడక నడుస్తోంది. శ్రీకాకుళం జిల్లా ప్రజలకు రైతాంగానికి ఈ ప్రాజెక్టు జీవనాడి. రూ.వెయ్యి కోట్లు ఇస్తే ఎంత ఆధునీకరణతో సహా పూర్తవుతుంది. ఆ పని చేయకుండా ఎవరి మీదకో బాధ్యత నెట్టేస్తే, ఏం ప్రయోజనం. శ్రీకాకుళం జిల్లాకు ఏ పరిశ్రమని తీసుకురారు. ఇక్కడ పెట్టుబడికి ప్రోత్సాహకాలు ఇవ్వరు. ఉత్పాదకపరంగా పరిశ్రమలను నెలకొల్పినట్టైతే జిల్లా ప్రజల అభివృద్ధికి, ఉపాధి కల్పనకు దోహదపడుతుంది. ముడి సరుకులు, ఉత్పత్తులు, వీటి రవాణా, నిల్వ, మార్కెటింగ్ తదితర కార్యకలాపాల్లో వేలాది మంది జిల్లా యువత కొలువులు దీరే పరిస్థితి ఉంటుంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఈ జిల్లాపై ఎంత నిర్దయో గానీ వినాశకరమైన, పర్యావరణానికి హానికరమైన థర్మల్, న్యూక్లియర్ పవర్ ప్లాంట్లను పెడతామని 12 ఏళ్లుగా ఒకదాని వెంట ఒకటి ప్రతిపాదనలు ముందుకు తెస్తున్నారు. జిల్లా ప్రజలు అంతే దూకుడుతో ఆ విద్యుత్ కేంద్రాలని వ్యతిరేకిస్తూ పోరాటాలు చేస్తున్నారు. సోంపేట, కాకరాపల్లి, పోలాకి థర్మల్ విద్యుత్ కేంద్రాల ప్రతిపాదనకు ఏ గతి పట్టిందో మనమందరం చూశాం. ఇప్పుడు తాజాగా సరుబుజ్జిలి మండలం వెన్నెలవలసలో థర్మల్ పవర్ ప్లాంట్ పెడతామన్నారు. అదానీ సరుకు రవాణాకు ఉపయోగపడే కార్గో ఎయిర్‌పోర్టును మందస మండలంలో ఏర్పాటు చేస్తామన్నారు. అదానీకే మూలపేటలో పోర్టు నిర్మాణానికి భూములు కట్టబెట్టారు. ఇదంతా జిల్లా అభివృద్ధికేనని నమ్మబలుకుతున్నారు. ఇందులో వాస్తవం లేదు. పెట్టుబడుదారుల ప్రయోజనాలే పరమావధిగా ఈ పనులన్నీ జరుగుతున్నాయి. ఉపాధి కల్పన అంతా కాంట్రాక్టుమయం, అసంఘటితమయం. ఒకవైపు కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లు పెట్టి కార్మిక హక్కులను కాలరాస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం అదే దారిలో పయనిస్తోంది. కనీస వేతనాలు 15 ఏళ్లుగా సవరించనే లేదు. కార్మిక శాఖ అధికారులు కార్మిక హక్కుల అమలు తనిఖీ చేయరు. యజమానులు ఇష్టారాజ్యంగా దోపిడీకి పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా రాబోయే ఉపాధి నాణ్యత ఎలా ఉంటుందో ఊహించవచ్చు. అన్నీ కాంట్రాక్టు ఉద్యోగాలే, అరకొర జీతాలే. పెట్టుబడిదారుల దోపిడీకి పట్టపగ్గాల్లేని పరిస్థితి ఉండబోతోంది. చంద్రబాబు జిల్లా వెనకబాటుతనంపై కార్చేదంతా మొసలి కన్నీరేనా, జిల్లా అభివృద్ధి అంటే ప్రజల జీవితాల్లో అభివృద్ధి కాదా?, పెట్టుబడుదారుల అభివృద్ధేనా?. సహకార రంగంలో ఒక వెలుగు వెలిగిన ఆమదాలవలస చక్కెర కర్మాగారం పునరుద్ధరించడం ఈ జిల్లా అభివృద్ధికి దోహదపడే అంశం. ఆ పని ఎందుకు చేయరు?. భావనపాడు ఫిషింగ్ హార్బరు మూలపేట ప్రాంత ప్రజల చిరకాల వాంఛే కాక తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధినేత ఎన్.టి రామారావు వాగ్దానం కూడా. దాన్ని ఎందుకు నెరవేర్చరు. అదానీకి పోర్టును ఎందుకు బంగారు పళ్లెంలో పెట్టి ఇస్తున్నారు?. జీడి పరిశోధనా బోర్డును ఎందుకు ఏర్పాటు చేయరు?. అదే విధంగా కొబ్బరికి కూడా. ఈ చర్యలు చేపడితే జిల్లా ప్రజల్లో విశ్వాసం కలుగుతుంది. అభివృద్ధిపై మక్కువ పెరుగుతుంది. అందుకు భూములు ఇచ్చి సహకరిస్తారు. ఈ జిల్లా ప్రజలకు థర్మల్, న్యూక్లియర్ పవర్ ప్లాంట్లు ఇక్కడ స్థాపించడం ఎంతమాత్రం ఇష్టం లేదు. ప్రజలు వద్దన్న వాటిని బలవంతంగా రుద్దడం, ప్రజలు కోరుకున్న అభివృద్ధినికాదనడం పాలకుల ఒరవడిగా ఉంది. తాము చెప్పిందే అభివృద్ధి అని, కాదన్న వారు అభివృద్ధి నిరోధకులు అని ముద్ర వేయడం అప్రజాస్వామికం. ఈ వైఖరిని విడనాడి ప్రజానుకూల దృక్పథంతో ముందుకెళ్లినప్పుడే శ్రీకాకుళం జిల్లా అభివృద్ధి చెందుతుంది.

- కె.శ్రీనివాసు
సిఐటియు సీనియర్ నాయకులు

వెలవెలబోతున్న పారిశ్రామికవాడ

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణ శివారులో ఉన్న పారిశ్రామిక వాడ గతంలో ఒక వెలుగు వెలిగి పలువురికి ఉపాధి కల్పించి ఎంతో ఘనంగా కళకళలాడుతూ ఉండేది. నేడు పరిశ్రమలు అనుకున్న స్థాయిలో లేక కార్మికులకు ఉపాధి లేక అధ్వానంగా తయారైంది. రాజకీయ నాయకులు ఊదరగొట్టే ఉపన్యాసాలు తప్ప పారిశ్రామికవాడను పట్టించుకున్న పాపాన పోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. కృషి విజ్ఞాన కేంద్రం ఎదురుగా పాలకొండ-శ్రీకాకుళం మెయిన్ రోడ్డు పక్కన 1972లో అప్పటి పార్లమెంట్ సభ్యులు బొడ్డేపల్లి రాజగోపాలరావు 19.52 ఎకరాల విస్తీర్ణంలో 36 ప్లాట్లతో పారిశ్రామిక వాడను ఏర్పాటు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో మొట్టమొదటి పారిశ్రామిక వాడ ఇదే కావడం విశేషం. బొడ్డేపల్లి రాజగోపాలరావుకు బర్త్ డే గిఫ్ట్‌గా అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ఇచ్చారని ఇప్పటికీ పలువురు గుర్తు చేసుకుంటారు. తొలినాళ్లలో పారిశ్రామిక వాడలో సినిమా కార్బన్స్, మేకులు, చింత పిక్కల పౌడర్, నవాటేపు, స్టెయిన్లెస్ స్టీల్, అల్యూమినియం ఫ్యాక్టరీ, గన్ని బ్యాగ్స్, బట్టల సబ్బులు తదితర పరిశ్రమలతో కలకలలాడుతూ కార్మికులకు ఉపాధి కల్పిస్తూ ఉండేది. తదనంతరం 1983లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిశ్రమలు మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ ప్రోత్సాహం లేక కనుమరుగయ్యాయి. 2009లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హయాంలో అనుకున్న స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించలేకపోవడంతో ఆర్థిక సంక్షోభంతో పరిశ్రమలు మూతపడ్డాయి. 2019లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ అప్పటి శాసనసభ్యుడు కూన రవికుమార్ చొరవతో రూ.1.50 కోట్లు నిధులను మంజూరు చేయించి రోడ్లు, డ్రెయినేజీ తదితర మౌలిక సదుపాయాలను కల్పించి పరిశ్రమల పురోభివృద్ధికి ఊతమిచ్చారు. గతంలో ఉన్న 36 ప్లాట్లను 48 ప్లాట్లుగా అభివృద్ధి చేయడానికి నిర్ణయించారు. అలాగే రూ.2 కోట్లతో విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి అందుబాటులోకి తీసుకొచ్చారు. అక్కడ నుంచి పరిశ్రమలు విద్యుత్ ఇబ్బందులకు గురికాకుండా ముందుకు వెళ్లసాగాయి. తొలినాళ్లలో ఎపిఐఐసితో ఒప్పందం చేసుకున్న వ్యక్తులు అప్పట్లో పరిశ్రమల స్థాపించి ఆ తర్వాత కాలంలో ఆర్థిక ఇబ్బందులకు గురై మూతపడ్డాయి. ప్రస్తుతం ఇక్కడ పరిశ్రమలు నిర్వహిస్తున్న వ్యక్తులు రెండో పార్టీ వారు కావడం విశేషం. ప్రస్తుతం పారిశ్రామిక వాడలో వుడ్ వర్క్స్,



పారిశ్రామికవాడలోని ప్లాస్టిక్ బాటిల్స్ ఫ్యాక్టరీ

వాటర్ ప్లాంట్లు, విత్తనాల తయారీ కేంద్రం, ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్, అల్యూమినియం ఫ్యాక్టరీ తదితర పరిశ్రమలు కొనసాగు తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ఎక్కువ మందికి ఉపాధి కల్పించే పరిశ్రమలు వచ్చేలా కృషి చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని పలువురు ముక్తకంఠంతో కోరుతున్నారు.




ప్లాస్టిక్ రీసైకిల్ ఫ్యాక్టరీ



మూతపడిన పరిశ్రమ

ప్రభుత్వ ప్రోత్సాహం కరువు



మౌలిక సదుపాయాలు ప్రభుత్వ ప్రోత్సాహం కరువై పరిశ్రమల పురోగతి కుంటుపడింది. ప్రభుత్వం మౌలిక సదుపాయాలను కల్పించి పరిశ్రమలను ఆదుకొని ప్రోత్సహిస్తే యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించవచ్చు. అలాగే విద్యుత్, పన్నులు తదితర రాయితీలను కల్పించి పరిశ్రమల పురోగతికి ఊతమిచ్చినప్పుడే అభివృద్ధి పథంలో దూసుకెళ్తాంది.

- తాళ్లూరి రాంబాబు,
ఇండస్ట్రియల్ లోకల్ అథారిటీ మాజీ చైర్మన్

ఉద్దానం కళ తప్పుతోందా?

- గణనీయంగా తగ్గిన కొబ్బరి దిగుబడులు
- పెరిగిన వలసలు
- తరిగిన ఉపాధి



కొబ్బరిని ఒలుస్తున్న కార్మికులు



కొబ్బరి గ్రేడింగ్ చేస్తున్న మహిళ

ప్రశాంతమైన వాతావరణం, ఎటుచూసినా పచ్చని కొబ్బరి చెట్లతో అలరారే ఉద్దానం (ఉద్యానవనం) నేడు కళ తప్పుతోందా? చుట్టుముడుతున్న చీడపీడలతో ఇంటికి పెద్ద కొడుకుగా రైతన్నలు భావించే కొబ్బరి కుదేలైందా? ప్రకృతి విపత్తులకు తోడు గ్యానోడెర్మా, తెల్లదోమ కొబ్బరిని కనుమరుగు చేస్తున్నాయా? అంటే అవుననే సమాధానమే వినిపిస్తోంది. ముఖ్యంగా వ్యాధుల నివారణకు సామూహిక చర్యలు చేపట్టలేక, వ్యక్తిగత బాధ్యత తీసుకునే ఆర్థికస్థోమత లేక సతమతమవుతున్నాడు కొబ్బరి రైతు. దీంతో తాతల, తండ్రుల నుంచి వంశపారంపర్యంగా వస్తున్న వ్యవసాయాన్ని భవిష్యత్ తరాలకు అందించలేనేమో అన్న సందేహంతో ఉద్దానం రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.


ప్రజాశక్తి- కవిటి

గతంలో ఒక రైతు కొబ్బరికాయలు దింపు చేస్తే కొబ్బరికాయలు తీసే శ్రామికుల నుంచి కొబ్బరికాయలు మోసే మహిళా కార్మికులు ట్రాక్టర్ యజమాని ఒలుపు కార్మికులు కొబ్బరి డొక్కతో పీచు తయారు చేసే కార్మికులు చివరికి రైతు దగ్గర కొబ్బరికాయలు కొనుగోలు చేసే దళారీ వరకు ప్రతి ఒక్కరు ఉపాధి పొందేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి చేయి దాటింది. గతంలో రెండు నెలలకు ఒకసారి కొబ్బరి కాయల దింపు జరిగితే ప్రస్తుతం అది మూడు నుంచి ఐదు నెలలకు చేరుకుంది. కొన్ని ప్రాంతాల్లో ఏడాదికి కేవలం రెండు దింపులు మాత్రమే చేస్తున్న పరిస్థితి కూడా కనిపిస్తోంది. అది కూడా చేయక తప్పదనే స్థితిలో కొంతమంది రైతులు కాయల దింపులు చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో స్థానికంగా ఉపాధి లేకపోవడంతో చాలామంది వలస బాట పట్టారు.

తగ్గిన దిగుబడులు

తీవ్ర వర్షాభావ పరిస్థితులకు తోడు చుట్టుముడుతున్న చీడపీడలతో గత రెండేళ్లగా కొబ్బరి దిగుబడి గణనీయంగా పడిపోవడంతో దీనిపై ఆధారపడిన కొన్ని వేల కుటుంబాలు ఆర్థిక సమస్యల్లో కూరుకుపోయాయి. పదెకరాలు ఉన్న రైతు గతంలో రెండు నెలలకు 6 నుంచి 8 వేల కొబ్బరి కాయ దిగుబడి చేస్తే ప్రస్తుతం రెండు నుంచి మూడు వేల కాయల దిగుబడి వస్తోంది. చాలా ప్రాంతాల్లో అది కూడా రావడం లేదు. ఈ తెల్లదోమ ప్రభావంతో గత రెండేళ్లుగా జీడి మామిడి పంటలు దిగుబడి కూడా ఉద్దానం ప్రాంతంలో పూర్తిగా పడిపోయాయి. అరటి పనస పంటలది అదే పరిస్థితి. దీంతో చిన్నారుల చదువుతో పాటు ఆడపిల్లల పెళ్లిళ్లు చేయాలన్న ప్రస్తుతం రైతన్నలు హడలిపోతు న్నారు. దీంతో మేడిపండు చందంగా ఉద్దానం రైతుల పరిస్థితి తయారయింది.

ఉసురు తీసిన తెల్లదోమ



తెల్లదోమ ఆశించిన కొబ్బరి

ఉద్దానం కొబ్బరి రైతుల పాలిట తెల్లదోమ శాపంలా మారింది. గత కొద్ది సంవత్సరాల కిందట ఈ ప్రాంతానికి ఆశించిన తెల్లదోమ ప్రస్తుతం తీవ్ర రూపం దాల్చింది. దీంతో కొబ్బరి కమ్మ నుంచి పింది వరకు మొత్తం పీల్చేసి వాటి ఆకారాన్ని మార్చేస్తోంది. అంతేకాకుండా దీని నుంచి రాలుతున్న నల్లటి పిండి పదార్థం జీడి, మామిడి, అరటి చెట్లను కప్పేసి వాటి దిగుబడి, మనుగడపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది.

వెరసి అరటి పంట గణనీయంగా తగ్గిపోవడమే కాకుండా గత రెండేళ్లుగా జీడిపంటపై తీవ్రమైన ప్రభావం చూపించింది. మరోవైపు నుంచి గ్యానోడెర్మా తెగులు ఆశించి చాలావరకు కొబ్బరి తోటలు కనుమరుగవుతున్నాయి. దీంతో కొబ్బరినే నమ్ముకున్న రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది.

బతుకు భారమవుతోంది



వారసత్వంగా నాకు సంక్రమించిన రెండు ఎకరాల కొబ్బరితోట సాగు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. గతంలో ఈ రెండు ఎకరాల్లో నాకు మూడు వేల కొబ్బరికాయలు దిగుబడి వచ్చేది. నా తోటలో వర్మీకంపోస్టు, పశువుల పెంట, పచ్చిరొట్ట వాడడమే కాకుండా నిరంతరం నీరు కూడా అందించడంతో మెరుగైన దిగుబడి వచ్చేది. అయితే తిత్లీ తుపాను తర్వాత పరిస్థితి మారిపోయింది. కొబ్బరిని తెల్లదోమ అతలాకుతలం చేస్తోంది. దీంతో ప్రస్తుతం 800 నుంచి వెయ్యి కాయలు రావడం కూడా కష్టంగా మారింది. దీంతో కుటుంబ పోషణ కష్టమవుతోంది. ప్రస్తుతం మాలాంటి రైతుల పరిస్థితి దుర్భరంగా మారింది. చివరికి అప్పు చేసి కుటుంబాన్ని పోషించుకోవలసిన పరిస్థితి ఏర్పడుతోంది.

- పులకల కూర్మారావు, కొబ్బరి రైతు, జగతి

ఉపాధి కోల్పోయాం



గతంలో ఒక వ్యక్తి రోజుకు 800 నుంచి వెయ్యి కాయలు ఒలుపు చేసే వాళ్లం. ప్రస్తుతం ఒలుపు చేసేందుకు కాయలు కరువయ్యాయి. ఎంతో కష్టం మీద వారానికి ఒకటి రెండు రోజులు పని దొరుకుతోంది. అదీ ఒకరికి 200 నుంచి 300 కాయలు ఒలిచే అవకాశం లభిస్తోంది. దీంతో మాలో చాలామంది కార్మికులు వలస వెళ్లిపోయారు.

- తిరుపతి బెహరా, ఒలుపు కార్మికుడు, కవిటి

రైతుల్లో చైతన్యం అవసరం



ఉద్దానం ప్రాంతంలో కొబ్బరి అభివృద్ధికి ఆర్అండ్ఆర్ పథకం అమలు చేస్తున్నాం. ఈ పథకం ముఖ్య ఉద్దేశం పురుగు ఆశించిన, పాడైన కొబ్బరి చెట్లు తొలగించి వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటి కొబ్బరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. అయితే ఇటీవల కాలంలో కొబ్బరి పంటకు తెల్లదోమ, గ్యానోడెర్మా తీవ్రమైన విఘాతం కలిగిస్తున్నాయి. దీనికి రైతులందరూ సామూహికంగా ఏకమై చర్యలు తీసుకోవాలి. వీటి నివారణకు రైతులందరూ ఏకమై తమ తమ తోటల్లో బదనికలు విడిచిపెట్టడం, జిగురు అట్టలు అంటించడం, ట్రైకోడెర్మా విరిడి వాడడం, ముఖ్యంగా తోటల్లో పచ్చిరొట్ట మొక్కలు విరివిగా పెంచి కలియదున్నడం వంటి చర్యల ద్వారా చాలావరకు వీటిని నివారించవచ్చు. దీని కోసం గ్రామాల్లో అవగాహనా సదస్సులు కూడా నిర్వహిస్తూ రైతుల్లో చైతన్యం కలిగిస్తున్నాం.

- పోలాకి మాధవీలత, ఉద్యాన శాఖ అధికారి, కవిటి

కార్మికుల ఆకలికేకలు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

వందలాది మంది కార్మికులకు ఉపాధి కల్పించే పరిశ్రమ మూతపడడంతో కార్మికులు రోడ్డున పడ్డారు. పరిశ్రమనే నమ్ముకుని జీవనం సాగిస్తున్న కార్మిక కుటుంబాలు అర్ధాకలితో జీవితాలను సాగిస్తున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డితో సహా మంత్రులు, నాయకులు కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేరకపోవడంతో జీవనోపాధి లేక కార్మికులు ఎదురు చూస్తున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. వివరాల్లోకి వెళ్తే... టెక్కలి మండలం రావివలసలోని ఫెర్రో ఎల్లాయీస్ పరిశ్రమ గత టిడిపి ప్రభుత్వ హయాంలో లాక్ అవుట్ అయ్యింది. మాజీ ముఖ్యమంత్రి జగన్ చేపట్టిన పాదయాత్ర సమయంలో అటుగా వచ్చిన సందర్భంగా కార్మికులు పరిశ్రమను తెరిపించాలని వినతిపత్రం 'ఫెర్రో ఎల్లాయీస్' కార్మికుల ఆకలి కేకలు అందించారు. అయితే అధికారంలోకి వచ్చిన వెంటనే పరిశ్రమను తెరిపించి స్థానికులకు ఉపాధి కల్పిస్తామని ప్రతిపక్ష నేత హోదాలో జగన్ కార్మికులకు హామీనిచ్చారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన రెండేళ్ల అనంతరం పరిశ్రమ తెరిచారు. పరిశ్రమతెరుచుకున్న కొద్ది రోజులు నుంచి ఇక్కడ వివాదాలు మొదలయ్యాయి. పరిశ్రమలో గతంలో పని చేసిన రెగ్యులర్ కార్మికులకు రావాల్సిన బకాయిలు, ఇతర ఆర్థికపరమైన అంశాలపై అదేవిధంగా స్థానికులను పరిశ్రమలో ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ధర్నాలు, నిరసనలు చేశారు. కొన్ని నాటకీయ పరిణామాల నేపథ్యంలో కొద్ది నెలల పాటు పరిశ్రమను ఒక సంస్థ నడిపింది. అయినా యాజమామ్యం పట్టించుకోలేదు. దీంతో పరిశ్రమలో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్టు, రోజుకూలీలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పరిశ్రమలో ఉపాధి కల్పన, బకాయిలు, వేతనాలు ఇతర అంశాలపై పలుమార్లు వివిధ శాఖల అధికారులు, పరిశ్రమ యాజమాన్యం, కార్మిక సంఘ నాయకులతో చర్చించారు. అయితే ఇలా జరుగుతున్న నేపథ్యంలో గతేడాది ఫిబ్రవరిలో పరిశ్రమకు ఉన్న ఫలంగా యాజమాన్యం లాకెట్ నోటీసులు అతికించి, ప్రొడక్షన్ తయారీను నిలుపుదల చేసింది. దీంతో కార్మికుల సమస్యల మళ్లీ మొదటికి వచ్చింది. ఎనిమిదేళ్ల నిరీక్షణ అనంతరం తెరుచుకున్న పరిశ్రమ ఏడాదిన్నర కాలంలోనే మళ్లీ మూతబడడంతో కార్మికులు ఉపాధికి దూరమయ్యారు. పరిశ్రమను మరలా తెరిపించి కార్మికులకు, స్థానికులకు ఉపాధి కల్పించాలని పలువురు కోరుతున్నారు. టెక్కలి నియోజకవర్గం ప్రాతినిధ్యం వహించిన కింజరాపు అచ్చెన్నాయుడు కార్మికశాఖ మంత్రి ఉన్నప్పుడే మూతపడడం శోచనీయం. జిఎంఆర్ నిర్మాణం చేపట్టిన ఈ పరిశ్రమ కొంతమంది కార్పొరేట్ కంపెనీలకు లీజులు ఇచ్చి మూతపడేటట్లు చేస్తున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు.



రావివలసలో మూతపడిన ఫెర్రో ఎల్లాయీస్ పరిశ్రమ

కార్మికులు వేతనాలు చెల్లించకుండా మూత

వేయడం దారుణమని కార్మికుడు పిట్ట గంగయ్య అవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు తెలియజేయకుండా రాత్రికి రాత్రే పరిశ్రమకు తాళాలు వేశారు. 80 మంది రెగ్యులర్, 300 కాంట్రాక్టు కార్మికులకు రూ.9 కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. ప్రజాప్రతినిధులు ఈ పరిశ్రమపై దృష్టి సారించి కార్మికులు అందుకోవాలని కోరారు.



అంగన్వాడీలను ఉద్యోగులుగా గుర్తించాలి

అంగన్వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి. ఫేస్‌యాప్, పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలి. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి. అంగన్వాడీలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి. కేంద్రాలకు విద్యుత్ బిల్లులు సైతం కార్యకర్తలే చెల్లించాల్సి వస్తోంది. ఐదేళ్లుగా టిఎ, డిఎలు చెల్లించడం లేదు. గ్యాస్ ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. దీనికి తోడు అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా సచివాలయాల పర్యవేక్షణకు ఆదేశించింది. ఇప్పటికే ఐసిడిఎస్ అధికారులు పీడీ, సిడిపిఒ, సూపర్‌వైజర్లు పర్యవేక్షిస్తున్నారు. ప్రభుత్వం మారినప్పుడల్లా రాజకీయ వేధింపులు మొదలవుతున్నాయి. కేంద్రాలు బలోపేతం చేసేందుకు నిధులు పెంచి అంగన్వాడీలకు ఉద్యోగభద్రత కల్పించాలి. హక్కుల సాధనకు పోరాటాలే శరణ్యం. మేడే స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలి.

- డి.సుధ, ప్రధాన కార్యదర్శి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

కార్మిక హక్కుల పరిరక్షణే లక్ష్యం



కార్మిక, ఉద్యోగుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా భవిష్యత్ పోరాటాలు కొనసాగిస్తాం. జిల్లాలో జ్యూట్, ఫెర్రో ఎల్లాయిస్ వంటి పరిశ్రమలు మూతపడి కార్మికులు రోడ్డున పడినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. జిల్లాలో మూతపడిన జ్యూట్ పరిశ్రమలను తెరిపించేందుకు వాటికి అవసరమైన రాయితీలను కల్పించడం లేదు. ఆమదాలవలస సహకార చక్కెర ఫ్యాక్టరీని తెరిపిస్తామని ఎన్నికల ముందు హామీలు ఇచ్చి... గెలిచిన తర్వాత పట్టించుకోవడం లేదు. దీనివల్ల వేలాదిమంది కార్మికులకు ఉపాధి లేకుండాపోతోంది. కేంద్ర ప్రభుత్వ స్కీముల్లో పనిచేస్తున్న మహిళా కార్మికులకు కనీస వేతనాలు, పని గంటలు అమలు చేయాలి. ప్రభుత్వ శాఖల్లో సేవలందిస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు రెగ్యులర్ చేయకుండా వెట్టి చాకిరీ చేయిస్తున్నారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేటు అనుకూల, కార్మిక వ్యతిరేక నిర్ణయాలను తిప్పి కొట్టాలి. మేడే స్ఫూర్తితో హక్కులను పరిరక్షించుకునేందుకు పోరాటాల వైపు అడుగులు వేయాలి.

- మామిడి క్రాంతి, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు

కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం



పారిశుధ్య కార్మికులు నిరంతరాయంగా చెత్తతోనే సహవాసం చేస్తున్నారు. వారికి ఎంత ఇచ్చినా తక్కువే అని ఎన్నికల ముందు చెప్పిన వారే ముఖ్యమంత్రి పదవిలోకి వచ్చిన తర్వాత వారి శ్రమను గుర్తించడం లేదు. వారికి అనేక సమస్యలున్నా పట్టించుకునేవారు కరవయ్యారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వందల సంఖ్యలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలను అమలు చేయడం లేదు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులను రెగ్యులర్ చేస్తామని నమ్మించి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోవడం లేదు. గత ప్రభుత్వంలో సమ్మె సమయంలో జరిగిన ఒప్పందాలను సైతం అమలు చేయడం లేదు. ప్రభుత్వం మారినా అధికారులు వాటిని అమలు చేయాలి. కార్మికులకు పని సమయంలో ఇవ్వాల్సిన సౌకర్యాలను పక్కన పెట్టేశారు. నెలల తరబడి వేతనాలు చెల్లించక పోవడంతో కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. సమాన పనికి సమాన వేతనం అన్నది కూడా అమలు చేయడం చేయడం లేదు. దీనిపై ఆలోచించాలి. అలాగే కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ రూ.వేల కోట్లు రుణమాఫీ చేసి కార్మికులు, కాంట్రాక్టు ఉద్యోగులపై మాత్రం భారం మోపుతోంది. అసంఘటిత రంగ కార్మికులు ఉపాధి లేదు. ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ కార్పొరేటు కంపెనీలకు కారు చౌకగా అమ్మేస్తున్నారు. కార్మికుల శ్రమకు తగిన ప్రతిఫలం లభించడం లేదు.

- సిహెచ్.అమ్మన్నాయుడు, సిఐటియు జిల్లా అధ్యక్షులు

హక్కుల పరిరక్షణకు పోరాటాలు తప్పనిసరి



కార్మిక, ఉద్యోగుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా భవిష్యత్ పోరాటాలు కొనసాగించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే ఉద్యోగ, ఉపాధ్యాయులపై ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరి నష్టదాయకంగా ఉంది. గడచిన ప్రభుత్వ వైఖరే నేటి ప్రభుత్వం అనుసరిస్తోంది. ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయసమ్మతమైన కోర్కెలు పరిష్కరించడం లేదు. ఆర్థిక బకాయిల సమస్యలు పరిష్కరించడం లేదు. 12వ పిఆర్‌సి అమలు కోసం కమిటీని కూడా ఇంత వరకు నియమించలేదు. డిఎ బకాయిల ఊసే లేదు. మరో వైపు సిపిఎస్ విధానాన్ని అమలు చేస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఉద్యోగ విరమణ తర్వాత జీవనభృతి లేకుండా చేశారు. ఇలాంటి తరుణంలో ఉద్యమాలే శరణ్యం. మేడే ఉద్యమాలకు దిక్సూచి కావాలి.

- బమ్మిడి శ్రీరామ్మూర్తి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

కార్మికుల త్యాగాలను గుర్తించాలి



కార్మికుల త్యాగాల నుంచి పుట్టిన దినం 'మేడే'. ప్రపంచ కార్మిక దినోత్సవం రోజున కార్మికుల త్యాగాల గుర్తించుకోవాల్సిన అవసరం ఉంది. ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక సంఘాల హక్కులు రోజురోజుకూ కాలచక్రంలో కలిసిపోతున్నాయి. కార్పొరేట్ సంస్థల హవాతో చాలావరకు ప్రభుత్వ సంస్థలు ప్రయివేటీకరణకు దారితీస్తున్నాయి. అది విద్య, వైద్య, రైల్వే ఏదైనా కావచ్చు. ఇలా అనేక సంస్థల్లో ఉద్యోగాల భర్తీ కూడా అవుట్ సోర్సింగ్ ద్వారానే నిర్వహించడం దీనికి నిదర్శనం. ఇప్పటికే ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక సంఘాలు అనేక సమస్యలను పరిష్కరించాలని ఉద్యమిస్తున్నా... ప్రభుత్వాలు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఉన్న హక్కులను కాలరాస్తున్నారు. కార్మికులకు కల్పించిన హక్కులు చట్టాల ద్వారా వారికి న్యాయం జరిగినప్పుడే మేడే అనే పదానికి ఒక అర్థం...ఒక పరమార్థం ఉంటుంది.

- హనుమంతు సాయిరాం, జిల్లా అధ్యక్షులు, ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్

పనుల్లేక అల్లాడుతున్న క్వారీ కార్మికులు

- దుర్భరంగా మారిన జీవన స్థితిగతులు
- వలసబాట పడుతున్న వైనం

ప్రజాశక్తి- పొందూరు

వర్షాధామే ఆధారంగా ఉన్న ఆ మెట్ట ప్రాంత భూముల్లో సాగుకు అవసరమైన పెట్టుబడులూ వచ్చేవి కావు. దీంతో ఆ కుటుంబాలు జీవనోపాధి లేక తప్పనిసరి పరిస్థితుల్లో కొన్ని దశాబ్దాల క్రితం పొట్టకూటి కోసం విజయవాడ, గుంటూరు, రాజమండ్రి వంటి దూర ప్రాంతాలకు వలస పోయేవారు. కొంత కాలానికి తమ గ్రామాలకు సమీపంలోనే రోడ్డు మెటల్ క్వారీలు, స్టోన్ క్రషర్లు ఏర్పడి ఉపాధి లభించడంతో వలసపోయినవారంతా తిరిగి తమ కుటుంబాలతో సహా సొంత గ్రామాలకు చేరుకుని కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాలక్రమేణా భారీ ఆధునిక యంత్రాలు, ఇతరత్రా పరికరాల వినియోగం క్రమేపీ పెరగడం, క్వారీ నిర్వాహణలో యాజమాన్యం, ప్రభుత్వ విధానాలతో కొన్ని నెలలుగా పనులు సక్రమంగా జరగకపోవడంతో మరలా ఉపాధిని కోల్పోయిన పరిస్థితులు నెలకొనడంతో పూర్వ పరిస్థితి ఏర్పడింది. దీంతో పనులు లేక కుటుంబాల పోషణ దుర్భరంగా మారడంతో పనికోసం సమీప పట్టణ ప్రాంతాలకు పరుగులు పెడుతున్నారు క్వారీ కార్మికులు. ఇది పొందూరు మండలంలోని పలు గ్రామాల క్వారీ కార్మికుల దుస్థితి.

జిల్లాలోనే పొందూరు మండలం నల్లరాయి క్వారీలకు ఎంతో ప్రసిద్ధి. ఇక్కడ క్వారీల్లో లభించే నల్లరాయిని ఇళ్ల నిర్మాణాలకు, రోడ్డు నిర్మాణ పనులకు ఎక్కువుగా వినియోగిస్తుంటారు. అందుకే జిల్లాలోని చాలా ప్రాంతాల


క్వారీ పనుల్లో నిమగ్నమైన కార్మికులు

వారు ప్రత్యేకించి ఇక్కడి రాయిని తీసుకువెళ్లి వినియోగించేందుకు ఇష్టపడతారు. దీంతో ఈ ప్రాంతంలో వేలాది మందికి క్వారీ పనులు ఉపాధిగా ఏర్పడింది. మండలంలోని సుమారు 20 గ్రామాల ప్రజలు ఈ పనుల్లో నిత్యం నిమగ్నమై ఉంటారు. ప్రధానంగా మండలంలోని రాపాక, కృష్ణాపురం, వావిలపల్లిపేట, వి.ఆర్.గూడెం, కోటిపల్లి, ఇల్లయ్యగారిపేట, దల్లవలస, కొంచాడ, పొందూరు, లయిదాం, మలకాం, తండ్యాం, పుల్లాజీపేట, బాణాం, తాణెం, లక్ష్మీపేట, లోలుగు, బురిడికంచరాం, నరసాపురం, నందివాడతో పాటు జి.సిగడాం మండలంలోని వాండ్రంగి, ఆనందపుర అగ్రహారం, తదితర గ్రామాలకు చెందిన వేలాది మంది కార్మికులకు ఇది జీవనోపాధిగా మారింది.

మూడు, నాలుగు నెలలే పనులు

మండలంలో ప్రధానంగా రాపాక, కృష్ణాపురం వద్ద క్వారీలు ఎక్కువుగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో జరిగే క్వారీ పనుల్లోను, వాటి అనుబంధ పనుల్లో వేలాది మంది కార్మికులు పనిచేస్తుంటారు. ఏడాదిలో వర్షాకాలంలోను, అలాగే క్వారీ నిర్వాహకుల్లో తగాదాలు, ప్రమాద సంఘటనలు, అనాధికార క్వారీ నిర్వాహణ వంటి సమయాల్లో పనులు జరగవు. ఏడాదిలో కేవలం మూడు, నాలుగు నెలలు మాత్రమే గట్టిగా పనులు జరుగుతుంటాయి. ఈ కొద్ది సమయాల్లో జరిగే పనులతో వచ్చే ఆదాయంతోనే కార్మికులు తమ పిల్లలను చదివించుకుంటూ, కుటుంబాలను పోషించుకుంటుంటారు. రెండేళ్లుగా పనులు సక్రమంగా జరగకపోవడంతో కార్మికులు అల్లాడిపోతున్నారు.

పనుల కోసం పట్టణ ప్రాంతాలకు



పనుల కోసం పట్టణ ప్రాంతాలకు వెళ్తున్నాం. ప్రతిరోజు గ్రామం నుంచి వందలాది మంది కార్మికులు ఆటోలతో తాపీపనుల కోసం పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. స్థానికంగా పనులు లేకపోవడంతో రవాణా చార్జీలకే ఎక్కువ మొత్తంలో వెచ్చించాల్సి వస్తుంది. క్వారీ యామాజన్యం కూడా పనులు కల్పనపై దృష్టిసారించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.

- కె.ప్రభాకర్, రాపాక, కార్మికుడు

పనుల్లేక ఇబ్బందులు పడుతున్నాం



క్వారీ పనులు లేకుండా పోతున్నాయి. గతంలో ఏడాది మొత్తం క్వారీ పనులతో గడిపేవాళ్లం. ఇప్పుడు ఏడాదికి మూడు నెలల కూడా పనులు దొరకడం లేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గ్రామంలో చాలా మంది పట్టణ ప్రాంతాలకు ఆటోలతో ప్రతి రోజు పనుల కోసం వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. క్వారీ పనులు లేక కుటుంబ పోషణ భారంగా మారింది.

- కొంచాడ రాము, రాపాక, కార్మికుడు

యాంత్రీకరణతో కోల్పోయిన ఉపాధి

ఈ ప్రాంతంలో క్వారీ నిర్వాహకులు, యాజమాన్యం తమ స్వలాభం కోసం ఆలోచిస్తున్నారే తప్ప కార్మికులకు పనులను కల్పించడంలో ఏమాత్రం ఆసక్తి కనబరచడం లేదంటూ వారంతా ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. క్వారీ నిర్వాహణ పనుల్లో ఇటీవల యంత్రాల వాడకం యాజమాన్యం విపరీతంగా పెంచడంతో తమకు ఉపాధి లేకుండా పోయింది. దీంతో కుటుంబ పోషణ దుర్భరంగా మారిందంటూ కార్మికులు వాపోతున్నారు. ఇటువంటి తప్పనిసరి పరిస్థితుల్లో సమీప పట్టణ ప్రాంతాలలో జరుగుతున్న భవన నిర్మాణ పనుల్లో పనిచేసేందుకు వలసపోతున్నారు. ఉదయాన్నే ఆటోలతోను, ద్విచక్ర వాహనాలతోను పనుల కోసం పట్టణ ప్రాంతాలకు తరలిపోతున్నారు. దీనిపై అధికారులు దృష్టిని సారించి క్వారీ కార్మికులకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలంటూ వారంతా కోరుతున్నారు.


రాపాక వద్ద ప్రమాదకరంగా కొండపై పనులు చేపడుతున్న కార్మికులు


దూర ప్రాంతాలకు ఆటోలో వెళ్తున్న మహిళా కార్మికులు (ఫైల్)

సంపన్నుల దయాదాక్షిణ్యాలపై పేదరిక నిర్మూలనా!

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం, విప్లవాత్మకం, ఆదర్శం అని చెప్తున్న పి4 అంటే 'పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్'. ఇంకా 'సున్నా పేదరికం' సాధించడం. స్వర్ణాంధ్ర-2047 'పది సూత్రాలు'లో ఇదొకటి. 2047 నాటికి రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించడం ఈ విధానం లక్ష్యం. మొత్తంగా పి4 కార్యక్రమం చూడడానికి ఒక వినూత్న ఆలోచనగా కనిపించవచ్చు. అరిచేతిలో స్వర్గం లాగా ఉండొచ్చు. కానీ దీనితో పేదరిక నిర్మూలన పూర్తిగా సాధ్యమవుతుందా? అన్నదే ప్రశ్న.

పేదరిక నిర్మూలన అంటే ఆ ప్రాంత ప్రజల జీవనోపాధిని మెరుగుపరచడం, ఉచిత విద్య, వైద్యంతో పాటు వారికి పని కల్పించడం వంటి బాధ్యతలు ప్రభుత్వాలపై ఉంటాయి. ఇప్పుడు ఇలాంటి పనులన్నీ కార్పొరేట్లకు (సంపన్నులకు) కట్టబెడితే రేపు వాళ్లను ప్రభుత్వం ఎలా నియంత్రించగలుగుతుంది? వారు తప్పులు చేస్తే ఎలా ప్రశ్నిస్తుంది? పరిశ్రమలు పెరిగితే నిధులు పెరుగుతాయి. ఉద్యోగితా పెరుగుతుంది. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించాలి తప్ప దానాలు, దత్తతల మీద పేదరిక నిర్మూలన ఏ విధంగా సాధ్యం?

పేదరిక సూచీలో ఎక్కడున్నాం?

నీతి ఆయోగ్ రూపొందించిన బహుముఖ పేదరిక సూచీ (మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్-ఎం.పి.ఐ)లో ఆంధ్రప్రదేశ్ 20వ స్థానంలో ఉండగా, రాష్ట్రంలో కర్నూలు జిల్లా మొదటి స్థానంలో ఉంది. అంటే ఈ జిల్లాలో పేదరికం ఎక్కువగా ఉంది. రాష్ట్రంలో విభిన్న రంగాల్లో 12.31 శాతం మంది పేదరికంలో మగ్గిపోతున్నట్టు ఈ నివేదికలో వెల్లడైంది. ఎం.పి.ఐ ప్రకారం అత్యంత ఎక్కువగా పేదరికం ఉన్న జిల్లాలు కర్నూలు, విజయనగరం, ప్రకాశం, విశాఖపట్నం, శ్రీకాకుళం. ఈ మొదటి ఐదు జిల్లాల్లో మూడు ఉత్తరాంధ్రవే కావడం గమనార్హం. అలాగే రాయలసీమలోని కర్నూలు మొదటి స్థానంలో ఉంది. గుంటూరు, తూర్పు గోదావరి, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పేదరికం తక్కువగా ఉంది. కేంద్ర ప్రభుత్వంలో కీలకంగా ఉంటూ అత్యంత బలహీనమైన ప్రభుత్వం ఏదైనా ఉంది అంటే అది మన రాష్ట్రమే. సర్దుకు పోడానికి, సాగిల పడడానికి చాలా తేడా ఉన్నది. మన పాలకులు కేంద్ర ప్రభుత్వంతో సర్దుకుపోవడం కాదు సాగిలపడ్డారు. ఇది నడుస్తున్న నిజం. రాష్ట్ర విభజన తరువాత కేంద్ర ప్రభుత్వం అనేక విభజన హామీలు ఇచ్చింది. అమలులో రిక్త హస్తం. వెనుకబడిన ఏడు జిల్లాలకు బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజీ ఇస్తామన్నారు. వాటి గురించి అడిగే సాహసం కూడా చేయలేదు. పేద కుటుంబాలను బంగారు కుటుంబాలను చేసేది ఇలాగేనా!

సూపర్ 6 పేదరిక నిర్మూలన కోసమే కదా

సూపర్ సిక్స్ హామీల్లో నగదు బదిలీతో ముడిపడిన పథకాలు ఐదు ఉన్నాయి. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకాన్ని మినహాయిస్తే తల్లికి వందనం, మహిళలకు ప్రతి నెలా భృతి, యువతకు నిరుద్యోగ భృతి, రైతులకు ఏటా ఆర్థిక సాయం, ఏడాదికి ఉచితంగా మూడు వంట సిలిండర్ల హామీలు..నగదు బదిలీ పథకాలే. ప్రభుత్వం తన బాధ్యతను పూర్తిగా నెరవేర్చకుండా దాతృత్వంపై ఆధారపడడం దీర్ఘకాల పరిష్కారం కాదు. సంపద సృష్టి, సమాన పంపిణీ కోసం నిర్మాణాత్మక విధానాలు అవసరం. కేవలం ధనవంతుల దయాదాక్షిణ్యాలపై పేదరికం తగ్గుతుందా??

పేదరిక నిర్మూలన అనేది ప్రభుత్వ బాధ్యత కాదా? రాష్ట్రంలో 30 లక్షల కుటుంబాలు పేదరికంలో ఉన్నాయని ప్రభుత్వమే గుర్తించింది. వీరికి ఇళ్లు, గ్యాస్ కనెక్షన్లు, మంచినీరు, ఇంటర్నెట్ వంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత. వీటిని ప్రైవేటు వ్యక్తుల పైకి నెట్టడమంటే ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పుకున్నట్టే.

ఆచరణలో అసాధ్యం

పేదరిక నిర్మూలనలో పి4 విజయవంతం అవుతుందా అనేది పెద్ద ప్రశ్న. ఈ కార్యక్రమంలో పాల్గొనాలా వద్దా అనేది ధనవంతుల ఇష్టం. అది వాళ్ల ఇష్టంపై ఆధారపడి ఉంటుంది. ఎంతమంది పారిశ్రామికవేత్తలు దీనికి సిద్ధపడతారు? కొంతమంది దాతల సహకారంతో కొన్ని కుటుంబాలకు పి4 వల్ల ప్రయోజనం చేకూర్చవచ్చు. కానీ 30 లక్షల కుటుంబాల సమస్యను పరిష్కరించడం సాధ్యమేనా? అనేది పెద్ద సందేహం. బిల్‌గేట్స్, వారెన్ బఫెట్ వంటి ధనవంతుల దాతృత్వాన్ని చంద్రబాబు ఉదాహరణగా చెప్పారు. కానీ ఆ దేశాల్లో ప్రభుత్వాలు ప్రాథమిక సౌకర్యాలను అందిస్తాయి. దాతృత్వం అదనపు సహాయంగా ఉంటుంది.

సంపద మొత్తం కొద్దిమంది చేతులలో ఉన్న మాట వాస్తవం. ఆర్థిక అంతరాల తగ్గింపు కోసం ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో మదింపు చర్యలు, ఇంకెన్నో ఉద్యమాలు జరుగుతుండడం చూస్తున్నాం. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఆర్థికంగా స్థితిమంతులు, ఉదార స్వభావం కలవారు తమ పరిధులలో పేదలకు సహాయం చేయడమనేది భూమి పుట్టినప్పటి నుంచి ఉన్న ఒక సాంప్రదాయ ప్రక్రియ. ఇది శాశ్వతం కాదు, పూర్తిగా వారి దయ మీద ప్రాధాన్యత మీద ఆధారపడిన ప్రక్రియ. గాంధీజీ ధర్మకర్తృత్వ బోధన, వినోభా భావే భూదాన యజ్ఞం అన్నీ దీనిలో భాగమే. ఈ దాతృత్వమే రూపాంతరం చెంది నేడు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సి.ఎస్.ఆర్)గా మారింది. సి.ఎస్.ఆర్ లక్ష్యాలను పి4 కార్యక్రమంగా చూపించడమే ప్రభుత్వం చేస్తున్న పని. అంటే "కొత్త సీసాలో పాత సారా" అన్నమాట. ప్రభుత్వం ప్రజలను ముఖ్యంగా పేద ప్రజలను మోసగించడమే కాదు మభ్యపెట్టడమే. పేదవాళ్ళు ఆత్మగౌరవంతో బతకాలని కోరుకొంటారు తప్ప మరొకరి దయాదక్షిణ్యాల మీద బతకాలనుకోరు. ఆ రోజులు ఎపుడో అంతరించి పోయాయి. ఆర్థిక స్వావలంబన వారి హక్కు, ఎవరి దయో కాదు.

ప్రజలకు పని కల్పన దిశగా ఉద్దీపన చర్యలు చేపట్టాలి. పరిశ్రమలు స్థాపించాలి. మద్దతు ధరల స్థిరీకరణ చేసి వ్యవసాయం లాభసాటిగా చెయ్యాలి. లఘు పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఇచ్చి చేతి పరిశ్రమలకు చేయూతనివ్వాలి. 975 కి.మీ తీరప్రాంతమున్న రాష్ట్రం మనది. ఎంతో సహజ సంపద ఉన్న రాష్ట్రం. పేదరిక నిర్మూలన మీద ప్రభుత్వం చేసిన ఈ ప్రకటన అత్యంత నిర్లక్ష్యపూరితమైనది. బాధ్యతా రహితమైనది. పేద ప్రజల ఆత్మాభిమానాన్ని దెబ్బ తీసేది. పేదరికానికి ఎవరు కారణం అని ప్రశ్నించే స్థాయికి ప్రజలు చైతన్యవంతులు అయ్యారు. మన కళ్ళ ముందు వచ్చిన గొప్ప సామజిక మార్పు ఇది. దీనిని గుర్తించక పోవడం అవివేకం.

డాక్టర్ కె.వసుంధర, సామాజిక విశ్లేషకులు

ఇఎస్ఐ పథకం ఉద్దేశం - ప్రయోజనాలు

ఉపోద్ఘాతం ఇఎస్ఐ పథకం ఒక గొప్ప సాంఘిక భద్రత పథకం. భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు 41, 42 మరియు 43లో నిర్దేశించిన పనిహక్కు, విద్యాహక్కు, నిరుద్యోగ సహాయం, వృద్ధులకు, జబ్బుపడిన వారికి, పని చేయలేకపోయిన వారికి ప్రభుత్వం సహాయం చేయవలననే ఆదేశ సూత్రాలననుసరించి 1948లో కార్మిక రాజ్య బీమా చట్టం ద్వారా 'కార్మిక రాజ్య బీమా సంస్థ' ఏర్పాటు చేయబడింది. ఈ పథకం 24-02-1952న మొదట కాన్పూర్, ఢిల్లీలో అమలుపరచి తరువాత కొన్ని నిర్దేశించిన పారిశ్రామిక ప్రాంతాలకు విస్తరించబడింది. 2016 సెప్టెంబర్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాలకు వర్తింప చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమందుగల అన్ని పరిశ్రమలు, సంస్థలు పది మంది కార్మికులు గలవారు విధిగా ఈ చట్టాన్ని అమలు పర్చాల్సి ఉంది.

ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశ్యం

కార్మిక రాజ్య బీమా చట్టం కింద నమోదు కాబడిన కార్మికులు అస్వస్థతకు గురి అయినప్పుడు, కార్మికురాలు ప్రసవించినప్పుడు, ఉద్యోగ సంబంధమైన ప్రమాదాలకు గురైనప్పుడు లేదా మరణించిన యెడల, ఇతర వృత్తి సంబంధమైన కారణాల వలన పనికి వెళ్లలేనప్పుడు ఆర్థిక సహాయం చేయడానికి, ఆయన, వారి కుటుంబ సభ్యులకు అన్ని రకాల వైద్య సౌకర్యం కల్పించటం ముఖ్య ఉద్దేశం. ఇతర ఇన్సూరెన్స్ సంస్థల (బీమా సంస్థలలో) మాదిరిగానే బీమా అనే స్వభావం కార్మిక రాజ్య బీమా చట్టంలో నిబిడీకృతమై వుంది. అయితే ఇతర బీమా సంస్థలు కేవలం ఒకటే చందా ఒకటే ప్రయోజనం చేకూర్చుతాయి. కాని కార్మిక రాజ్య బీమా పథకం ఒకే చందా బహుళ ప్రయోజనాలు పొందుటకు ఉద్దేశించబంది. ముఖ్యమైన ఐదు ప్రయోజనాలతో పాటు అదనంగా తొమ్మిది ప్రయోజనాలు అనగా మొత్తం 14 ప్రయోజనాలు, వాటి వివరాలను సూక్ష్మంగా కింద వివరించబడినది.

ఈ పథకం వర్తించు పరిశ్రమలు, సంస్థలు:

ఏదైనా పరిశ్రమగాని, సంస్థనందుగాని కనీసం పదిమంది కార్మికులను ఉపయోగించుకొని తయారీ రంగంలో ఉన్న అన్ని పరిశ్రమలు, రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంస్థలకు తప్పనిసరిగా వర్తించును. అట్టి సంస్థలు ఏమనగా వార్తా పత్రికలు, సినిమాహాళ్లు, రవాణాసంస్థలు, దుకాణాలు, సంస్థలు, హోటళ్లు, ప్రయివేటు విద్యాసంస్థలు, ప్రయివేటు ఆస్పత్రులు మొదలైన సంస్థలకు ప్రస్తుతం ఈ చట్టం అమలు పరచటమైనది. యాజమాన్యం ఇష్టానుసారంగా కాకుండా ఈ చట్టమును తప్పనిసరిగా అమలు చేయాలి. చట్టమును అమలు చేయనివారు చట్టంలో ఉద్దేశించిన విధంగా శిక్షార్హులు అవుతారు.

ఈ చట్టం పరిధిలోకి వచ్చు కార్మికులు ఈ చట్టం ఏదేని పరిశ్రమలకు, సంస్థలకు వర్తింప చేసిన తేదీ నుంచి అందులో పని చేయుచున్న కార్మికులు ఎవరైతే వారి ప్రస్తుతం నెలవారి వేతనం రు.21 వేలు అంతకంటే తక్కువ పొందుచున్న వారికి మాత్రమే వర్తించును.

ఇఎస్ఐ చట్టంలో నమోదు చేయు విధానం: ఈ చట్టం పరిధిలోకి వచ్చే కర్మాగారాలు, సంస్థలు ఇఎస్ఐ చట్ట ప్రకారం నమోదు చేసుకోవడానికి www.shramasuvidha.gov.in లేదా www.esic.in వెబ్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో విధిగా రిజిస్టర్ చేసుకొనవలెను. పరిశ్రమ, సంస్థ నమోదు సమయంలోనే కార్మికులను కూడా నమోదు చేయవలెను.

ఆర్థిక వనరులు, ఇ.ఎస్.ఐ. చందా వివరాలు: యాజమాన్యం, ఉద్యోగుల నుంచి వచ్చే చందాల ద్వారా ఇఎస్ఐ పథకానికి ఆర్థిక వనరులు సమకూరుతాయి. ఉద్యోగులకు చెల్లించే మొత్తం వేతనంపై యజమాని వాటాగా 3.25 శాతాన్ని, 0.75 శాతాన్ని ఉద్యోగుల వాటాగా చెల్లించవలెను. (1-7-2013 నుంచి) యాజమాన్యం తమ నెలసరి ఇఎస్ఐ చందాలను ఆన్‌లైన్ ద్వారా ప్రతి నెల 15వ తేదీ లోపున చెల్లించవలెను.

ఇఎస్ఐ చట్టం అమలు చేయడం వలన యజమానికి కలుగు ప్రయోజనాలు :

1. పర్మెన్ కాంపెన్సేషన్ చట్టం, 1923, మెటర్నిటీ చట్టం, 1961 అమలు నుంచి పూర్తిగా మినహాయింపు.
2. కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు వైద్య సదుపాయం కల్పించు బాధ్యత నుంచి వెసులుబాటు.
3. యాజమాన్యపు చందా మొత్తం ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు.
4. యజమానికి బీమా రక్షిత కార్మికులు ఉండుట వలన సదరు కర్మాగార, సంస్థల ఉత్పాదకశక్తి పెరుగుటకు దోహదపడుతుంది.

ఈ పథకానికి సంబంధించి తదుపరి విచారణకు, సందేహ నివృత్తికి రీజనల్ ఆఫీసు పరిధిలోని మీ సమీప ఇఎస్ఐసి కార్యాలయాలను సందర్శించవచ్చును.

బీమాదారులకు ఇ.ఎస్.ఐ పథకంలోని మరికొన్ని ఇతర ప్రయోజనాలు

01. అంత్యక్రియల ఖర్చులు: బీమాదారులు ఇ.ఎస్.ఐ. పథకంలోని ఏదైనా ఒక ప్రయోజనానికి అర్హులై ఉండి మరణించినట్లయితే ఆ కుటుంబ పెద్దకుగానీ, లేదా అంత్యక్రియల ఖర్చు భరించిన ఏ ఇతర వ్యక్తికైనా (మరణ ధ్రువీకరణ పత్రం దాఖలు చేసే షరతుపై) గరిష్టంగా రు.15 వేలు (01.03.2019 నుంచి) ఇవ్వబడును.

02. ప్రసవ ఖర్చులు: ఇ.ఎస్.ఐ. వైద్య సదుపాయం లేని ప్రాంతంలో బీమా దారురాలుగాని, బీమాదారుని భార్యగాని ప్రసవించినట్లయితే అట్టి ప్రసవాలకు రు.7,500 చొప్పున (గరిష్టంగా రెండు ప్రసవాలకు) ప్రసవ ఖర్చుల ప్రయోజన రూపంలో చెల్లించబడతాయి.

03. కుటుంబ నియంత్రణ ప్రయోజనం: అనారోగ్య ప్రయోజనానికి అర్హత కలిగిన బీమాదారులు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేసుకుని సంబందిత ఆస్పత్రి, ఇ.ఎస్.ఐ. వైద్యశాలలచే ఇవ్వబడిన పత్రాలను సమర్పించిన యెడల వారికి వేసక్టమీకి ఏడు రోజులు, ట్యూబెక్టమీకి 14 రోజులు సరాసరి దినసరి వేతనం ఇవ్వబడును.

04. విధి నిర్వహణలో జరిగిన ప్రమాదంలో ఏర్పడిన వైకల్యం కారణంగా ఉద్యోగం కోల్పోయిన బీమాదారులు మరియు వారి జీవిత **భాగస్వామికి ఏర్పరిచిన వైద్య సంరక్షణ:** సంవత్సరానికి రు.120/- చొప్పున ముందుగా చెల్లించినట్లయితే, సదరు బీమాదారులకు వారి జీవిత భాగస్వామికి సదరు బీమాదారునికి పదవీ విరమణ వయస్సు వచ్చువరకు ఇ.ఎస్.ఐ. వైద్య సంస్థల ద్వారా వైద్యసేవలు లభిస్తాయి (సూపర్ స్పెషాలిటీ వైద్య సదుపాయం మినహాయించి), ఈ ప్రయోజనం పొందుతూ బీమాదారులు మరణించినప్పటికీ, సదరు బీమాదారుని జీవిత భాగస్వామి ఈ సదుపాయాన్ని కొనసాగించుకొనవచ్చును.

05. పదవీ విరమణ లేదా స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన బీమాదారులకు వారి జీవితభాగస్వామికి ఏర్పరిచిన వైద్యసంరక్షణ : కనీసం ఐదు సంవత్సరాలు ఇ.ఎస్.ఐ. చందాచెల్లించిన బీమాదారులు ఈ ప్రయోజనానికి అర్హులు. సంవత్సరానికి రు.120 చొప్పున ముందుగా చెల్లించినట్లయితే, సదరు బీమాదారులకు వారి జీవిత భాగస్వామికి ఇ.ఎస్.ఐ. వైద్య సంస్థల ద్వారా వైద్యసేవలు లభిస్తాయి (సూపర్‌స్పెషాలిటీ మినహాయించి), ఈ ప్రయోజనం పొందుతూ బీమాదారులు మరణించినప్పటికీ, సదరు బీమాదారుని జీవిత భాగస్వామి ఈ సదుపాయాన్ని కొనసాగించుకొనవచ్చును.

06. ఆశ్రిత ప్రయోజనం పొందే వితంతువుకు వైద్య సంరక్షణ: సంవత్సరానికి రూ. 120 చొప్పున ముందుగా చెల్లించినట్లయితే ఆశ్రిత ప్రయోజనం పొందుతున్న వితంతువుకు ఇ. ఎస్. ఐ. వైద్య సంస్థల ద్వారా అందించే అన్ని సేవలు లభిస్తాయి. (సూపర్ స్పెషాలిటీ వైద్య సదుపాయం మినహాయించి).

07. రాజీవ్ గాంధీ శ్రామిక కల్యాణ్ యోజన (నిరుద్యోగభతి): విధినిర్వహణలో కాకుండా బయట జరిగిన ప్రమాదాలలో 40శాతం వైకల్యం చెందిన బీమాదారులకు, కర్మాగారం లేదా సంస్థ మూసివేత వలన గాని, రిట్రెంచిమెంట్ వలన గానీ ఉద్యోగం కోల్పోయిన బీమాదారులకు ఈ ప్రయోజనం వర్తిస్తుంది. సదరు బీమాదారుడు గత రెండు సంవత్సరాల్లో ప్రతీ చందా కాలంలో 78 రోజులు చందా కలిగి ఉండాలి. బీమాదారుల యొక్క మొత్తం జీవిత కాలంలో 24 నెలల పాటు ఈ నిరుద్యోగ భృతి లభిస్తుంది. మొదటి 12 నెలలు బీమాదారుని సరాసరి వేతనంపై 50శాతం లభిస్తుంది. తదుపరి 12 నెలలు 25శాతం లభిస్తుంది. ఈ నిరుద్యోగ భృతి పొందే సమయంలో బీమాదారులకు, వారి జీవిత భాగస్వామికి వైద్య సదుపాయం లభిస్తుంది. ఈ సమయంలో బీమాదారుల యొక్క వృత్తి నైపుణ్యాలను మెరుగు పరచుకోడానికి తీసుకునే వృత్తి శిక్షణకు (గరిష్టంగా ఒక సంవత్సరం) ప్రభుత్వ సంస్థలకు చెల్లించిన మొత్తాలను ఇ.ఎస్.ఐ.సి. తిరిగి చెల్లిస్తుంది.

08. వృత్తి పునరావాస భత్యం: విధి నిర్వహణలో జరిగిన ప్రమాదంలో కనీసం 40 శాతం వైకల్యం పొంది, 45 సంవత్సరాలలోపు వున్న బీమాదారులకు మాత్రమే వర్తిస్తుంది. 30 నుంచి 45 రోజుల వరకు వృత్తి పునరావాస కేంద్రాల నియమాల ప్రకారం ప్రభుత్వ సంస్థల్లోనూ, ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థలలోను, ఏదో ఒకవృత్తి శిక్షణ ఇవ్వబడును.

09. ఇ.ఎస్.ఐ.సి నిర్వహించు వైద్య కళాశాలలో బీమాదారుల సంతానానికి విద్యావకాశం: సంబంధిత నియమ నిబంధనలకు లోబడి బీమాదారుల సంతానానికి ఇ.ఎస్.ఐ.సి.చే నిర్వహించబడే వైద్య కళాశాలలో విద్య నభ్యసించే అవకాశం, నిబంధనలకు లోబడి రిజర్వేషన్ సౌకర్యం కలదు.

పైన పేర్కొనబడిన ప్రయోజనాలు, సంస్థ యజమాని సకాలంలో కార్మికులను ఆన్‌లైన్ ద్వారా రిజిష్టర్ చేసి - సకాలంలో చందా చెల్లించుట వలన ఎటువంటి ఆటంకాలు లేకుండా పొందవచ్చును.

డిప్యూటీ డైరెక్టర్ ఇన్‌ఛార్జి
ఇ.ఎస్.ఐ.సి ఉప ప్రాంతీయ కార్యాలయం,
విశాఖపట్నం

ఇఎస్ఐ లోకల్ పే కార్యాలయం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- రణస్థలం

పైడిభీమవరంలో ఇఎస్ఐ లోకల్ పే ఆఫీసు ఏర్పాటు చేసి, ఇఎస్ఐ డిస్పెన్సరీలలో రిఫరల్ సౌకర్యం కల్పించాలని సిఐటియు నాయకులు, పరిశ్రమ యూనియన్ నాయకులు, కార్మికులు ముక్తకంఠంతో కోరు తున్నారు. పైడిభీమవరం ఇఎస్ఐ డయాగ్నస్టిక్ సెంటర్ ప్రారంభానికి విచ్చేసిన ఇఎస్ఐ ఆంధ్రప్రదేశ్ రీజినల్ డైరెక్టర్ ఎ.వేణు గోపాలరావు, డిప్యూటీ డైరెక్టర్ జోస్ మార్టిన్‌లకు ఈ సమస్యపై వినతిపత్రం కూడా గతంలో అందించారు. శ్రీకాకుళం జిల్లాలో ఇఎస్ఐ టై అప్ ఆస్పత్రులు ఏర్పాటు చేయాలని, కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని కోరుతున్నారు. జిల్లాలో ఎచ్చెర్ల, శ్రీకాకుళంలో ఇఎస్ఐ డిస్పెన్సరీలు ప్రారంభించి మూసివేయడం కార్మికులకు వైద్యం దూరం చేయడమేనని ఇది సరైనది కాదని వెంటనే ప్రారంభించి డాక్టర్లను, సిబ్బందిని నియమించి కార్మికులకు వైద్య సేవలు అందించాలని కార్మికులు కోరు తున్నారు. జిల్లాలో 100 పడకల ఇఎస్ఐ ఆస్పత్రి లేకపోవడం వలన కార్మికులకు సరైన వైద్యం అందడం లేదు. ప్రమాదాలు జరిగితే సకాలంలో సరైన వైద్యం అందక కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇఎస్ఐ డిస్పెన్సరీ, ప్యానెల్ క్లినిక్‌ల పరిధిలో గల కార్మికులకు గతంలో అనారోగ్యం గురైతే ఇఎస్ఐ డిస్పెన్సరీ, ప్యానెల్ క్లినిక్ ద్వారా రిఫరల్ లెటర్ తీసుకుని ఇఎస్ఐ టై అప్ ఆస్పత్రిలో జాయిన్ అయ్యేవారని ప్రస్తుతం డిస్పెన్సరీ, ప్యానెల్ క్లినిక్‌లో రిఫరల్ సౌకర్యం ఎత్తివేయడం వలన కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు అనారోగ్యం వస్తే ఇఎస్ఐ రిఫరల్ రాయించు కోవడానికి విశాఖ పట్నంలోని మల్కాపురం వెళ్ళాల్సి వస్తుందని, పలాస నుంచి 200 కిలోమీటర్లు, శ్రీకాకుళం నుంచి 120 కిలోమీటర్ల దూరం. వ్యయ, ప్రయాసలతో పేషెంట్లు వెళ్ళలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిస్పెన్సరీ, ప్యానెల్ క్లినిక్‌లో రిఫరల్ సౌకర్యం ఎత్తివేయడం అంటే కార్మికులు వైద్యాన్ని దూరం చేయడమేనని ఆరోపిస్తున్నారు. గతంలో మాదిరిగా డిస్పెన్సరీ, ప్యానెల్ క్లినిక్‌లో రిఫరల్ సౌకర్యం



పైడిభీమవరంలో ఇఎస్ఐ లోకల్ పే ఆఫీసు ఏర్పాటు చేయాలని అధికారులకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు (ఫైల్)

కల్పించాలని కోరు తున్నారు. పైడిభీమవరం ఇఎస్ఐ డిస్పెన్సరీ పరిధిలో సుమారు 18 వేల మంది కార్మికులు ఉన్నప్పటికీ లోకల్ పే ఆఫీసు లేకపోవడంతో సెలవుకోసం శ్రీకాకుళం లేదా విజయనగరం వెళ్ళాల్సి వస్తుందని, శ్రీకాకుళం జిల్లాలో ఇఎస్ఐ టై అప్ ఆస్పత్రి లేదు. దీనివలన కార్మిక కుటుంబాలు వ్యయ ప్రయాసలకోర్చి వేరే జిల్లాలకు వెళ్ళలేక వైద్యానికి దూరమ వుతున్నారు. జిల్లాలో సుమారు 26 వేల మంది కార్మికులు నుంచి భీమాగా ఇ.ఎస్.ఐ కార్పొరేషన్‌కు నెలకు సుమారు కోటియాభై లక్షలు రూపాయలు చెల్లిస్తున్నా కార్మికులు సరైన వైద్యం అందడం లేదని కావున సమస్యలు పరిష్కరించి కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని కార్మికులు కోరుతున్నారు. పైడిభీమవరంలో నిర్మించిన ఇఎస్ఐ 6 పడకల డయాగ్నస్టిక్ సెంటర్‌లో వెంటనే పూర్తిస్థాయిలో స్పెషలిస్ట్ డాక్టర్లను, సిబ్బందిని నియమించాలని, అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని కార్మికులు కోరుతున్నారు.

డిస్పెన్సరీల్లో అన్ని రకాల మందులు కొరత తీర్చి కార్మికులకు పూర్తి స్థాయిలో మందులు సరఫరా చేయాలని, కార్మికులందరికీ ఇ.ఎస్.ఐ వర్తింప చేయాలని సిఐటియు నాయకులు, యూనియన్ నాయ కులు, కార్మికులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాటం

మేడే స్ఫూర్తితో కార్మిక హక్కుల రక్షణకు కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లు రద్దు తప్పని సరి. పారిశ్రామికీకరణ తొలిరోజుల్లో కార్మికులు రోజుకు 14 గంటలు పనిచేసేవారు. 8 గంటల పనిదినం కోసం పెద్ద ఎత్తున జరిగిన పోరాటాలు ఫలితంగా 8 గంటల పని దినాన్ని సాధించుకున్నాం. కార్మికవర్గం అశేష త్యాగాలతో పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాస్తూ కార్మికులకు రక్షణగా ఉంటున్న 44 కార్మిక



చట్టాలను రద్దు చేసి యజమానులకు కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్లను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. బ్రిటిష్ కాలం నుంచి కార్మికులు ఐక్యంగా పోరాటం చేసి 8 గంటల పనిదినంతో పాటు సాధించుకున్న హక్కులను కూడా మోడీ ప్రభుత్వం రద్దు చేసింది. బిజెపి ప్రభుత్వం రూ.లక్షల కోట్ల ప్రజా ధనాన్ని అదానీ, అంబానీలకు గుమ్మరించి, ప్రజలపై పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ భారాలను మోపుతోంది. ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ కార్పొరేట్లకు కట్టబెడుతోంది. దేశ సంపదైన ప్రకృతి వనరులు, ప్రభుత్వ రంగాన్ని, సంపద సృష్టికర్తలైన కార్మికులు, రైతులను స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు తాకట్టు పెడుతోంది. జీవనోపాధిపై, కార్మికులు, శ్రమ జీవులు పోరాడి సాధించుకున్న హక్కులపై పెట్టుబడి దారులు చేస్తున్న దాడికి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలి. విభజించే ప్రయత్నాలను ఐక్యంగా ఎదిరించాలి. కేంద్ర ప్రభుత్వ బాటలోనే రాష్ట్ర ప్రభుత్వమూ ప్రజలపై వివిధ రూపాల్లో భారాన్ని మోపుతోంది. సమిష్టి పోరాటాల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడానికి సిద్ధం కావాలి.

- పి.తేజేశ్వరరావు,
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

మహిళలు ముందుకు రావాలి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసం ఎన్ని చట్టాలు తీసుకొచ్చినా వాటిని క్షేత్ర స్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. ఫలితంగా మహిళలకు రక్షణ లేకుండా పోయింది. ప్రతి రోజూ ఏదో ఒక చోట మహిళలపై వివిధ రూపాల్లో దాడులు జరుగుతూనే ఉన్నాయి. ఒంటరిగా మహిళలు సంచరించే ఆత్మస్థైర్యం రావాలి. మహిళల హక్కుల పరిరక్షణకు సమర్థవంతంగా చట్టాలు అమలుకు ఉద్యమాలే శరణ్యం. మేడే స్ఫూర్తితో ఆదిశగా మహిళలు ముందుకొచ్చి ఉద్యమాల్లో భాగస్వాములు కావాలి. మహిళలకు ఎల్లప్పుడూ ఐద్వా అండగా నిలుస్తుంది.

- ఎ.లక్ష్మి, ఐద్వా జిల్లా కన్వీనర్




















సార్వత్రిక సమ్మెతో ప్రతిఘటనోద్యమ మరో దశ

భారత కార్మిక వర్గం, సమకాలీన పెట్టుబడిదారీ సంస్థాగత సంక్షోభం తీవ్రం అవడం వల్ల, గతంలో ఎన్నడూ ఊహించని పరిస్థితులను, సవాళ్లను ఎదుర్కొంటోంది. దీనికి పాలక వర్గం ప్రతిస్పందన మరింత దూకుడుగా, నిరంకుశ ఆధిపత్య ధోరణితో, ప్రస్తుతం ఉన్న ప్రజాస్వామిక చట్రంలోనే కార్మిక వర్గానికి ఉన్న సామూహిక, ప్రజాస్వామిక హక్కులను ఊడబీకుతోంది. జాతీయ స్థాయిలో, పని ప్రదేశంలో కార్మిక వర్గాన్ని నిరాయుధులను చేయడం, నయా ఫాసిస్టు పోకడగాను, బీజేపీ ఎన్.డి.ఎ పాలనా ముద్ర గాను గమనించాలి. ఈ క్రమంలో కార్మిక వర్గంపై బానిసత్వాన్ని రుద్దే విధంగా 29 కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చింది. కార్మికవర్గాన్ని ఈ రకంగా బానిసలుగా మార్చడం కార్పొరేట్ – మతతత్వ వ్యవస్థ ఏర్పాటుకు పునాది అవుతుంది. తద్వారా ఆర్థిక వ్యవహారాల నిర్వహణలో, సమాజ పాలనలో పూర్తిస్థాయి ఆధిపత్య వ్యవస్థ నెలకొల్పడానికి సాధ్యమవుతుంది. మొత్తం పాలనా వ్యవస్థను నిరంకుశంగా మార్చే దిశలో ఒక భాగమే లేబర్ కోడ్‌లు. ఇవి 2019, 2020లోనే చట్టంగా తెచ్చినా, 2025లో ఇప్పటి దాకా అవి అమలు కాకుండా వివిధ స్థాయిల్లోని కార్మిక వర్గం పని ప్రదేశాల్లో, ఆయా రంగాల్లో, జాతీయ స్థాయిలో చేసుకున్న జోక్యాలు, ప్రతిఘటనలు ఆపగలిగాయి. కానీ మూడో సారి వచ్చిన మోదీ ప్రభుత్వం, తన బలం గణనీయంగా తగ్గినా, లేబర్ కోడ్‌లు ఎలాగైనా అమలు చేయాలని, ఏప్రిల్ 2025లో వాటిని నోటిఫై చెయ్యడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలో కేంద్ర కార్మిక సంఘాలు, వివిధ రంగాల స్వతంత్ర ఫెడరేషన్‌ల ఐక్య వేదిక, పాలక పక్షం కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే షరతులను నీచమైన పన్నాగంతో తేవడాన్ని ఐక్య ప్రతిఘటనోద్యమం స్థాయి పెంచడం ద్వారా గట్టిగా ఎదుర్కోవాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో మార్చి 18న న్యూ ఢిల్లీలో కార్మికుల జాతీయ సదస్సు, కార్మికవర్గ ఐక్య ఉద్యమం మరింత విస్తృత సమర శీల ప్రతిఘటన 2025 మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ద్వారా తెలపాలని నిర్ణయించింది.







హక్కుల సాధనకు కార్మికుల పోరుబాట

ప్రభుత్వం, యాజమాన్యాల తీరుకు నిరసనగా గతేడాది కాలంలో పారిశ్రామికరంగ కార్మికులు, స్కీమ్‌వర్కర్లు అనేక రూపాల్లో పోరాటాలు సాగించారు. రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగినా పాలకుల విధానాల్లో మార్పు కనిపించలేదు. పారిశ్రామికవేత్తలకు అనుకూల నిర్ణయాలనే అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. దీంతో తమ హక్కుల కోసం, కనీస వేతనాల కోసం కార్మికులు పోరుబాట పట్టాల్సి వచ్చింది. రాజకీయ వేధింపులు, ఉద్యోగాల నుంచి తొలగింపు సమస్యలను ఎదుర్కొన్న స్కీమ్‌వర్కర్లు రోడ్డెక్కిన పరిస్థితులు తలెత్తాయి. అంగన్‌వాడీలు ఇతర చిరుద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయకపోవడంతో వారు పలురూపాల్లో ఆందోళనలు సాగించారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

- **రాజకీయ వేధింపులపై స్కీమ్‌వర్కర్ల ఆందోళనలు**
- **ఉద్యోగ భద్రతపై మున్సిపల్ రోడ్డెక్కిన మున్సిపల్ కార్మికులు**
- **సంక్షేమం కోసం ఆందోళన చేపట్టిన భవన నిర్మాణ కార్మికులు**

కార్మికులపై యాజమాన్యాల వైఖరి మారకపోవడంతో ఈ ఏడాదీ పారిశ్రామికరంగ కార్మికులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి దాపురించింది. రణస్థలం మండలం వరిశాంలోని శ్యామ్‌పిస్టన్-2 పరిశ్రమ లేఆఫ్‌కు దరఖాస్తు చేసుకుంది. దీనిపై స్థానిక తహశీల్దార్ కార్యాయలం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కార్మికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతిపత్రం అందించారు. దీంతో ప్రభుత్వం లేఆఫ్ దరఖాస్తును తిరస్కరించింది. రణస్థలం మండలం శ్యాంపిస్టన్స్ ప్లాంట్-2లో 30 ఏళ్ల సర్వీసు పూర్తయిన కార్మికులను తొలగించేందుకు యాజమాన్యం ప్రయత్నించిన సందర్భంలో సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు అనేకరూపాల్లో ఆందోళనలు చేపట్టారు. ప్రస్తుతం కల్పిస్తున్న 14 రోజుల పనిదినాలు కాకుండా పూర్తిస్థాయిలో పని కల్పించడం కోసం మరోవైపు న్యాయ పోరాటం సాగిస్తోంది. సిఐటియు చేసిన సాగించిన పోరాటాల ఫలితంగా నాగార్జున అగ్రికెమ్ పరిశ్రమలో వేతన ఒప్పందానికి యాజమాన్యం ముందుకొచ్చింది.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్వాడీలు (ఫైల్)

రోడ్డెక్కిన ఇతర రంగాల కార్మికులు

తమ సమస్యల పరిష్కారం కోసం పలు రంగాలకు చెందిన కార్మికులు పలు సందర్భాల్లో రోడ్డెక్కారు. ప్రధానంగా మున్సిపల్ కార్మికులు అనేకమార్లు ఆందోళనకు దిగారు. ఇప్పటివరకు ఆప్కాస్ పరిధిలో ఉన్న వారిని ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించే ప్రతిపాదనను వారు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆప్కాస్ పరిధిలో ఉన్న వారిని తప్పించి కొత్త వారికి ఉద్యోగాలు ఇచ్చే అవకాశం లేకపోవడంతో ఎమ్మెల్యేల ఒత్తిడితో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని తిప్పికొట్టేందుకు పలురూపాల్లో ఆందోళనలు కొనసాగిస్తూనే ఉన్నారు. ప్రభుత్వాలు మారినా భవన నిర్మాణ సంక్షేమ కార్మికుల బతుకులు మారడం లేదు. సెస్ రూపంలో సమకూరే సంక్షేమ నిధిని వారి సంక్షేమం కోసం వినియోగించకుండా గత వైసిపి వారికి అన్యాయం చేసింది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం అదే విధానాన్ని కొనసాగిస్తోంది. దీంతోపాటు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న క్లయిమ్‌లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భవన నిర్మాణ కార్మికులు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే ప్రయత్నం చేశారు. మందస రైస్‌మిల్లు కార్మికులు అలుపెరగని పోరాటం సాగించి కొత్త వేతన ఒప్పందాన్ని సాధించుకోగలిగారు. వేతన ఒప్పందం అమలు కోసం సిఐటియు ఆధ్వర్యాన్న ధర్నాల, రాస్తారోకోలుతో పాటు 26 రోజులు సమ్మె చేశారు. పోరాటాల ఫలితంగా వారికి 19.5 శాతం వేతనం పెంచేందుకు యాజమాన్యం అంగీకరించింది.

రాజకీయ వేధింపులపై ఆందోళనలు

రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన ప్రతిసారి గ్రామాల్లో స్కీమ్ వర్కర్లకు రాజకీయ వేధింపులు పరిపాటిగా మారింది. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత జిల్లా పలు గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు వేధింపులకు గురి చేయడం మొదలు పెట్టారు. సంతబొమ్మాళి మండలం గెద్దలపాడులో ఆశా వర్కర్ పోస్టుకు రూ.2 లక్షలు కట్టడమో లేక వేలం పాటలో పాల్గొంటావో తేల్చుకోవాలంటూ ఆశా వర్కర్‌ను వేధింపులకు గురి చేశారు. ఆమెను గ్రామ బహిష్కరణ చేశారు. దీనిపై ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రంగంలోకి దిగి ఈ అంశంపై వైద్యారోగ్యశాఖ కమిషనర్, కలెక్టర్, ఎస్‌పికి ఫిర్యాదు చేశారు. అధికారులు గ్రామంలో పర్యటించి పలువురు గ్రామ పెద్దలను గట్టిగా హెచ్చరించారు. తప్పు లేకుండా పోస్టు నుంచి తొలగించే అధికారం ఎవరికీ లేదంటూ చెప్పడంతో ప్రస్తుతానికి సమస్య కొంత మేర పరిష్కారమైంది. అదేవిధంగా గార మండలం శ్రీకూర్మం పంచాయతీ ముద్దాడపేటలో రాజీనామా చేసి వెళ్లిపోవాలంటూ అంగన్‌వాడీ కార్యకర్తను వేధింపులకు గురి చేశారు. పిల్లలను కేంద్రాలకు పంపకుండా, సెంటర్‌కు వెళ్లిన వారిపై అపరాధ రుసుము వేస్తామంటూ స్థానిక పెద్దలు కొందరు ఆంక్షలు సైతం విధించారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు స్థానిక సెంటర్ వద్ద కార్యకర్తలతో ధర్నాలు నిర్వహించి బాధిత కార్యకర్తకు అండగా నిలిచింది.

ఉప్పు కార్మికుల ఉపాధికి గండం

కష్టం కార్మికులది.. కాసులు దళారులవి

ప్రజాశక్తి - నౌపడ

నౌపడ ఉప్పు ఉత్పత్తి సంక్షోభంలో పడటంతో కార్మికుల ఉపాధికి గండం ఏర్పడింది. నౌపడ, సీతానగరం, మర్రిపాడు, శలగపేట, భావనపాడు, యామలపేట ప్రాంతాల్లో ఐదు వేల ఎకరాల వరకు ఉప్పు ఉత్పత్తి సాగేది. కానీ లీజు గడువులు ముగియడంతో కేవలం సుమారు 500 ఎకరాలు మాత్రమే రైతులు సాగు చేస్తున్నారు. మరోవైపు మూలపేట పోర్టు నిర్మాణానికి ఉప్పు భూములు అవసరమైతే తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటనలు చేస్తుంది. దీంతో ఉప్పు కార్మికుల మరింత ఆవేదన చెందుతున్నారు. గత ఐదారేళ్లుగా ఉప్పు పరిశ్రమ నుంచి వందలాది మంది కార్మికులు భవన నిర్మాణ రంగంలోకి చేరిపోయారు. చెన్నై, హైదరాబాద్, విశాఖపట్నం, బళ్లారి, ఒడిశా ప్రాంతాలకు వలస వెళ్లి బతుకుతున్నారు. సరైన ఉపాధి మార్గాలు లేక ఈ ప్రాంతంలోని యువత విదేశాల్లో పలు నిర్మాణ రంగాల్లో పనులు చేసుకోవడానికి మొగ్గు చూపుతున్నారు. ఉప్పు పంటపై ఆధారపడి జీవిస్తున్న సుమారు రెండు వేల మంది కుటుంబాలకు ప్రభుత్వాలు ఊతం అందించే పరిస్థితి కనబడడం లేదు. పోర్టు నిర్మాణంతో ఇకపై భూములు ఉంటాయో పోతాయో తెలియక ఇక్కడి రైతులు, కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. దీంతో అధిక శాతం మంది వలస పనులపై దృష్టి పెడుతున్నారు.

కష్టం కార్మికులది.. కాసులు దళారులవి



ఉప్పును సాగు చేస్తున్న రైతులు



ఉప్పును తోడుతున్న రైతు

ఆరుగాలం కష్టించి.. శ్రమనే పెట్టుబడిగా పెట్టి ఉప్పు పండించే రైతులు వారితో పనిచేసే కార్మికులు కష్టాన్ని దోచుకుని దళారులు కాసులు సంపాధించుకునే పరిస్థితి నౌపడలో ఏర్పడింది. మధ్యవర్తులు, దళారులు చేష్టలతో ధరల నియంత్రణ లేక గిట్టుబాటు రావడం లేదు. వ్యాపారులు, దళారులు సిండికేట్గా మారి ధరలు నిర్ణయించే పరిస్థితి దాపురించింది. ఒక నెల రోజుల పాటు ధరలు పెంచడం, తర్వాత అమాంతం తగ్గించడం రైతులు మోసపోతున్నారు. ఇక్కడ దళారులు తక్కువ ధరకు కొని ఎక్కువ ధరకు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసుకుంటున్నారు. ఈ ఏడాది జనవరిలో రూ.130 పలికిన ధర... ప్రస్తుతం రూ.80కు పడిపోయింది. పంట పెట్టుబడి కింద కూలీ పనులకు వచ్చే కార్మికులకు పూటకు రూ.300 ఇవ్వాల్సి ఉంటుంది.

పెరిగిన డీజిల్ ధరలతో ఇంజన్‌తో నీరు తోడి గల్లీలలో నింపడం, మోత, తీత, చదును చేయడం, కుప్పలుగా పేర్చడం, బస్తాలు ఎక్కించడం వంటి పనులకు పెట్టుబడి పెట్టాల్సి ఉంది. ఒక ఎకరాకు పండించే రైతుకు ప్రస్తుత లెక్కల ప్రకారం ఎకరాకు రూ.35 వేలు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. అయితే ధరల నియంత్రణ లేకపోవడంతో కాయకష్టమే మిగులుతుందని రైతులు ఉప్పు సాగుపై నిరాశక్తి చూపుతున్నా రు. సాగు భూములు రెన్యువల్ చేయాలని, దళారులను కట్టడి చేసి రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు, కార్మికులు ఎప్పటి నుంచో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వమే ఎగుమతులు సౌకర్యం కల్పించి ఆదుకోవాలని పలువురు రైతులు కార్మికులు కోరుతున్నారు.



ప్రభుత్వరంగ బ్యాంకుల పరిరక్షణ - ట్రేడ్ యూనియన్ల పాత్ర

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రపంచ వ్యాప్తంగా కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు ఆర్థిక అస్థిరతలు, ప్రకృతి వైపరీత్యాలు, సహజ వనరుల కార్పొరేట్ దోపిడీలు, నాలుగు లేబర్ కోడ్ ద్వారా కార్మిక చట్టాలు కాలరాయబడే నేపథ్యంలో, మానవ జీవన విధానంలో న్యాయం, రక్షణ, మానవీయతకు భంగం వాటిల్లే తరుణంలో మేడే నిర్వహించుకోవడం చారిత్రాత్మక ప్రాధాన్యత సంతరించుకుంది. ఎన్‌డిఎ-3 ప్రభుత్వం ప్రయివేటీకరణ విధానాల్లో భాగంగా, బ్యాంకింగ్ రంగంతోపాటు ఇన్సూరెన్స్, పోస్టల్, రైల్వేస్, టెలీ కమ్యూనికేషన్, ప్రభుత్వరంగ పరిశ్రమల మనుగడ ప్రశ్నార్ధకంగా మారింది. శాశ్వత ఉద్యోగ నియామకాలు నిలిచిపోయాయి. తాత్కాలిక ఉద్యోగాలు, అవుట్ సోర్సింగ్ నియామకాలు, కాంట్రాక్టు ఉద్యోగుల నియామకాలు చేపట్టి ఉద్యోగ భద్రత కరువై మానవ మనుగడకు భంగం వాటిల్లే సమయంలో ఉద్యమాల ఆవశ్యకత ఎంతైనా ఉంది. మేధావులు, ఉద్యోగులు, ఖాతాదారులు, ప్రజలు నిశితంగా పరిశీలించి భారతదేశ ఆర్థిక వ్యవస్థను పరిరక్షించుకునే దిశగా అడుగు ముందుకేయాలి. ఐక్య ఉద్యమాల కార్యాచరణకు నడుం బిగించాలి. ఒక దేశం ఆర్థికాభివద్ధిలో బ్యాంకింగ్ రంగం కీలకమైన పాత్ర పోషిస్తుందన్నది నిర్వివాదాంశం. భారతదేశ బ్యాంకింగ్ రంగ ప్రస్థానం నాలుగు దశలుగా విభజించవచ్చు.

1786-1969లో ప్రయివేట్ బ్యాంకులు లాభాలకోసం పనిచేసేవి. ఈ కాలంలో 559 ప్రయివేట్ బ్యాంకులు దివాలా తీసి, ప్రజలకు టోపీ వేశాయి. కోట్లాది ప్రజాధనాన్ని లూటీ చేశాయి. జాతీయికరణ తరువాత కూడా గ్లోబల్ ట్రస్టు బ్యాంకుతోపాటు 23 ప్రయివేట్ బ్యాంకులు మూతపడ్డాయి. 1969లో భారతదేశ సామాన్య ప్రజలను, సన్నకారు, మధ్యతరగతి రైతులను, పెట్టుబడిదారుల, భూస్వాముల, దళారీల కబంద హస్తాల నుంచి విముక్తి చేయడానికి 14 బ్యాంకులు జాతీయకరణ చేశారు. 1980 ఏప్రిల్ 15న ఆరు బ్యాంకులు జాతీయీకరణ చేశారు. 1990 వరకు ప్రభుత్వరంగ బ్యాంకులు దేశ ఆర్థికాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాయి. నేటికీ ప్రభుత్వరంగ బ్యాంకులు సామాన్య ప్రజానీకం అవసరాలను కాపాడుతూ.. లాభాల బాటలో ప్రయాణిస్తూ... బ్యాంకింగ్ సేవలు అందరికీ విస్తరించడంలో కృతకృత్యులయ్యాయనడానికి ఈ కింది గణాంకాలు అద్దం పడతాయి.

1991 నరసింహం కమిటీ నుంచి 2017 ఎఫ్ఆర్‌డిఐ బిల్లు వరకు వివిధ ప్రభుత్వాలు భారత జాతీయ ప్రభుత్వరంగ బ్యాంకుల పనితీరును మెరుగుపరిచే నెపంతో సుమారు 12 సార్లు సవరణలు, సంస్కరణలు చేశాయి. అనేక కమిటీలను వేశాయి. కేంద్ర ప్రభుత్వ విధానాలను లోతుగా అధ్యయన చేస్తే ఈ కింది విషయాలు తేటతెల్లమవుతాయి. 1990 తరువాత సామ్రాజ్యవాదుల, కార్పొరేట్ బడా పెట్టుబడిదారుల నయా వలసవాదుల కన్ను అభివృద్ధి చెందుతున్న భారతదేశంపైన పడింది. ఎల్‌పిజి నామజపంతో సరళీకరణ, ప్రయివేటీకరణ, ప్రపంచీకరణ అనే మూడు అందమైన మాటలు నూతన ఆర్థిక విధానాల రూపంలో బలవంతంగా భారతదేశంపై అప్పునిచ్చే నెపంతో ఐఎంఎఫ్ ప్రపంచ బ్యాంకు ద్వారా రుద్దబడ్డాయి. ఒక పక్క అభివృద్ధికి కారణభూతమైన ప్రభుత్వరంగ బ్యాంకులను అభినందిస్తూ, 1991లో నరసింహన్ కమిటీ 'యు' టర్న్ తీసుకొని సమ్మిళిత వృద్ధి, పోటీతత్వం పేరుతో నూతన ఆర్థిక విధానాన్ని ప్రవేశ పెట్టింది. ఈ కారణంగా విదేశీ బహుళ జాతి సంస్థల చొరబాటుకు దారులు తెరువబడ్డాయి. ప్రయివేట్ బ్యాంకులకు రాయితీలు కల్పించారు. ప్రభుత్వరంగ బ్యాంకులను నిర్వీర్యం చేయడం ప్రారంభమైంది. నరసింహన్ కమిటీ సరళీకృత ఆర్థిక విధానాల వల్ల మొట్టమొదటిసారిగా బ్యాంకులపై రిజర్వ్ బ్యాంకు ఆధిపత్యం, పర్యవేక్షణ తొలగింపబడి కేంద్ర ఆర్థిక శాఖకు బాధ్యతలు అప్పగించారు. దానివల్ల ప్రభుత్వరంగ బ్యాంకుల్లో రాజకీయ చొరబాటుకు అవకాశం కల్పించారు. ప్రభుత్వరంగ బ్యాంకులపై ఒత్తిడి తెచ్చి కార్పొరేట్ బడా పెట్టుబడిదారులకు ప్రభుత్వరంగ బ్యాంకుల ద్వారా రుణాలను మంజూరు చేయించి, నిరర్థక ఆస్తులకు కారణభూతం అయింది. నింద మాత్రం ప్రభుత్వరంగ బ్యాంకులపైన పడింది.

1991 నుంచి సరళీకృత ఆర్థిక విధానాల వల్ల విదేశీ ప్రత్యక్ష, పరోక్ష, పెట్టుబడులు భారతదేశంలోకి స్వేచ్ఛగా ఆహ్వానించారు. డిపాజిట్ బేస్ శరవేగంగా పెరిగి కార్పొరేట్ పెద్ద రుణాలకు వెళ్లాల్సిన అవసరం ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వం సంస్కరణలో భాగంగా కార్పొరేట్లకు, విదేశీ బహుళ జాతి కంపెనీలకు పెద్ద రుణాలు మంజూరు చేశారు. సగానికి పైగా సూట్ కేస్, డొల్ల కంపెనీలు అవ్వడం మూలానా తీసుకున్న రుణాలు చెల్లించలేదు. తత్ఫలితంగా నిరర్థక ఆస్తులు పెరిగి ప్రభుత్వరంగ బ్యాంకులు నష్టాల ఊబిలో కూరుకుపోయాయి. రుణాలు మంజూరు చేయడంలో బ్యాంకులపై ఒత్తిడి తెచ్చిన ప్రభుత్వాలు వసూళ్ల విషయంలో బాధ్యతల నుంచి తప్పుకొని బ్యాంకులను బలి పశువులను చేశాయి. ప్రభుత్వరంగ బ్యాంకుల నష్టాలను అధిగమించడానికి 'హెయిర్కట్' పేరుతో రుణమాఫీ జరగాలనే కేంద్ర ప్రభుత్వం విధానం వల్ల కార్పొరేట్ రుణమాఫీ అయ్యింది. ఎఆర్‌సి వంటి ప్రయివేట్ కంపెనీలకు కార్పొరేట్ రుణాలను అతిచౌకగా అమ్మివేశారు. 'రెవెన్యూ రికవరీ యాక్ట్' వంటి చట్టాలను బలోపేతం చేసి కార్పొరేట్ రుణ ఎగవేతదారులను కఠినంగా శిక్షించాల్సిన తరుణంలో కార్పొరేట్ల కొమ్ముకాశారు. ఇన్సాల్వేన్సీ, బ్యాంక్రప్టసీ కోడ్ 2016, ద బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్టు సవరణలను ఆర్డినెన్స్ ద్వారా పార్లమెంట్‌లో పెట్టబడి ఎన్‌సిఎల్‌టి ద్వారా 12 బడా కార్పొరేట్ రుణ ఎగవేతదారులకు రుణమాఫీ సదుపాయం కల్పించారు. రుణమాఫీ చట్టబద్ధం చేసింది కేంద్ర ప్రభుత్వం. ఎన్‌సిఎల్‌టి ద్వారా 15 లక్షల కోట్ల కార్పొరేట్ రుణాలు మాఫీ చేశారు.

2017-2025లో వాస్తవానికి భారతదేశంలో కార్పొరేట్ బ్యాంకింగ్ 1991 నుంచే సంస్కరణల కాలంతో సమాంతరంగా ప్రారంభమైంది. సరళీకృత ఆర్థిక విధానాల వల్ల ప్రారంభమైన అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి 2017 నుంచి రూపాంతరం చెంది, వేగవంతమైన సాంకేతిక నైపుణ్యం వల్ల క్షణాల్లో చేతులు మారి, ఆర్థిక అస్థిరతకు కారణభూతమవుతుంది. దీనివల్ల నిరుద్యోగం పెరిగి ప్రజల కొనుగోలు శక్తి తరిగి, ఉత్పత్తి పెరిగి ఆర్థికమాంద్యానికి దారితీస్తున్నది. ఈ విధానాల వల్ల అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల్లో ఆర్థిక సంక్షోభం ఏర్పడి అరాచకం ప్రబలడానికి కారణభూతమవుతుంది. అనేక సందర్భాల్లో ప్రభుత్వాలు కార్పొరేట్ పెట్టుబడిదారుల చేతులలో కీలుబొమ్మలుగా మారి, దేశాన్ని తాకట్టుపెట్టే పరిస్థితి దాపురించిందంటే అతిశయోక్తి కాదు. పెట్టుబడిదారుల చేతుల్లో కీలుబొమ్మలుగా మారిన ప్రభుత్వాలు ఎన్నో ఏళ్ల పోరాటాల ఫలితంగా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను, 4 లేబర్ కోడ్ల ద్వారా కాలరాసే దుశ్చర్యకు పాల్పడడం అనేది తీవ్ర పరిణామం.

ట్రేడ్ యూనియన్ రంగాల పాత్ర

భారతదేశ సహజ వనరులు, పరిశ్రమలు, వ్యవసాయం, గ్రామీణ కుటీర పరిశ్రమలు, కార్పొరేట్ బడా పెట్టుబడిదారులకు అతి చౌకగా అమ్మివేయడం, ధారాదత్తం చేయడం వంటి చర్యలను నిలువరించడానికి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక, అసంఘటిత రంగాల ట్రేడ్ యూనియన్లు కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సమర శంఖారావం పూరించి, ఎల్‌పిజి సామ్రాజ్యవాదుల, పెట్టుబడిదారుల ఆధిపత్యాన్ని అడ్డుకొని, భారతదేశ అస్థిత్వాన్ని కాపాడుకోవడంలో సఫలీకృతులు అయ్యాయి. అంతవరకు బ్యాంకింగ్ రంగం ట్రేడ్ యూనియన్లు తమ జీతభత్యాల కోసం, అస్థిత్వం, స్థితిగతులు కోసం చేసే పోరాటాలు, తమ జీతభత్యాలను సహితం త్యాగం చేసే దేశభక్తియేతర పోరాటాలుగా రూపాంతరం చెందాయి. ఈ నేపథ్యంలో 1997లో బ్యాంకింగ్ రంగంలో తొమ్మిది ట్రేడ్ యూనియన్లు సంఘటితమై యుఎఫ్‌బియుగా ఆవిర్భవించాయి. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకొని, భారతదేశ సహజవనరులను, ఆర్థిక సార్వభౌమత్వానికి కాపాడడానికి బ్యాంకింగ్ రంగ ట్రేడ్ యూనియన్లు 56 సార్లు గత 33 ఏళ్లలో సమ్మె రూపంలో పోరాటాలు సాగించాయి. అందులో 18 సార్వత్రిక సమ్మెలు వివిధ ట్రేడ్ యూనియన్ రంగాలతో మమేకమై సాగించే దేశభక్తియుతమైన సమ్మెలు కావడం గమనార్హం.

పెట్టుబడిదారుల చేతులలో కీలుబొమ్మగా ప్రభుత్వాలు, ఎన్నో ఏళ్ళ పోరాటాల ఫలితంగా సాధించుకున్న 29 కార్మిక చట్టాల కాలరాసే దుశ్చర్యలను అడ్డుకొని తమ హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఆసన్నమైంది. సహజవనరులు, ప్రభుత్వరంగ సంస్థలు, వ్యవసాయం, విద్యలను వ్యాపారంగా చూసే దృష్టి తదితర అంశాల మనుగడకు ప్రమాదం వాటిల్లే దశలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక సోదరులందరూ ఏకతాటిపై నిలిచి సంఘటిత పోరాటాలలో మమేకమై 'ప్రపంచ కార్మికులారా ఏకం కండు' అనే నినాదంతో భుజం కలుపుతూ... కదం తొక్కుతూ.... వదం పాడుతూ... హృదంతరాలం గర్జిస్తూ... విప్లవ శంఖం పూరించి, ప్రభుత్వరంగ సంస్థలను, దేశాన్ని రక్షించుకోవడానికి దిశా నిర్దేశకంగా ముందుకు సాగాలి.

- మండ శ్రీనివాసరావు, రాష్ట్ర అధ్యక్షులు ఇండియన్ బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్, (బిఇఎఫ్ఐ), కేంద్ర కమిటీ సభ్యులు (బిఇఎఫ్)



ప్రత్యామ్నాయం

- ప్రభుత్వరంగ బ్యాంకులు, ప్రభుత్వరంగ సంస్థల బలోపేతానికి చర్యలు తీసుకోవాలి.
- దేశ ఆర్థికవ్యవస్థను నాశనంచేసే ఎల్‌పిజి ప్రయివేటీకరణ విధానాలకి స్వస్తి పలకాలి.
- బ్యాంకింగ్ శాఖలను పెంచి, దేశం నలుమూలలా బ్యాంకింగ్ సేవలను విస్తరించి, ప్రతి పౌరునికీ బ్యాంకుల సేవలు అందుబాటులో ఉండే విధంగా శాశ్వత ఉద్యోగ నియామకాలు చేపట్టాలి.
- జాతీయ గ్రామీణ బ్యాంకులను విలీనం చేసి భారత జాతీయ గ్రామీణ బ్యాంక్ ఏర్పాటు చేసి, చిన్న, సన్నకారు రైతులను, గ్రామీణ కుటీర, చిన్న, మధ్యతరగతి పరిశ్రమలను, వ్యవసాయరంగాన్ని ఆదుకునే విధంగా చర్యలు చేపట్టాలి.
- వినాశకర బ్యాంకుల విలీనాలకు స్వస్తి పలకాలి.
- అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్, తాత్కాలిక ఉద్యోగ నియామకాలకు స్వస్థి పలికి శాశ్వత ఉద్యోగ నియామకాలు చేపట్టి ప్రజలకు ఉద్యోగ భద్రత కల్పించాలి.
- ప్రభుత్వరంగ సంస్థలలోకి విదేశీ ప్రత్యక్ష, పరోక్ష పెట్టుబడులను పూర్తిగా ఉపసంహరించుకోవాలి.
- లేబర్ కోడ్లను రద్దు చేసి, కార్మిక చట్టాలను అమలు పరచాలి. బ్యాంకుల నిరర్థక ఆస్తులకు కారణం రాజకీయ, కార్పొరేట్ వ్యక్తులే, సామాన్య రుణగ్రహీతల వల్ల కాదు అన్న నగ్నసత్యాన్ని అందరూ గమనించాలి.
- నిరర్థక ఆస్తుల విషయంలో కార్పొరేట్ రుణ ఎగవేతదారుల పేర్లను బహిరంగంగా ప్రకటించి, దోషులను కఠినంగా శిక్షించాలి.
- వాళ్ల ఆస్తులను జప్తు చేయాలి. రెవెన్యూ రికవరీ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలి.

కొండచీపుర్ల తయారీతో ఉపాధి

ప్రజాశక్తి- నౌపడ

పుట్టింటి నుంచి రాని వస్తువు వారికి అత్తింటిలో ఉపాధినిస్తుంది. స్వయంగా కొండచీపురు తయారు చేసుకుంటూ ప్రగతిపథంలో దూసుకుపోతున్నారు సంతబొమ్మాళి మండలం సీతానగరం మహిళలు. ఖాళీ సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. గ్రామానికి చెందిన బత్సల ధనలక్ష్మి దగ్గర కొండ చీపురుల తయారీ నేర్చుకున్న మహిళలు వీటిని తయారు చేసుకుంటూ ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. సుమారు 70 కుటుంబాలు ఈ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు.

సీతానగరానికి చెందిన బత్సల ధనలక్ష్మి పదేళ్ల కిందట బతుకు తెరువు కోసం అండమాన్ వలస వెళ్లింది. అక్కడ ఉపాధి నిమిత్తం పలు ప్రాంతాల్లో తిరిగి ఒక కుటీర పరిశ్రమలో మూడు నెలలపాటు చీపుర్ల తయారీ నేర్చుకుంది. అనంతరం తన భర్త సోమేశ్వరరావు ప్రోత్సాహంతో సొంత గ్రామంలోనే చిన్న కుటీర పరిశ్రమలు ప్రారంభించింది. మొదట్లో కాస్త పెట్టుబడి పెట్టి శ్రీముఖలింగం, మెళియాపుట్టి ప్రాంతాల నుంచి చీపురుకు కావలసిన కుంచెను, నారని తెచ్చి చీపుర్లు కట్టేది.

అది చూసిన చుట్టుపక్క మహిళలు ఆసక్తితో ఆమె ఇంటికి వెళ్లి నేర్చుకున్నారు. స్వయంశక్తి సంఘాల రుణాలతో ఉపాధి పొంది ముందుకు పోతున్నారు. గ్రామంలో 280 కుటుంబాలు ఉండగా, ప్రస్తుతం 70 పైగా కుటుంబాల వారు చేతి వృత్తిలా నిత్యం పనిచేస్తూ ఉంటారు. గ్రామంలో వంద మంది చీపుర్లు తయారు చేస్తూ రోజుకు రూ.400 నుంచి రూ.వెయ్యి వరకు సంపాదిస్తున్నారు. తయారు చేసిన చీపురులను శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఒడిశా రాష్ట్రానికి ఎగుమతి చేసి అమ్ముతుంటారు. అయితే తిత్లీ తుపానుకు గ్రామంలో చీపుర్లు తయారీ సామగ్రి పూర్తిగా తడిచిపోయి రూ.20 లక్షల వరకు నష్టం వాటిల్లిందని అంచనా. అయినా వాళ్లకి ఇంత వరకు నష్టపరిహారం అందలేదని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిశ్రమను ప్రభుత్వం ప్రోత్సహించి మహిళా సంఘాల ద్వారా రుణాలను అందించడం ద్వారా మరింత మందికి ఉపాధి కలిగి వారి జీవితాల్లో వెలుగు నింపవచ్చు.



చీపుర్లు కడుతున్న మహిళలు

మహిళలను ప్రోత్సహిస్తున్నాను

అండమాన్లో ఒక కుటీర పరిశ్రమలో నేర్చుకుని, మా గ్రామంలో 70 మంది వరకు చీపుర్లు కట్టడం నేర్పించాను. ఇంటివద్దనే ఉంటూ రోజుకి రూ.వెయ్యి వరకు సంపాదించుకుటున్నాను. ఆసక్తిగా ఉన్న మహిళలను ప్రోత్సహించి నేర్పిస్తున్నాను. తిత్లీ తుపానుకు రూ.5 లక్షల వరకు నష్టపోయాను. అయినా, ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి నష్టపరిహారం అందలేదు. మహిళా సంఘాల నుంచి రుణాలు మంజూరు చేసి మాలాంటి వాళ్లను ప్రోత్సహించాలి.

- బత్సల ధనలక్ష్మి, సీతానగరం

రుణాలు అందజేయాలి

ధనలక్ష్మి దగ్గర పదేళ్ల క్రితం చీపుర్లు కట్టడం నేర్చుకున్నాను. ప్రస్తుతం నాకు ఇదే బతుకుతెరువు అయింది. రోజుకు రూ.700 వరకు అర్జిస్తున్నాను. డ్వాక్రా బజార్ మాలాంటి వారికి రుణాలు ఇచ్చి ప్రభుత్వం ప్రోత్సహించాలి.

- నీలాపు లక్ష్మి, సీతానగరం

బిఎస్ఎన్ఎల్‌ను నిర్వీర్యం చేస్తున్న కేంద్రం



కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన టెలికాం రంగాన్ని అప్పటి ప్రధాని వాజ్‌పాయి అమెరికా ఒత్తిడికి తలొగ్గి డాట్‌ని బిఎస్ఎన్ఎల్ కార్పొరేషన్‌గా మార్చారు. బిఎస్ఎన్ఎల్ కార్పొరేషన్‌కు ఆర్థిక పరిపుష్టి కల్పిస్తామని, ఉద్యోగులకు ఉద్యోగభద్రత, పెన్షనర్లకు ఫెన్షన్ భద్రత కల్పిస్తామని, గ్రామీణ ప్రాంత ల్యాండ్ లైన్ నిర్వహణ నష్టాలు ప్రభుత్వమే భరిస్తుందని, ప్రయివేట్ కంపెనీలతో సమానంగా పోటీపడడానికి బిఎస్ఎన్ఎల్ సంస్థకు స్వయం ప్రతిపత్తి కల్పిస్తామని నమ్మబలికి దశలవారీగా నిర్వీర్యం చేస్తున్నారు. కార్పోరేటు మొబైల్ కంపెనీల ఒత్తిడికి తలొగ్గి బిఎస్ఎన్ఎల్ రిజర్వ్ ఫండ్ నుంచి ప్రభుత్వం బలవంతంగా రూ.20వేలు కోట్లు కొల్లగొట్టడమే కాకుండా గ్రామీణ సేవల బిఎస్ఎన్ఎల్ నష్టాలు పూడ్చుడానికి ఇచ్చే యుఎస్ఒ (యూనివర్సల్ సోషియాకు ఆబ్లిగేషన్ ఫండ్ ఏడాదికి ఇచ్చే రూ.2వేల కోట్ల నిధులు నిలుపుదల చేసింది. ప్రయివేట్ కంపెనీలకు 4జి, 5జి సేవలకు అవకాశాలు కల్పించి బిఎస్ఎన్ఎల్‌కు మాత్రం 4జి సేవలు నేటికీ పూర్తిస్థాయిలో అందించలేదు. బిఎస్ఎన్ఎల్ పోటీలో ఉంటేనే పేద, మధ్య తరగతి ప్రజలకు మొబైల్ సేవలు చౌకగా అందుతాయి. ప్రభుత్వరంగ సంస్థ అయిన బిఎస్ఎన్ఎల్‌ను రక్షించుకోవడం అందరి బాధ్యత.

- ఎం.గోవర్ధనరావు, బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు